ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-2-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 18 పేజీలు: 10+4 వెల: 6.50

మహాకుంభ్‌లో ఇప్పటికి 55 కోట్ల మంది పుణ్యస్నానం

లోయలో పడిన బస్సు: 51 మంది దుర్మరణం

5

# అర్ధరాత్రి సిఇసియా?




సుప్రీం ఉత్తర్వులు బేఖాతరు చేయడమే..

హడావుడి ప్రకటన ప్రధానికి తగునా?

ప్యానెల్ మీటింగ్‌లో డిస్సెంట్ నోట్ ఇచ్చామన్న రాహుల్

పిటిషన్లపై 'సుప్రీం'లో నేడు విచారణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవికి పేరునుఖరారుచేసి అర్ధరాత్రిపూట ప్రకటించడంపై రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసారు. సిఇసి ఇతర కమిషనర్ల నియామకానికి ఏర్పాటుచేసిన ముగ్గురుసభ్యుల ప్యానెల్ ప్రధానిమోడీ అధ్యక్షతన పనిచేస్తుంది. కమిటీలో హోంమంత్రి అమిత్‌షా, విపక్షనేత రాహుల్‌గాంధీ, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌లు ఉన్నారు. కమిటీ ఎంపిక సమయంలోనే సుప్రీంలో కేసు నడుస్తున్నందున ఉత్తర్వులు వచ్చేంత వరకూ వేచి ఉండాల్సిందిపోయి హడావిడిగా అర్ధరాత్రిపూట ప్రకటించడం ప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షాలకు ఎంత మాత్రం తగదని గౌరవప్రదం కానేకాదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సోమవారం రాత్రిపొద్దుపోయాక సిఇసిగా జ్ఞానేష్‌కుమార్‌ను నియమిస్తున్నట్లుప్రకటించారు. ఇప్పటివరకూ ఆయన పనిచేసిన కమిషనర్ పోస్టుకు వివేక్‌జోషి అనే అధికారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలోనే రాహుల్‌గాంధీ నిర్ణయాన్ని వాయిదావేయాలని సుప్రీం కోర్టు ఉత్తర్వులు వచ్చేంతవరకూ వాయిదా వేయాలనికోరారు. సుప్రీంకోర్టులో ఈ పిటిషన్లు బుధవారం విచారణకు >>2

రాజ్యాంగ ధర్మాసనం తీర్పుపై కేంద్రం నిర్లక్ష్యం: ప్రశాంత్ భూషణ్ 2



మంగళవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీ, ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు దేశాల మంత్రులు

## ఖతార్, భారత్ మధ్య కొత్త వాణిజ్య ఒప్పందం

వచ్చే ఐదేళ్లలో 28 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం

ప్రధాని మోడీతో ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ భేటీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** భారత్ ఖతార్‌లమధ్య వచ్చే ఐదేళ్లలో 28 బిలియన్ డాలర్లమేర ద్వైపాక్షిక వాణిజ్యం జరగాలని రెండు దేశాలు అవగాహనకు వచ్చాయి. భారత్‌లో రెండురోజులపాటు పర్యటించిన ఖతార్ ఎమిర్ షేక్ తమిమ్ >>2

# సైబర్ నేరాలకు కళ్లెం

దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ పోలీసు

సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరు భేష్

కొత్తగా ఏడు సైబర్ పోలీసు స్టేషన్ల ఏర్పాటు

షీల్డ్ - 2025 సదస్సులో సిఎం రేవంత్



హైదరాబాద్‌లో మంగళవారం షీల్డ్ -2025 సదస్సులో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** సైబర్ నేరాల నివారణలో తెలంగాణ పోలీసు విభాగం దేశానికే రోల్ మాడల్‌గా నిలిచిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేనటువంటి సైబర్ సెక్యూరిటీ బ్యూరో తెలంగాణలో ఏర్పాటయ్యిందని, ఈ క్రమంలోనే ఎన్నో కీలక కేసుల్లో నిందితులు పట్టుబడ్డారని ఆయన అన్నా రు. మాదాపూర్‌లోని హెచ్ఐసిసిలో సైబర్ నేరాల నివారణలో సైబర్ నిపుణులు, పోలీసు ఉన్నతాధికారులతో కూడిన రెండు రోజుల సదస్సు షీల్డ్ 2025ను సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం వేగంగా మారుతోందని, ఇదే సమయంలో నేరాలశైలి కూడా అంతే వేగంగా మారుతుందని, ఈ క్రమంలో దేశం మొత్తం ఒక యూనిట్‌గా పనిచేస్తేనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని అన్నారు. ఒకప్పుడు మన ఇంట్లో చొరబడి దొంగతనాలు చేసే దొంగలు నేడు ఎక్కడో విదేశాల్లో కూర్చుని మన బ్యాంకు ఖాతాల్లోని నగదును దోచుకుంటున్నారని, ఇదే సైబర్ నేరాల్లో వున్న మతలబుగా ఆ యన అభివర్ణించారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వాలు, ప్రజలు మారాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రం నేరాల నివారణకు అనేక చర్యలు తీసుకోగా అందులో సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరు ప్రశంసనీయంగా వుందని ఆయన తెలిపారు. గత ఏడాది రాష్ట్రంలో సైబర్ నేరాల నివారణకు కొత్తగా ఏడు పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశామని, ఇప్పటికేవున్న పోలీసు స్టేషన్లకు ఇవి అదనమని >>2

## త్వరలో భూభారతి విధానాలు



కలెక్టర్లు, ఉన్నతాధికారుల సమావేశంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఫిబ్రవరి,18 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీలో డ్రాఫ్ట్ బిల్లు పెట్టి ఆ తర్వాత మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనలు తీసుకొని దేశానికి ఆదర్శంగా ఉండేలా భూ భారతి ఆర్వోఆర్ 2025 చట్టాన్ని తీసుకువచ్చామని అదే స్ఫూర్తితో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో, విస్తృత స్థాయిలో అభిప్రాయాలను సేకరించి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. భూభారతి చట్టం రూపకల్పనకు ఎంత కష్టపడ్డామో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలను తయారు చేయడానికి అదే స్థాయిలో కసరత్తు చేయాలని అధికారులను కోరారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని భూ >>2

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ కాలపరిమితి పెంపు 2

## గుండె పోటుతో కోర్టులోనే కుప్పకూలిన న్యాయవాది

హైకోర్టులో విషాదం



లాయర్ వేణు గోపాలరావు (ఫైల్)

**చార్మినార్,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** తెలంగాణ హైకోర్టులో మంగళవారం విషాద సంఘటన చోటు చేసుకుంది. కోర్టు హాలులో న్యాయవాది కుప్ప కూలిన సంఘటన హైకోర్టులోని న్యాయవాదులను కలచి వేసింది. సీనియర్ న్యాయవాది వేణు గోపాల రావు కోర్టులో కేసును వాదిస్తున్న సమయంలో గుండె పోటుతో ఒక్క సారి కుప్ప కూలిపోయారు. న్యాయవాది వేణు గోపాలరావును తోటి న్యాయవాదులు ఉస్మానియా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కాగా న్యాయవాది వేణు గోపాలరావు గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. న్యాయవాది మృతికి సంతాప సూచకంగా 21వ కోర్టులో పిటిషన్ల విచారణను నిలిపి వేశారు.

# నీటి తగాదా తేల్చండి

కేంద్రాన్ని కోరిన మంత్రి ఉత్తమ్

ప్రాజెక్టులలో పూడికతీత, నదినేలకోత ఖర్చులు కేంద్రమే భరించాలి..

ఉదయ్‌పూర్‌లో జరిగిన జల మంత్రుల సమావేశం



మంగళవారం ఉదయ్‌పూర్‌లో జల మంత్రుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

**ఉదయపూర్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** తెలంగాణకు అన్యాయం జరగకుండా నిరోధించడానికి కృష్ణా నీటి వివాదంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి,డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయపూర్ లో జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రెండవ ఆల్ ఇండియా స్టేట్ వాటర్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్ 2025లో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలం డ్యామ్, నాగార్జునసాగర్ రైట్ బ్యాంక్ నుండి కృష్ణా నది నీటిని అక్రమంగా మళ్లించకుండా ఆపడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణా నది నీటి వినియోగాన్ని పర్యవేక్షించడానికి టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని, తెలంగాణ యొక్క న్యాయమైన వాటాను రక్షించడానికి కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ 2 కేసును త్వరగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ మంత్రి, రాష్ట్రంలోని అన్ని ప్రధాన, చిన్న సాగునీటి ప్రాజెక్టుల యొక్క డీసిల్టింగ్,డీసెడిమెంటేషన్ ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరించాలని కోరారు, ఇదిఇతర రాష్ట్రాలలోని ఇటువంటి ప్రాజెక్టులకు అందించిన మద్దతుతో సమానంగా ఉండాలని ఆయ న పేర్కొన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్‌సేఫ్టీ అథారిటీ విచారణను త్వరగా పూర్తి చేయాలని, ముందుకు సాగడానికి కేంద్రం నుండి స్పష్టమైన లిఖిత సిఫార్సును అందించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ఫ్రేమ్వర్క్ ప్రకారం ప్రధాన మధ్యస్థ సాగునీటి ప్రాజెక్టులలో డీసిల్టింగ్ డీసెడిమెంటేషన్ ప్రయత్నాలను ప్రారంభించిందని, ఈ ప్రయత్నాలకు కేంద్రం నుండి ఆర్థిక సహాయం కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై ఎన్ డి ఎస్ ఎ విచారణ గురించి, ఈ విచారణ చాలా నెలలుగా పెండింగ్లో ఉందని, త్వరగా పూర్తి చేయడానికి, తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టమైన కోర్సును నిర్దేశించడానికి జలశక్తి మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. హైదరాబాద్ గుండా 55 కి.మీ. పరిధిలో ఉన్న మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ గురించి హైలైట్ చేస్తూ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, గంగా, యమునా పునరుద్ధరణ ప్రాజెక్టులకు అందించిన మద్దతుతో సమానంగా మూసీ ప్రాజెక్టుకు కూడా పూర్తి ఆర్థిక మద్దతును కేంద్రం అందించాలని కోరారు. ఈ ప్రయత్నం నది పర్యావరణాన్ని పునరుద్ధరించడం, మురుగునీటి నిర్వహణను మెరుగుపరచడం, హైదరాబాద్ కోసం స్థిరమైన నీటి నిర్వహణను నిర్ధారిస్తూ పట్టణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన పేర్కొన్నారు. మూసీ నది వెంట ట్రంక్, ఇంటర్సెప్టర్ సీవర్ నెట్వర్క్‌ను ఏర్పాటు చేయడానికి రూ. 4,000 కోట్లు, గోదావరి నదిని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్లతో లింక్ చేయడానికి అదనంగా రూ. 6,000కోట్లుకోరారు. ఈలింకేజ్ హైదరాబాద్ >>2



## 'ప్రజల హీరో' అయితే కెసిఆర్‌కు ఓట్లు ఎందుకు పడలేదు?

కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శ

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాంతాల్లో కోడ్ సడలించాలని ఇసికి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** మాజీ సిఎం కెసిఆర్ త్యాగాలు చేసింది నిజమే... తెలంగాణ ఉద్యమాన్ని నడిపించింది నిజమేనని, 4 కోట్ల ప్రజల హీరో అయితే మరి ఆ ప్రజలు ఆయనకు ఓట్లు ఎందుకు వేయలేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం పడిపోతుందని బిఆర్ఎస్ వాళ్లు చెప్పడం వారు అధికారం కోల్పోయిన ఆవేదనలో చేస్తున్న వ్యాఖ్యలేనని ప్రజలు అనుకుంటున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలన జనానికి నచ్చకపోతే రాజ్యాంగం మేరకు పరిస్థితులను అనుసరించి ఎన్నికలొస్తాయే తప్ప ఎవరో కోరుకుంటే ఎన్నికలు రావని పేర్కొన్నారు. మంగళవారం శాసన మండలిలోని తన ఛాంబర్ లో ఆయన మీడియా మిత్రులతో చిట్ చాట్ చేశారు. దేశంలో ఏ రాష్ట్రములో చేయని విధంగా తెలంగాణ రాష్ట్రములో సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి, రాజకీయ కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) నిర్వహించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం పర్ఫెక్ట్ కులగణన సర్వే చేసిందని, 94,863 ఎన్యూమరేటర్స్, 9,628 సూపర్ వైజర్స్, 76,000 డేటా ఎంట్రీ ఆపరేటర్లు ద్వారా కేవలం 50 రోజుల్లో ఈ సర్వేను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సర్వేలో 97 శాతం ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సర్వే లెక్కలు తప్పుల తడఖా అని విమర్శలు చేయడం సబబు కాదని, ప్రభుత్వం చేసిన కృషిని ఏ పార్టీ వారైనా అభినందించాలని చెప్పారు. ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే లెక్కలు సరిగ్గా లేవు అనడం కరెక్ట్ కాదు. ఓటర్ లిస్ట్‌కి, సర్వే లెక్కలకు తేడా ఉంటుంది ఎందుకు అంటే ఒక్కో వ్యక్తికి రెండు చోట్లా ఓటు హక్కు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఓటర్ లిస్ట్ ఆధార్‌కి అనుసంధానం చేస్తే కరెక్ట్‌గా లెక్కలు వచ్చేయని స్పష్టం చేశారు. ఇంకా 3 లక్షల కుటుంబాలు సర్వే అధికారులకు వివరాలు ఇవ్వలేదని, వారు తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉన్నతాధికారులను, అధికారులను అభినందిస్తున్నానని తెలిపారు. టీచర్స్ ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ విధించడం వలన అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోతున్నాయి. కేవలం 25000 ఓట్ల ఎన్నిక కోసం రాష్ట్ర వ్యాప్తంగా కోడ్ అమలు >>2


ప్రభుత్వ సిబ్బందితో నిర్వాహకుల కుమ్మక్కు

ఇ-పౌర సేవల పేరుతో సాగుతున్న దోపిడి

కేంద్రాలలో రుసుముల పట్టిక అదృశ్యం.. సిబ్బంది ఎంతంటే అంత ఇవ్వాల్సిందే..

వారి చేతివాటానికి విలవిల్లాడుతున్న రైతులు

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు సైతం భారీగా చెల్లింపులు




# 'దళారు'ల సేవలో 'మీ సేవ'?

**హైదరాబాద్,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా ప్రజలకు ఇ-పౌరసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన "మీసేవ"కేంద్రాలు దళారీ దోపిడి కేంద్రాలుగా మారాయి. ప్రభుత్వం నిర్ధేశించిన రుసుము కంటే అధికమొత్తం వసూలు చేస్తున్నాయి. కొంత మంది "మీసేవ"నిర్వహకులు అధికారులకు పౌరులకు మధ్య దళారులుగా మారి అమ్యామ్యాల వసూల్‌రాజాలుగా అవతరించారు. పౌరసేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది "మీసేవ"కేంద్ర నిర్వహకులతో కుమ్మక్కు అవడంతో దోపిడికి అంతంలేకుండా పోతున్నది. ఇ-పౌరసేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్ధేశించిన రుసుముల పట్టి చాలా కేంద్రాలలో బహిరంగంగా ప్రదర్శించరు దీనితో వారు నోటికి ఎంత చెబితే అంత ప్రజలు చెల్లించుకోవాల్సి వస్తున్నది. రెవెన్యూ, ఎన్ఐసి మీసేవ కేంద్రాలను తనిఖీ చేసినదాఖలు లేకపోవడంతో ప్రజల ముక్కుపిండి దోచుకొంటున్నారు. పట్టాదారుపాస్‌బుక్, పహాణీ, వన్‌బి, జనన,మరణ ధృవీకరణ, కొత్తగా ఇల్లు నిర్మించినా వ్యవసాయ బావికాడ విద్యుత్ మీటరు కావాల్సి వచ్చినా మీ సేవ కేంద్రాలకు వెళ్ళి దరఖాస్తు చేసుకోవాల్సిందే విద్యుత్ కనెక్షన్ కావాలంటే ఎన్‌పిడిసిఎల్, లేదా ఎస్‌పిడిసిఎల్ కానీ తెలంగాణలో ఈ రెండు పవర్‌డిస్ట్రిబ్యూటర్‌కు చెందిన స్థానికంగా ఉండే లైన్‌మెన్ ముందుగా సంప్రదించాలి. ఆయన ఏ మీ సేవా కేంద్రంకు వెళ్ళి దరఖాస్తు చేసుకోమంటారో అక్కడికే వెళ్ళి దరఖాస్తుచేసుకోవాలి. మీటర్ కోసం 5500 డిడి కట్టాల్సి ఉంటే వారు కనీసం 1500 నుంచి 2000వరకు అత్యధిక రుసుము వసూలు చేస్తారు. కొత్తగా ఇళ్ళు కట్టే వారు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ తీసుకొనేవారు మీసేవనిర్వహకులు ఏడువేలంటే >>2



## రేపు ఢిల్లీ బాద్‌షా ప్రమాణం

రామ్‌లీలామైదాన్‌లో భారీ ఏర్పాట్లు

50 మందికిపైగా సినీతారలు, పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** రెండున్నరదశాబ్దాల తర్వాత దేశరాజధాని న్యూఢిల్లీ రాష్ట్రంలో బిజెపి పాలన పగ్గాలుచేపడుతోంది. ఇందుకోసం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు సిద్ధం అవుతోంది. 20వ తేదీ రామ్‌లీలామైదాన్‌లో ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారంచేస్తారు. ఆయనతోపాటే ఎనిమిది మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేస్తారని బిజెపి నేతలు చెపుతున్నారు. కాగాప్రమాణస్వీకారానికి ఎ న్డీయే పాలిత రాష్ట్రాలముఖ్యమంత్రులు, పార్టీ చీఫ్‌లు ఇతర ముఖ్యులు హాజరవుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రక్షణ మంత్రిరాజ్‌నాథ్; హోంమంత్రి అమిత్‌షాలతోపాటు కేంద్రకేబినెట్‌మంత్రులు కూడా హాజరవుతారని బిజెపి కేంద్ర కమిటీ చెపుతోంది. అలాగే భారీ ఎత్తున సినీతారలు, పారిశ్రామికవేత్తలకు కూడా ఢిల్లీసర్కారు >>2

## ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ కాలపరిమితి పెంపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి18:** ఎస్సీ వర్గీకరణ అంశంపై హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కాలపరిమితిని తెలంగాణ ప్రభుత్వం మరోసారి పొడిగించింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణపై సమగ్ర అధ్యయనం చేసేందుకు జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం చేసి సిఫార్సు చేసేందుకు జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్‌గా గత ఏడాది నవంబర్ 11వ తేదీన బాధ్యతలు చేపట్టారు. వర్గీకరణపై సమగ్ర అధ్యయనం చేసి రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. మొదటిసారి, జనవరి 10వ తేదీన గడువు ముగియడంతో ఈ కమిషన్ కాలపరిమితిని ఫిబ్రవరి 10 వరకు పొడిగించారు. కమిషన్ ఇటీవలే ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే, ఈ నివేదికపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో అభ్యంతరాలను పునఃపరిశీలించాలని సూచిస్తూ కమిషన్ కాలపరిమితిని మార్చి 10వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రమాణం

>> ఇప్పటికే ఆహ్వానాలు పంపించింది. ప్రమాణస్వీకారానికి ముందు కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలునిర్వహిస్తుంది. 59 మంది సినీతారలు, ప్రముఖపారిశ్రామిక వేత్తలతోపాటు ఇతర దేశాల దౌత్యవేత్తలు, రాయబారులు, 20 రాష్ట్రాలముఖ్యమంత్రులు, డిప్యూటిసీఎంలు, కేంద్రమంత్రులు, బిజెపి నాయకులు పలువురుపాల్గొంటున్నారు. ఢిల్లీకి చెందిన కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులనుకూడా ఆహ్వానించారు. బాబా రాందేవ్, స్వామి చిదానంద, బాబా బాగేశ్వర్ దీరేంద్రశాస్త్రివంటి ఆధ్యాత్మిక గురువులు ప్రత్యేక అతిథులుగా వస్తున్నారు. అయితే ఇంతకీ సీఎంరేసులో ఎవరున్నారన్నది ఉత్కంఠగానే ఉంది. ప్రస్తుతంమ హిళా నేతకే ఇవ్వాలని భావిస్తే రేఖాగుప్తాపేరు వినిపిస్తోంది. ఆమెపేరును దాదాపుగా ఖరారుచేసారని చెపుతున్నారు. అలాగే న్యూఢిల్లీ సెంట్రల్ నియోజకవర్గంలో ఆమ్ ఆద్మీపార్టీ కన్వీనర్ మాజీ సీఎం కేజ్రీవాల్‌పై విజయం సాధించిన బిజెపి నేత సాహిబ్‌సింగ్‌వర్మపేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. 19వ తేదీ బుధవారం శాసనసభాపక్ష సమావేశం జరుగుతుంది.

### వారం - వర్జ్యం

తేది : 19-02-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
షష్ఠి ఉ.7.33
స్వాతి ఉ.10.39
వర్జ్యం : సా.4.54-6.42
దు.ఉ.12.06-12.52
శుభసమయం : ఉ.9.40-10.30
సా.5.00-6.00
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం :** ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. సోదరుల నుండి శుభవార్తలు.

**వృషభం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:**రుణవత్తిడులు ఎక్కువై ఎదురై చికాకులు పెడతాయి. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** ఇంటాబయటా సమస్యలు వేధిస్తాయి. ప్రముఖులతో పరిచయాలు.

**సింహం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ధనలాభం.

**కన్య :** మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుంటారు. ప్రయాణాలు.

**తుల :** నూతన వస్తు, వస్త్రా, విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:**వృత్తి, వ్యాపారాలలో లాభాలు సాధిస్తారు. విందు, వినోదాలు.

**ధనుస్సు:** చేపట్టిన పనులలో ఇబ్బందులు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

**మకరం:** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం.

**కుంభం:** ఎంత కష్టపడ్డా ఫలితం ఉండదు. ధనవ్యయం పెరుగుతుంది.

**మీనం :** భాగస్వామ్య వ్యాపారాలలో లాభాలు పొందుతారు. వాహనయోగం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'దళారు'ల సేవలో 'మీ సేవ'?

>> ఏడువేలు ఎనిమిదివేలంటే ఎనిమిది వేలు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జనన, మరణ ధృవీకరణ పత్రాలకు 45 రూపాయలు చెల్లించాల్సి ఉండగా 100 నుంచి 125 రూపాయలు వసూలు చేస్తున్నారు. 2018, ఫిబ్రవరి 28న తెలంగాణ ఐటి మంత్రి కెటి రామారావు ఈ యాప్‌ను ప్రారంభించాడు. భూరికార్డులు ధరణితో ప్రక్షాళన చేసిన తరువాత పాస్‌బుక్‌లకు ఆన్‌లైన్‌లో అప్లేచేసే విధానం అమలులోకి తేవడంతో మీ సేవా కేంద్రాలకు గిరాకి పెరిగింది. రైతులు భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్, ఇతర సేవలకు మీసేవ కేంద్రాల భారీగా తరలివస్తున్నారు. అన్నదాతల అమాయకత్వంతో మీసేవ నిర్వహకులు చెలగాటం ఆడుతున్నారు. మ్యుటేషన్ కోసం ప్రభుత్వం 45 రూపాయలు ,పాస్‌బుక్‌కోసం 100రూపాయలు సేవా చార్జీ వసూలు చేయాలని నిర్ణయించగా నిర్వహకులు మాత్రం 200- 250 రూపాయలు వసూలు చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పహాణీ కోసం 35 రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా వంద రూపాయలు నివాసం, కులం, ఆదాయం సర్టిఫికెట్స్ కోసం 45 రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా 60 నుంచి 100 రూపాయల వరకు వసూలు చేయడం జరుగుతోన్నది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 5216 ఫ్రాంచైజ్ కేంద్రాల్లో ఈ సేవ ద్వారా ఆన్‌లైన్ సేవలను అందిస్తున్నారు. ఇందులో 10 శాతం లాభం ప్రభుత్వానికి, 90 శాతం లాభం లైసెన్స్ పొందిన ఫ్రాంచైజీకి వెళుతుంది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అందించిన ఆన్‌లైన్ సేవాకేంద్రం. 38 ప్రభుత్వశాఖలకు చెందిన 204 సేవలు మీ సేవ కేంద్రాలలో లభిస్తాయి. వ్యవసాయం, రెవెన్యూ, పోలీసు, ఎండోమెంట్, ఆర్‌టిఎ, ట్రావెల్ తదితర ప్రభుత్వశాఖల ఆన్‌లైన్ సేవలు పౌరులకు లభిస్తాయి. అంతేకాదు 600 ప్రైవేట్ సంబంధిత ఆన్‌లైన్ చెల్లింపుల సేవలు అందించడుతున్నాయి. 2018 ఫిబ్రవరిలో ఈ సేవ ద్వారా 10 కోట్ల లావాదేవీలను పూర్తి చేయబడ్డాయి. రాష్ట్ర ఏర్పాటు తరువాత డిజిటల్ లావాదేవీల విభాగంలో తెలంగాణ రాష్ట్రం భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఇందులోని సాఫ్ట్‌వేర్‌ను తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీస్ (టిఎస్‌టిఎస్) అభివృద్ధి చేసి, సహకరిస్తోంది. 2011, నవంబరు 4 న ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో మీ సేవ ప్రారంభించబడింది. 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, దీని సేవలు విభజించబడ్డాయి. 2018, ఏప్రిల్ 12న పట్టాదారు పాస్ బుక్ లకు ఆధార్ సీడింగ్ నేను మీ సేవ సర్వీసు ప్రొవైడర్స్ కు ఇవ్వబడింది. ఈ సేవ కేంద్రాలలో ఈకెవైసీ పద్ధతిని ఉపయోగించి ఆధార్ ఖాతాకు బయోమెట్రిక్‌లను నవీకరించవచ్చు. మీ సేవా 2.0లో భాగంగా మొబైల్ వినియోగదారులకోసం ఒక యాప్ తయారుచేశారు. ఈ యాప్ లో 180 సేవలు, మీ సేవా సేవలు, ఆర్టీఏ సేవలు, ఫీజు చెల్లింపులు, బిల్ చెల్లింపు వంటి సేవలు అందిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం తెలంగాణలో 1.58 కోట్ల పౌరసేవలు ఆన్‌లైన్ ద్వారా అందించబడ్డాయి. 2024 సెప్టెంబర్ నెలలో మీసేవా కేంద్రాలలో సాంకేతిక లోపాలు తలెత్తి పది రోజులు అవి నడవకపోతే మొత్తం పౌరసమాజం అనిశ్చితికి గురైంది. వివిధ కళశాల అడ్మిషన్స్ జరిగే సమయంలో విద్యార్థులు సీటు ఉంటుందా పోతుందా అని ఆందోళన చెందారు. మీసేవా కేంద్రాలు మాన జీవనంలోఒక భాగంగా మారడంతో అవి దళారి కేంద్రాలుగా మారాయి.

**మీసేవ ఫిర్యాదుల కోసం 1100కాల్ సెంటర్ వినియోగదారుల ఫోరం ఆశ్రయించవచ్చ:**

మీ సేవ కేంద్రాలలో సేవలల్లో దోపిడికి గురైతే 1100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాదు వినియోగదారుల ఫోరంకు వెళ్ళినా సెంటర్‌పై చర్యలు తీసుకొంటారు. హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన పి. నరేష్ కెపిహెచ్‌బి ఫోర్త్‌ఫేజ్‌లోని మీ సేవాకేంద్రంలో ద్విచక్రవాహనం ఆర్సీ ట్రాన్స్‌ఫర్ స్లాట్ బుక్ చేయించాడు. ప్రభుత్వ నిర్దేశిత రుసుము 620 ప్లస్ 35 యూజర్ చార్జీలు కలిపి 620 మాత్రమే సదరు వినియోగారుడి వద్ద వసూలు చేయాలి. కానీ ప్రింటర్ చార్జీఅంటూ 670 రూపాయలు సదరు నిర్వహకుడు వసూలు చేయడంతో వినియోగదారుడి ఫోరంను ఆశ్రయించగా ఆ వ్యక్తి ఫోరం ఖర్చులతోపాటు వెయ్యి రూపాయలు పరిహారం ఇప్పించారు. ఇలాంటి అంశాలను పౌరులు తెలుసుకొని దోపిడికి గురికాకుండా ఉంటాం. కాల్‌సెంటర్, వినియోగదారుల ఫోరం వంటి అంశాలపై పౌరులకు పెద్దగా అవగాహన లేకపోవడంతో ఫిర్యాదులు చేయడంలేదు. మీ సేవ కేంద్రాలను రెవెన్యూ అధికారులు, ఎన్‌ఐసి అధికారులు ప్రతి నెల పర్యవేక్షణ చేయాలి. పౌరులతో మీ సేవ నిర్వహకుల తీరు వాకబు చేయాలని కానీ ఎవరు చేయడంలేదు. గిర్ధావర్, నాయబ్‌తహసిల్దార్ ఎన్‌ఐసి డిఎంలు గరిష్ఠసంఖ్యలోతనిఖీలు చేయాల్సి ఉన్నా వారు ఏసి రూమ్‌లనుంచి కదలడంలేదు.

**సబ్‌లీజులకు మీసేవ కేంద్రాలు**

యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మీసేవాకేంద్రాలు కేటాయిస్తున్నది. తెలంగాణలో కొంత మంది మీసేవ కేంద్రాలు సబ్‌లీజ్‌కు ఇస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి మొదట పొందిన వ్యక్తి కొన్ని చోట్ల వాటిని అమ్ముకొన్న సంఘటనలు కూడా ఉన్నాయి. మీ సేవ కేంద్రాలు కేటాయింపుల్లో కూడా దళారులు పెరిగారు. మొదట్లో మీ సేవ కేంద్రాలు బాగనే నడిచినా రానురాను అవినీతి పెరిగింది. తహసిల్ధార్‌లు వీటి నిర్వహణను గాలికి వదిలేశారని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం ఉచితంగా పౌరులకు సేవలు కల్పించాలని మీ సేవా కేంద్రాలకు యూజర్ చార్జీలు ఇస్తామని కొన్ని పథకాలకు మినహాంపులు ఇచ్చినా వందలు వసూలు చేస్తున్నారు. గతంలో ఆసరా పెన్షన్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తుదారుల నుంచి 300నుంచి 600వరకు వసూలు చేసిన అనుభవాలు ఉన్నాయి.

## నేరాలకు కళ్లెం

>> ఆయ న తెలిపారు. సైబర్ నేరగాళ్ల పంథా మారుతుందని, కొత్త కొత్త తరహాలో నేరాలు చేస్తూ పోలీసులతో పాటు నిపుణులకు సైతం సవాల్ విసురుతున్నారని సిఎం తెలిపారు. వీటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులను ఆ యన కోరారు. సైబర్ నేరాల నివారణకు, కొత్త తరహా నేరాల అదుపుకు చేబ ట్టాల్సిన చర్యలపై ఏర్పాటైన షీల్డ్ సదస్సు ఒక మంచి పరిణామమని సిఎం తెలిపారు. దే శ, విదేశాలకు చెందిన సైబర్ నిపుణులతో పాటు దేశ వ్యాప్తంగా 14 రాష్ట్రాల పోలీసు విభాగాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు పాల్గొంటున్న ఈ సదస్సు సైబర్ నేరాల నివారణకు మంచి సూచనలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో నేరగాళ్ల నుంచి సొత్తును జప్తు చేయడం, బాధితులకు అందజేయడంలో సైబరాబాద్ ముందు వరుసలో వుందని ఆయన తెలిపారు. ఐటి మంత్ర శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాబోయే రోజులు కృత్రిమ మేధస్సు దేనని అన్నారు. ఇదే సమయంలో సాంకేతికంగా కూడా ఎంతో ప్రయోజనం వుంటుందని ఆయన తెలిపారు. అయితే ఇందులో అనేక సవాళ్లు వున్నాయని ఆయన అ న్నారు. సైబర్ నేరగా ళ్ల కొత్త తరహా నేరాల పోకడ భవిష్యత్తులో ఇబ్బందులు కలిగించే వీలుందని ఆయన అన్నారు. ఈ వి షయంలో నిపుణులతో పాటు పోలీసులు సమిష్టిగా కృషి చేసి, వీటిని నివారించాలని ఆయన కోరారు. ఇప్పటికే వున్న ర్యాన్సమ్‌వేర్, డీప్‌ఫేక్, మాల్వేర్ వంటివి సైబర్ నేరగాళ్లకు వరంగా వున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు. సాంకేతికకు రెండు వైపుల మదును వుంటుందని, సైబర్ దాడుల వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. ఇటీ వల ఢిల్లీలోని ఎయిమ్స్‌పై సైబర్ దాడి జరిగిందని, అమెరికాలో జరిగిన సైబర్ దాడిలో విమాన రాకపోకలు స్తంభించాయని మంత్రి తెలిపారు. సైబర్ నేరాల వల్ల భా రత్ ఏటా 15 వేల కోట్ల రూపాయలకు పైగా నష్ట పోతోందని ఆయన తెలిపారు. సైబర్ నేరాలపై అనేక దేశాల ఆర్థిక వ్యవస్థపై దెబ్బ పడిందని ఆయన తెలిపారు. కా గా షీల్డ్ 2025 సదస్సు ఒక మంచి చర్చా వేదికగా ఆయన అభివర్ణించారు. 14 రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులతో పాటు అనేక మంది సైబర్ నిపుణులు ఈ సదస్సులో పాల్గొంటున్నారని మంత్రి తెలిపారు. సైబర్ నేరాల నివారణకు ప్రతిష్టాత్మక సంస్థలతో ఒప్పందం చేసుకున్నామని ఆయ న చెప్పారు. 2024లో సైబర్ నేరాల్లో నేరగాళ్లు కాజేసిన సొమ్ములో 350 కోట్ల రూపాయలను జప్తు చేయగా ఇందులో 183 కోట్ల రూపాయలను 18 వేల మందికి పైగా బాధితులకు అందజేశామని మంత్రి తెలిపారు. గత ఏడాది దేశ వ్యాప్తంగా 28,869 సైబర్ నే రాలు నమోదయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, డిజిపి జితేందర్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజి శిఖా గోయ ల్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మొహంతితో పాటు 14 రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సు బుధవారం నాడు ము గుస్తుంది.

## నీటి తగాదా తేల్చండి

>> యొక్క తాగునీటి సరఫరాను భద్రపరచడంతో పాటు మూసీ నది పునరుద్ధరణను కూడా నిర్ధారిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, సమక్క సరక్క ప్రాజెక్ట్, సీతారామ సాగర్ ప్రాజెక్ట్ కోసం నీటి కేటాయింపును త్వరగా పూర్తి చేయాలని, తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో దీర్ఘకాలిక నిధులను అందించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. "ఇండియా ఎట్‌దారేట్ ఆఫ్ 2047 – ఎ వాటర్ సెక్యూర్ నేషన్" అనే థీమ్తో నిర్వహించబడిన ఆల్ ఇండియా వాటర్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్, దీర్ఘకాలిక నీటి భద్రతా వ్యూహాలపై దృష్టి పెట్టింది. తెలంగాణ డిమాండ్లు కృష్ణా నది నీటి కేటాయింపు, కీలకమైన సాగునీటిప్రాజెక్టులకు నిధులు, మూసీనది పునరుద్ధరణకు సంబంధించిన అత్యవసర అంశాలను హైలైట్ చేశాయి, ఇవి రాష్ట్రం యొక్క నీటి భద్రత అభివృద్ధికి కీలకమైనవి.

### 'సుప్రీం'లో విచారణకు రాని 'ఫిరాయింపుల' కేసు


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి18:** బిఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల కేసు సుప్రీంకోర్టులో మంగళవారం విచారణకు రాలేదు. మొదట ప్రకటించిన తేదీ ప్రకారం మంగళవారం విచారణ జరగాల్సి ఉండింది. ఈ కేసును జస్టిస్ బిఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది. జస్టిస్ బిఆర్ గవాయి మంగళవారం కానిస్టిట్యూషనల్ బెంచ్ సమావేశంలో పాల్గొన్న కారణంగా ఫిరాయింపు కేసును విచారణకు తీసుకోలేదు. బుధవారం కూడా కానిస్టిట్యూషనల్ బెంచ్ సమావేశం ఉన్నందున ఫిరాయింపు కేసు విచారణకు వచ్చే అవకాశం లేదు. మరో తేదీ ప్రకటించే అవకాశం ఉంది.



ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేస్తున్న లక్షలాది భక్తులు

## త్వరలో భూభారతి విధానాలు

>> వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా చిన్న చిన్న తప్పులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా విధివిధానాలను రూపొందించాలని ఆయన సూచించారు. భూభారతి చట్టానికి సంబంధించి విధివిధానాలను రూపొందించడంపై హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డిలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న వర్క్ షాప్ లో మొదటి రోజు మంగళవారం నాడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎలాంటి విధి విధానాలు తయారు చేయకుండానే 2020 ఆర్వోఆర్ చట్టాన్ని ఆనాటి ప్రభుత్వం అమలులోకి తీసుకురావడంతో ఎదురైన ప్రతికూల పరిస్థితులు మన కళ్లముందే కనిపిస్తున్నాయని, ఆనాటి పాలకులు గొప్పగా చెప్పుకున్న ధరణిలో అన్ని లొసుగులు, లోపాలే. నిబంధనల రూపకల్పన లేకుండానే అమలులోకి తీసుకువచ్చిన 2020 ఆర్ఓఆర్ చట్టం వల్లే లక్షలాది మంది రైతులు రోడ్డున పడ్డారన్నారు. చట్టం తీసుకువచ్చి మూడు సంవత్సరాలు గడచినా కూడా ఆనాటి ప్రభుత్వం విధివిధానాలను రూపొందించలేదు. సచివాలయంలో కూర్చొని రూల్స్ ఫ్రేమ్ చేయకుండా విస్తృత స్థాయిలో అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు సూచనలు తీసుకొని అందరి అభిప్రాయాలను క్రోడీకరించి పకడ్బందీగా భూ భారతి విధివిధానాలు తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. వీలైనంత త్వరగా భూభారతి చట్టానికి సంబంధించిన విధివిధానాలను తయారుచేసి చట్టాన్ని అమలులోకి తీసుకువస్తాం. కొత్త సమస్యలు రాకుండా ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యేలా రైతులకు ప్రయోజనం కలిగేలా, అధికారులు తప్పుచేయడానికి ఆస్కారం లేకుండా విధివిధానాలను రూపొందిస్తున్నామన్నారు. తెలంగాణలో నూతన రెవెన్యూ చట్టం భూభారతి భూ పరిపాలనలో పెను మార్పులను తీసుకురాబోతుంది. ఈ చట్టం తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుంది. భవిష్యత్తులో మరింత మెరుగైన విధానాలు, సాంకేతికతను ఉపయోగించుకొని భూ పరిపాలనను మరింత సమర్ధవంతంగా కొనసాగిస్తాంఈ నూతన చట్టం ద్వారా భూ యాజమాన్య హక్కులనే గాకుండా వారి జీవితాలను ఆత్మగౌరవాన్ని ఆర్థిక స్వతంత్ర్యాన్ని తీసుకువస్తుందని తెలిపారు.




బుధవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న టి హబ్ ఫౌండేషన్ సిఇఒ సుజిత్, గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో

### స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం
## మరో కీలక ఒప్పందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి 18:** స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్, బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం హెచ్‌ఐసీసీలో గో యాస్ హబ్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, బ్రెజిల్లోని గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రిటెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారం పంచుకుంటాయి. మార్కెట్ యాక్సెస్‌తో పాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై టి-హబ్, హబ్ గోయస్ కలిసి పని చేస్తాయి. మన దేశంతో పాటు బ్రెజిల్ స్టార్టప్ ఎకో సిస్టమ్‌ల మధ్య సంబంధాలను ఈ ఒప్పందం బలోపేతం చేయనుంది.

### రాజ్యాంగ ధర్మాసనం తీర్పుపై
## కేంద్రం నిర్లక్ష్యం: ప్రశాంత్ భూషణ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామకంపై 2023లో రాజ్యాంగధర్మాసనం ఇచ్చిన తీర్పును కేంద్రం నిర్లక్ష్యంచేసిందని న్యాయవాదిప్రశాంత్‌భూషణ్ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక ఎడిఆర్ దాఖలుచేసిన పిటిషన్‌పై తన వాదనలు వినిపించిన ప్రశాంత్‌భూషణ్ ఈ కేసును అత్యవసర పిటిషన్‌కింద విచారించాలని కోరడంతో న్యాయమూర్తులు జస్టిస్‌సూర్యకాంత్, ఎన్ కోటీశ్వర్‌సింగ్‌లు ఈనెల 19వ తేదీ విచారిస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే ఈ తీర్పు ప్రకారం ప్రధానిమోడీ, ప్రతిపక్షనేతతోపాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో ఉన్న కమిటీ ఈ నియామకాలకు ఎంపికచేస్తుందని తీర్పుచెప్పితే ఇపుడు న్యాయవ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని కూడా అపహాస్యంచేసేవిధంగా కేంద్రం ప్రభుత్వం హడావిడి నియామకాలుచేసిందని న్యాయమూర్తులకు వివరించారు. 19వ తేదీకి జాబితా అయినా 41వ కేసుగా జాబితా అయిందని ఈలోపు ప్రభుత్వం సిఇసి, ఇసిలను 2023 తీర్పును గౌరవించకుండా నియామకాలుచేసిందని ప్రశాంత్‌భూషణ్ వివరించారు. రాజ్యాంగధర్మాసనం ఇచ్చిన తీర్పునే కేంద్రం అపహాస్యంచేస్తోందన్నారు. అందువల్లనే ఈ కేసును అత్యవసర విచారణచేయాలని కోరుతున్నట్లు ఎడిఆర్ తరపు న్యాయవాది తెలిపారు. పిటిషనర్ జయాతాకూర్ తరపున వాదనలు వినిపించిన వరుణ్‌తాకూర్‌మాట్లాడుతూ మూడు నియామకాలు ప్రభుత్వం కొత్తచట్టం కింద నియమించిందని, కేసు విచారణను సవాల్‌చేసినట్లుగా ఉందన్నారు. ఎడిఆర్‌తోపాటు కాంగ్రెస్ నేత జయాతాకూర్ మరికొన్ని సంస్థలు పీపుల్స్ యూనియన్‌ఫర్ సివిల్ లిబర్టీస్, లోక్‌ప్రహరి వంటి సంస్థలు 2023 చట్టంలోని సెక్షన్ 7చెల్లుబాటును సవాల్‌చేస్తూ పిటిషన్లు దాఖలుచేసాయి. ఈ సెక్షన్‌ప్రకారం సుప్రీంకోర్టుప్రధాన న్యాయమూర్తిని ఈ కమిటీనుంచి మినహాయించారు. ప్యానల్ సభ్యుల్లో ఒకరుగా సుప్రీం ప్రధాన న్యాయమూర్తి ఉండేవారని సంస్థ సయంప్రతిపత్తిని కాపాడేందుకు వీలుగా సిజెఐ కూడా ఉండేవారన్నారు. 2023లో చట్టం అమలుకు వచ్చి సుప్రీంసిజెఐకు ప్రాతినిధ్యం లేకుండాచేసిందని న్యాయవాదులు వాదించారు. అయితే మంగళవారం వాదనలు వినిపించిన ప్రశాంత్‌భూషణ్ ఇతర పార్టీలకు కొన్ని అత్యవసరంగా లిస్ట్ అయిన కేసులున్నాయని, ఈనెల 19వ తేదీ విచారిస్తామని వివరణ ఇచ్చింది. 17వ తేదీనే ప్రభుత్వం సిఇసిగా జ్ఞానేష్‌కుమార్; కమిషనర్‌గా వివేక్‌జోషిలను నియమిస్తూ ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రపతి ఈమేరకు నోటిఫికేషన్‌కూడా జారీచేసారు. 2029 జనవరి 26వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు. కొత్తచట్టంప్రకారం నియమితులయిన మొదటి సిఇసి జ్ఞానేష్‌కుమార్‌కావడం గమనార్హం. 1989 బ్యాచ్ హర్యానా ఐఎఎస్ అధికారి వివేక్‌జోషిని ఎన్నికల సంఘ కమిషనర్‌గా నియమించింది. 2031వరకూ జోషి ఈ ప్యానెల్‌లో ఉంటారు. 1966 మే 21వ తేదీ జోషి జన్మించారు. కొత్తచట్టంప్రకారం సిఇసి, లేదా కమిషనర్‌లు 65 ఏళ్లకు రిటైర్ అవుతారు. లేదా నియామక తేదీనుంచి ఆరేళ్లపాటు ఉంటారు.

### ఖతార్, భారత్ మధ్య కొత్త
## వాణిజ్య ఒప్పందం

>> బిన్ హమద్ అల్‌థాణి ప్రధానిమోడీతో ద్వైపాక్షిక భేటీ జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన రంగాల్లో పరస్పర సహకారంతోముందుకు వెళ్లాలనినిర్ణయించారు. రెండుదేశాల ప్రజలమధ్య సత్సంబంధాలుమరింతపెరగాలని అభిలషించారు. ఖతారి ఎమీర్ తనతోపాటే భారీ ప్రతినిధుల బృందాన్ని తీసుకురావడంతో భారత్‌లో ఉన్న పెట్టుబడుల అవకాశాలు వారికి తెలుస్తాయని చెప్పారు. వ్యూహాత్మక భాగస్వామ్యంపై రెండుదేశాలమధ్య ఒప్పందంజరిగింది. ఇరువురునేతల భేటీ తర్వాత విదేశాంగశాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఛటర్జీ మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో రెండువైపులా రెట్టింపు ద్వైపాక్షిక వాణిజ్యం జరగాలని లక్ష్యం విధించినట్లు తెలిపారు. ఖతార్‌నుంచి ఎమీర్‌తోపాటు మంత్రులు, సీనియర్ అధికారులు, పారిశ్రామికవేత్తలుఅనేకమంది వచ్చారు. గతంలో మార్చిలో ఖతార్ ఎమీర్‌ను భారత్‌లోపర్యటించాలని ఆదేశంలోపర్యటించిన ప్రధానిమోడీ ఆహ్వానించారు. మంగళవారం ఉదయం ఎమీర్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధానిమోడీలు సాదరంగా ఆహ్వానించారు. సాయంత్రం ఎమీర్ గౌరవార్థం రాష్ట్రపతిముర్ము తేనీటి విందు ఇచ్చారు. అనంతరం ఎమీర్, ప్రధానిమోడీలతో కలిసి హైదరాబాద్ హౌస్‌లో చర్చలుజరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం వంటిఏ కీలకంగా చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయన్నారు. ప్రస్తుత వాణిజ్యం రెండుదేశాలమధ్య 14 బిలియన్ డాలర్లవరకూ సాగుతోందని, వచ్చే ఐదేళ్లలో రెట్టింపుచేయాలని నిర్ణయించారు. ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ భారత్‌లో 1.5 బిలియన్ డాలర్లు పెట్టుబడులుప ఎట్టింది. జాయింట్ బిజినెస్ ఫోరమ్ ఆధ్వర్యంలో భేటీలు కూడా జరిగాయి. ఖతార్, భారత్‌లలోని వివిధశాఖల మంత్రులుసీనియర్ అధికారులు ఈచర్చల్లో పాల్గొన్నారు. వీరితోపాటే టాప్ పారిశ్రామికవేత్తలు, కంపెనీలు, సంస్థలు కూడా చర్చల్లో పాల్గొన్నారు. ఖతార్ ఎమీర్ రాకసందర్భంగాప్రధానిమోడీ స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి ఎమీర్ కు స్వాగతం పలికారు. చర్చల్లో ఇజ్రాయెల్‌పాలస్తీనా వివాదం, గాజాస్ట్రిప్‌పై రగులుతున్న వైషమ్యాలను కూడా చర్చించారు. రెండుదేశాలమధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారుదశకు చేరింది.

## అర్ధరాత్రి సిఇసియా?

>> రానున్నాయి. అయినాకూడా ప్యానెల్ నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో రాహుల్ తన అసమ్మతి నోట్‌ను ప్రకటించారు. ప్యానెల్ సమావేశంలో తాను డిస్సెంట్‌నోట్ ఇచ్చానని స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ఎన్నికల సంఘం కార్యనిర్వాహక ప్రమేయం లేకుండా స్వేచ్ఛగా ఉండాలని, ఎన్నికల కమిషనర్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామకాలను రాజకీయ జోక్యంనుంచి మినహాయించాలని డిమాండ్‌చేసారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం ధిక్కరించారని, కమిటీనుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించారని మోడీ ప్రభుత్వం కోట్లాది మంది ఓటర్ల సమైక్యత, ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను లాగేసుకుంటున్నదని ఆయన పేర్కొన్నారు. 2023 సంవత్సరం మార్చిరెండోతేదీ సుప్రీంకోర్టుధర్మాసనం తీర్పునుప్రకటిస్తు సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామకాలను ప్రధానమంత్రి, విపక్ష నేత, సుప్రీంచీఫ్‌జస్టిస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ సిఫారసులతో జరగాలని ఆదేశించిన అంశాన్ని గుర్తుచేసారు. బాబాసాహెబ్ అంబేద్కర్, జాతి వ్యవస్థాపక నేతల త్యాగాలను సైతం ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు మిలియన్లకొద్దీ ఓటర్ల సమైక్యత ఎన్నికల ప్రక్రియను దెబ్బతీస్తోందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు ఎవనువెంటనే ప్రభుత్వం 2023 ఆగస్టులో ఒక చట్టాన్ని తెచ్చి సుప్రీంకోర్టుఉత్తర్వుల స్ఫూర్తిని దెబ్బతీసిందని అన్నారు. సుప్రీం ప్రధాన న్యాయమూర్తిని తప్పించడం న్యాయవ్యవస్థనుంచి తమ అధీనంలోకి రాజ్యాంగాన్ని తీసుకోవడమేనని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యంద్వారా సవాల్‌చేసారు. ఈనెల 19వ తేదీ సుప్రీంలో ఈ పిటిషన్ విచారణకు వస్తోంది. కాంగ్రెస్ పార్టీపరంగా సుప్రీంకోర్టు ఆదేశాలు వచ్చేంతవరకూ సిఇసి, కమిషనర్ల నియామకాలను పక్కనపెట్టాలని డిమాండ్‌చేస్తున్నట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

### కెసిఆర్‌కు ఓట్లు ఎందుకు పడలేదు?

>> చేయడం వలన నష్టం జరుగుతుందని, ఎన్నికల కోడ్‌ను సడలించాలని ఎన్నికల సంఘానికి తాను లేఖ కూడా రాశానని చెప్పారు. సేద్యం చేసే భూములన్నీకి రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అన్నదాతలను ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచన చేస్తున్నానని చెప్పారు. రాజకీయ లబ్ది కోసం ఎవరి ప్రయత్నాలు వారివని, కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఎవరు మాట్లాడినా అది తప్పేనని చెప్పారు.. బిసిలు, అగ్రకులాల మధ్య విద్వేషాలు పెంచే విధంగా మాట్లాడం అస్సలు కరెక్ట్ కాదు. కేవలం ఒక కులం వారి ఓట్లతో ఎన్నికల్లో గెలుస్తాం అనుకుంటే తప్పు అని చెప్పారు.



మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

# గుజరాత్‌లో ముస్లింలు బిసి జాబితాలో ఉన్నారు

## ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ముస్లింలు ఒక్క తెలంగాణలోనే బిసి జాబితాలో ఉన్నారని కేంద్రమంత్రులు చేస్తున్న ప్రకటనలు అవాస్తవాలని గుజరాత్‌లో కూడా ముస్లింలు బిసి జాబితాలో ఉన్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మంగళవారం గాధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేంద్రమంత్రుల బండి సంజయ్, కిషన్‌రెడ్డి బీసీలకు అన్యాయం జరిగిందని ఒక్క తెలంగాణలోనే బీసీలలో మైనార్టీలను కలిపారని చెప్పడం సరికాదు అని అన్నారు. సాధారణ వ్యక్తి, చదువుకోని వ్యక్తి మాట్లాడితే వదిలేయొచ్చు కానీ కేంద్రమంత్రులు ఇలా మాట్లాడి చిచ్చు పెడుతున్నారని ఆవేదన చెందారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ముస్లింలు బిసిలలో ఎందుకు చేర్చాలో వివిధ నివేదికలు పోస్టులో వివరాలు పంపిస్తానని తెలిపారు. గుజరాత్‌లో కూడా బిసి ముస్లింలు ఉన్నారని ఆయన వివరించారు. గుజరాత్‌లో కూడా బిసిల జాబితా నుంచి తొలగించండని ఆయన డిమాండ్ చేశారు. మీ మోడీ రాష్ట్రంలో రిపోర్టులు కిషన్‌రెడ్డి.. బండి సంజయ్‌లకు పోస్టులో పంపుతా అన్నారు. ముస్లిం మతంలో కూడా పేదరికం లేదా..? మీరు పిలిస్తే మీ పార్టీ కార్యాలయానికి వచ్చి కూడా ప్రెజంటేషన్ ఇస్తా, మతాల మధ్య చిచ్చు పెట్టొద్దు మనం అంతా భారతీ యులం వెనకబడిన తరగతులు ఎక్కడ ఉన్నా, వెనకబడిన తరగతులే అని ఆయన అన్నారు. బీసీ ల మీద అంత ప్రేమ ఉంటే బీసీ కుల గణన చేయించు అప్పుడు బండి సంజయ్ శభాష్ అభినందిస్తాం అని షబ్బీర్‌అలీ అన్నారు.

# జెఎన్‌టియు వైస్‌-చాన్స్‌లర్‌గా ప్రొ. కిషన్‌కుమార్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 18:** జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ టీ కిషన్ కుమార్ రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూ వీసీగా కిషన్ కుమార్ రెడ్డి.. పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేండ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. నియామక ఉత్తర్వులు రావడంతో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి(రెక్టార్), డాక్టర్ కె.వెంకటేశ్వరరావు(రిజిస్ట్రార్), వివిధ విభాగాల డైరెక్టర్లు, అనుబంధ కాలేజీల ప్రిన్సిపాల్స్, యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది మే 21న ఖాళీ అయిన వర్సిటీ వీసీ పోస్టును భర్తీ చేసేందుకు ప్రభుత్వం పలుమార్లు ప్రయత్నించినా సాంకేతిక కారణాల రీత్యా నియామక ప్రక్రియ రెండుసార్లు వాయిదా పడింది. జనవరి 27న సెర్చ్ కమిటీ సమావేశం జరిగినప్పటికీ, తాజాగా శాసనమండలి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మూడోసారి నియామక ప్రక్రియ నిలిచిపోయినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఎట్టకేలకు జేఎన్‌టీయూకు పూర్తిస్థాయి వీసీని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విశ్వవిద్యాలయం అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు పాటుపడతానని, విద్యార్థుల అకడమిక్, పరిశోధనా ప్రగతికి అనువైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తానని ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



ప్రజావాణిలో దరఖాస్తులు అందిస్తున్న దరఖాస్తుదారులు

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 1,704

**హైదరాబాద్ (బేగంపేట) ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1,704 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 115, విద్యుత్ శాఖకు సంబంధించి 92, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 35, ప్రవాసీ ప్రజావాణికి సంబంధించి 5, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 1,304 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 153 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. ప్రజావాణిలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడె డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య పాల్గొని దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు.




# హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కార్గో విమానానికి తప్పిన ప్రమాదం

**శంషాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చిన బ్లూడార్ట్ కార్గో విమానానికి ప్రమాదం త్రుటిలో తప్పింది. మంగళవారం ఉదయం చెన్నై నుండి హైదరాబాద్ వచ్చిన బ్లూడార్ట్ కార్గో విమానానికి ల్యాండింగ్ గేర్ సమస్య సమస్య ఏర్పడింది. దీనిని వెంటనే గమనించిన పైలట్ అప్రమత్తమై శంషాబాద్ ఎయిర్ ట్రాఫిక్ అధికారులకు సమాచారాన్ని అందించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరిన వెంటనే సమస్యను గమనించిన అధికారులు అందుకు అనుమతించారు. అంతర్జాతీయ విమానాలను ఆపి కార్గో ఫ్లైట్ ల్యాండింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పైలట్ కార్గోవిమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీనితో విమానంలో ఉన్న సిబ్బంది ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ల్యాండింగ్ సమయంలో విమానంలో ఐదుగురు సిబ్బంది ఉన్నారు.

# 'క్యాపిటల్ ఫోర్స్' గోల్‌మాల్ కేసుపై ఇడి ఆరా

## మనీలాండరింగ్ కోణంలో విచారణ

## సైబరాబాద్ ఇఒడబ్ల్యు నుంచి వివరాల సేకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్‌మాల్ వ్యవహారంలో విచారణకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) రంగంలో దిగింది. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో డిపాజిటర్ల నుంచి 1700 కోట్ల రూపాయలను వసూలు చేసి బిచాణా ఎత్తేయడం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఇద్దరిని సైబరాబాద్ ఆ ర్థిక నేరాల విభాగం (ఈఒడబ్ల్యు) అధికారులు అరెస్టు చేయగా పరారీలో వున్న 37 మంది నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇందులో కీలకంగా వున్న ముగ్గురు విదేశా లకు ఉడాయించగా వారి కోసం లుకవుట్ నోటీసులు జారీ చేశారు.

మాదాపూర్‌లోని హైటెక్ సిటీ కేంద్రంగా 2021లో ప్రారంభమైన క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ గత జనవరి నెల 15వ తేదీన బిచాణా ఎ త్తేయడం తెలిసిందే. ఈ కంపెనీ ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంట్ పేరుతో ఏజెంట్లను నియమించుకుని మొదట తెలంగాణలో ఆ తరువాత దేశ వ్యాప్తంగా బీద, మధ్య త రగతి ప్ర జలు, చిరు వ్యాపారుల నుంచి 1700 కోట్ల రూపాయల డిపాజిట్లను వసూలు చేయడం విదితమే. పోలీసుల విచారణలో మొత్తం బాధతులు 6979 మంది వున్నట్లు తేలింది. కేవలం 45 రోజుల నుంచి 180 రోజుల్లో 11 నుంచి 22 శాతం రిటర్న్స్ వస్తాయని చెప్పడంతో వేల సంఖ్యలో డిపాజిటర్లు ఈ సంస్థలో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. ఈ కేసును విచారించిన సైబరాబాద్ ఈఒడబ్ల్యు అధికారులు కంపెనీ ఉపాధ్యక్షుడు పవన్ కుమార్ ఓదెల, డైరక్టర్ కావ్య నల్లూరిని అరెస్టు చేయగా ఈ కంపెనీలో కీలకంగా వుండి వసూళ్లలో ముఖ్య భూమిక వహించిన అమర్‌దీప్ కుమార్, ఆర్యన్ సింగ్, యుగందర్‌ల కోసం గాలింపు చేబట్టి లుక వుట్ నోటీసులు జారీ చేశారు.

కాగా ఈ కేసులో ఇప్పటి వరకు 19 మంది నిందితులు వున్న ట్లు పోలీసులు గుర్తించి వారి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా వున్న చైర్మన్ అమర్‌దీప్ కుమార్ (ఇతను మాజీ సైనికాధికారి కుమారుడు) పలు కంపెనీల్లో డైరక్టర్‌గా వున్నాడు. ఇతను మొత్తం 16 కంపెనీల్లో డైరక్టర్‌గా వున్నాడని తేలింది. మరో నిందితురాలు అనితా కుమారి 12 కంపెనీల్లో డైరక్టర్‌గా వుంది. కాగా ఈ కంపెనీ తన గోల్‌మాల్ కార్యకలాపాలు సాగిం చేందుకు 22 బ్యాంకు ఖాతాలను వాడినట్లు పోలీసులు తేల్చారు. ఈ కంపెనీ గోల్‌మాల్ 1700 కోట్ల రూపాయలుగా వుండడం, ఇందులో 850 కోట్ల రూపాయలు 12 షెల్ క ంపెనీలలో వెళ్లడంతో దీనిపై లోతుగా విచారించేందుకు ఈడీ రంగంలో దిగింది. దీనిపై సైబరాబాద్ ఈఒడబ్ల్యు నుంచి ఈడీ అధికారులు వివరాలు సేకరించారు. రెం డు మూడు రోజుల్లో క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పై ఈడీ వేరుగా కేసు నమోదు చేసి విచారణ చేబట్టే అవకాశాలున్నాయి.

# సిఇసి జ్ఞానేశ్‌కుమార్ ఇంట్లో 28 మంది డాక్టర్లు!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** కొత్త సిఇసిగా నియమితులయిన జ్ఞానేశ్‌కుమార్ ఇంట్లో అందరూ ఐఎఎస్, ఐఆర్ఎస్ అధికారులే ఉన్నారు. అంతేకాకుండా అదే కుంటుంబ బంధుగణంలో మొత్తం 28 మంది వైద్యులున్నారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా నియమితులైన మాజీ ఐఎఎస్ జ్ఞానేష్‌కుమార్ గుప్తా ఇంట్లో అంతా ఉన్నతాధికారులు, ఉన్నత వృత్తుల్లో ఉన్నవారే. ఆయన పెద్ద కుమార్తెమేధారూపం, ఆమెభర్త 2014 బ్యాచ్‌కుచెందిన ఐఎఎస్ అధికారులు, మేధా ప్రస్తుతంయూపిలోని కాస్‌గంజ్ జిల్లాకలెక్టర్‌గా ఉన్నారు.

ఆమె భర్త మనీశ్‌బన్సాల్ యుపిలోనే సహరాన్‌పూర్ కలెక్టర్‌గా ఉన్నారు. జ్ఞానేశ్ రెండోకుమార్తె అభిశ్రీ ఐఆర్ఎస్ అదికారిణి, ఆమెభర్త అక్షయ్ లబ్రూ ఐఎఎస్ అధికారి. జ్ఞానేశ్ సోదరుడు మనీశ్‌కుమార్ ఐఆర్ఎస్ అధికారి. చెల్లెలుభర్త ఉపేంద్రజైన్‌కూడా ఐపిఎస్. మనీశ్‌సోదరి రోలి ఇండోర్‌లో ఒక పాఠశాల నడుపుతున్నారు. జ్ఞానేశ్‌కుమార్ పుట్టింది యూపిలోని ఆగ్రాలోనే. ఆయన తండ్రి సుభోద్‌గుప్తా, తల్లి సత్యవతి సుభోద్‌గుప్తా సహ ఆయన కుటుంబంలో 28 మంది వైద్యులున్నట్లు ఇరుగుపొరుగువారు చెపుతున్నారు. 1988 బ్యాచ్‌కేరళకేడర్‌కు చెందిన జ్ఞానేశ్‌కుమార్ తొలుత తిరువనంతపురంలో జిల్లాకలెక్టర్‌గా వచ్చారు. మన్మోహన్‌సింగ్ హయాంలో 2007 నుంచి 2012వరకూ ఆయన రక్షణ మంత్రిత్వశాఖలో సంయుక్త కార్యదర్శిగా కొనసాగారు. అప్పట్లో ఇరాక్‌లో ఐసిస్ ఉగ్రమూక హింసాత్మక చర్యలకు తెగబడటంతో అక్కడినుంచి 183 మంది భారతీయులను స్వదేశానికి తరలించడంలో కీలక పాత్ర పోషించారు. 2014లో ఆయన ఢిల్లీలో కేరళ ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్‌గా వ్యవహరించారు.

# కులగణనతో కాంగ్రెసేతర పార్టీలకు కాలం చెల్లింది

## ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి



**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** కులగణనతో కాంగ్రెసేతర పార్టీలకు కాలం చెల్లిందని బిసిలకు రాజ్యాధికారం అందించే శక్తి యుక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి జోస్యం చెప్పారు. గాంధీభవన్‌లోవిలేఖరులతో మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అవకాశాలు కల్పించాలీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం లో బీసీ కులగణన చేశారని అన్నారు. రాజ్యాధికారంలో భాగస్వాములమవుతామని బలహీన వర్గాలు చాలా సంతోషం పడుతున్నాయని భాష్యం చెప్పారు. బీసీ కులగణన తరవాత రాష్ట్రం లోని ఇతర పార్టీ లకి కాలం చెల్లిందని అన్నారు. తెలంగాణలోని అనేక సమాజిక ఆర్థిక సమస్యలపై బీఆర్ఎస్ కల్వకుంట్ల కుటుంబము మాత్రమే మాట్లాడుతారని ఇతరులకు స్వేచ్ఛలేదని అన్నారు. కొత్తగా కల్వకుంట్ల కవిత బీసీ నినాదం ఎత్తుకుందని బీసీ లగురించి మాట్లాడడానికి బీఆర్ఎస్ లో ఒక్క బీసీ నాయకుడు లేడా అని ఆమె నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం వస్తే దళిత సీఎం అని కెసిఆర్ దళితులని మోసం చేశారని నెమరేసుకొన్నారు. బీసీ బంధు అని బీసీ లని మోసం చేశారని ఏ వర్గానికి బీఆర్ఎస్ హయాం లో న్యాయం జరగలేదని ఆమె ఆరోపించారు. కవిత గురించి మాట్లాడాటానికి మాకే సిగ్గుగా ఉందని అన్నారు. కుటుంబంలో ఉన్న కొట్లాటలు బయటపడొద్దని ఏదో నినాదంతో ప్రజల మధ్య ఉండడానికి కవిత బయటికి వస్తుందని ఆమె అన్నారు. బిఆర్ఎస్ కి ఒక బీసీ నాయకుడిని అధ్యక్షుడిని చెయ్యగలరా? కవితనే చెప్పాలి అని అన్నారు. బండి సంజయ్ వ్యవహారం పిచ్చి వాడి చేతిలో రాయి లాగా ఉందని కార్పొరేటర్ కి ఎక్కువ ఎమ్మెల్యే కి తక్కువ బండి సంజయ్ అని ఆమె విమర్శించారు. రాష్ట్రం కి రావలసిన నిధులు అభివృద్ధి గురించి బండి సంజయ్ మాట్లాడాలి అని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత కేటీఆర్ కి లేదు అని ఆమె అన్నారు. అధికారం లో ఉన్నపుడు ఐఎఎస్ లతో కాళ్ళు బూట్లు పట్టించుకున్న కేటీఆర్ కి ఐఎఎస్ లగురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. కెటిఆర్ ఏ మొఖం పెట్టుకొని రైతు దీక్ష చేస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ మనుగడ కోసం కేటీఆర్ బుడబుక్కల వేషాలు వేస్తున్నాడు రైతులు కూడా కేటీఆర్ ని దగ్గరకి రానివ్వరని ఆమె అన్నారు.

# ఎసిబికి వరుసగా పట్టుబడుతున్న సర్కారీ ఉద్యోగులు

## నెల రోజుల్లో 20 మంది పట్టివేత

## మంగళవారం ఒక్కరోజే ఐదుగురు అరెస్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ప్రభుత్వ విభాగాల్లోని అధికారులు, ఇతర సిబ్బంది వరుసగా ఎసిబికి పట్టుబడుతుండడం ఆయా ప్రాంతాలలో సంచలనం రే పుతోంది. గడచిన నెల రోజుల వ్యవధిలో 20 మంది ఎసిబికి దొరికిపోగా మంగళవారం ఒక్కరోజే ఐదుగురు అరెస్టయ్యారు. వీరంతా లంచం తీసుకుంటూ ఎసిబికి రె డ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం గమనార్హం. ఓవైపు ప్రభుత్వ శాఖల్లో అవినీతిని దూరం చేసేందుకు ఎసిబి ముమ్మరంగా ప్రచారం చేస్తుండగా మరోవైపు ఆయా విభాగాల అధికారులు లంచాలు తీసుకుంటూ దొరికిపోతుండడం విశేషం.

అవినీతి నిరోధక విభాగానికి సర్కారీ ఉద్యోగులు పట్టుబడడం గడచిన కొన్ని నెలలుగా పెరిగిపోయింది. ఓవైపు కొందరు లంచాలు తీసుకుంటూ నేరుగా పటు బడు తుండగా ఇంకోవైపు ఇంకొందరు ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసుల్లో అరెస్టవుతున్నారు. ఎసిబి అధికారులు గత జనవరి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 19 కేసులు నమోదు చేయగా ఇందులో పది కేసులు రెడ్ హ్యాండెడ్ ట్రాప్‌కు సంబంధించినవి కాగా ఒకటి ఆదాయానికి మించి ఆస్తులు కలిగినవి. మూడు కేసులు క్రిమినల్, అసభ్య ప్రవర్తన,, మరో మూడు రెగ్యులర్ కేసులు, ఇంకో మూడు అక్రమాస్తులకు సంబంధించిన విచారణ కేసులు. ఈ సందర్భంగా 14 మంది ఉద్యోగులు, ముగ్గురు ఔట్ సో ర్సింగ్ సిబ్బంది పట్టుబడగా వీరి వద్ద నుంచి లక్షా 45 వేల రూపాయల లంచం తాలూకు సొమ్మును జప్తు చేశారు. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి ఒక అధికారి వద్ద 65 లక్షల 50 వేల అక్రమాస్తులు పట్టుబడ్డాయి. ఈ నెలలో వరంగల్ రవాణా శాఖ జిల్లా అధికారి పుష్పల శ్రీనివాస్ అక్రమాస్తుల కేసులో దొరికిపోగా తాజాగా మంగళవారం నాడు నారాయణపేట్ జిల్లా మక్తల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కానిస్టేబుల్ శివారెడ్డి, నరసింహా 20 వేల రూపాయల లంచంతో ఎసిబికి దొరికిపోయారు. కా నిస్టేబుళ్లు శివారెడ్డి, నరసింహా 20 వేల రూపాయల లంచం తీసుకుంటూ దొరికిపోగా వారిని విచారిస్తే సిఐ చంద్రశేఖర్ పేరు చెప్పడంతో ఆయనను కూడా అరెస్టు చే శారు. మరో ఘటనలో భద్రాద్రి జిల్లా ఇల్లందు మండలం కొమరాంలో ఫారెస్ట్ రేంజర్ ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ సునావత్ హరిలాల్ అటవీ భూమి నుంచి మట్టి త వ్వుకునేందుకు 30 వేల రూపాయల లంచం తీసుకుంటూ దొరికిపోయారు. ఒక్క రోజులోనే పోలీసు శాఖలో ముగ్గురు, అటవీ శాఖలో ఇద్దరు ఎసిబికి పట్టుబడడం సం చలనం రేపింది. గడచిన నెల రోజుల వ్యవధిలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది 20 మంది అరెస్టయ్యారు.

**అడ్డగోలు పోస్టింగులతో మసకబారుతున్న సర్కారు ప్రతిష్ట**

ఇదిలా వుండగా సర్కారీ విభాగాల కీలక హోదాలో వున్న ఉన్నతాధికారులు వరుసగా లం చాలు తీసుకుంటూ దొరికిపోతుండడం ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చుతోంది. సాధారణంగా కింది స్థాయిలో వుండే అధికారులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ క్రమం తప్పకుండా వుండాల్సి వుంది. వీరి పనితీరు, విచారించే కేసులు, వీటిపై సాగుతున్న విచారణ ఎలా వుంది...? తమ వద్దకు వచ్చే వారి నుంచి అధికారులు ఏమైనా ఆశిస్తున్నారా...? అనే దానిపై అంతర్గతంగా వేగుల నుంచి సమాచారం సేకరించా ల్సి వుంది. గతంలో ఇలాంటి వ్యవస్థ బలంగా వుండేది. కానీ ఇప్పుడంతా హైటెక్ వ్యవస్థ అవతరించడం, వేగుల్లో కూడా కొందరు అవినీతి అధికారులకు కొమ్ముకాస్తు ండడంతో అంతా గోల్‌మాల్ వ్యవహారంగా మారుతోంది. ఈ క్రమంలోనే గడచిన కొన్ని నెలలుగా వరుసగా లంచావతారులు ఎసిబికి దొరికిపోతున్నారు.

# నిరుద్యోగులకు లక్షల్లో టోపీ

## బోర్డు తిప్పేసిన మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి),ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ఉద్యోగాల పేరుతో మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకున్న నిర్వాహకులు లక్షలు దండుకుంటున్నారు. ఉద్యోగం వస్తుందనే ఆశతో నిరుద్యోగులు కూడా డబ్బులు కట్టడానికి వెనుకడుగు వేయటంలేదు. అదే అసరాగా తీసుకున్న నిర్వాహకులు ఉద్యోగం పేరుతో డబ్బులు దండుకోవడం,తర్వాత కొన్ని రోజులకే చేతులేత్తేయటం ఈ మధ్య పరిపాటిగా మారిపోయింది.తాజాగా హైదరాబాద్ మాదాపూర్‌లోని నియో సాఫ్ట్‌వేర్ కంపెనీ పేరుతో చింతల్‌కు చెందిన కాళ్ల భార్గవ్ అనే వ్యక్తి 35లక్షల వరకు వసూలు చేసి మోసం చేశాడు. బాధితుడు లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు భార్గవ్ ను ఫిబ్రవరి 17వ తేదిన అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కాళ్ల భార్గవ్ పేరుపై గతంలో జీడిమెట్ల,మాదాపూర్,కల్వకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఉద్యోగం పేరుతో డబ్బులు వసూలు చేసే కంపెనీలను నమ్మవద్దని, డబ్బులు కట్టి మోసపోవద్దని నిరుద్యోగులకు పోలీసులు సూచిస్తున్నారు.

# రియల్ హీరో కెసిఆర్ కాదు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** కేసీఆర్ బర్త్ డే సందర్భంగా ఆ పార్టీ నాయకులు కేసీఆర్ తెలంగాణ రియల్ హీరో అన్నారే కానీ తెలంగాణ రియల్ హీరో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమే అని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. కేసీఆర్ తన పదేళ్ల పాలనా కాలంలో చేయలేని అనేక అభివృద్ధి, సంక్షేమ పనులను రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక ఏడాది కాలంలో చేసి చూపించారని ఒక ప్రకటనలో కితాబు ఇచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కులగణన చేసి కులాల లెక్కలు తేల్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దే అని ఆయన అన్నారు. రాష్ట్రంలో 56 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను మంజూరు చేసి పనులు ప్రారంభించిన ఘనత రేవంత్ రెడ్డి దే అని కొనియాడారు. 25 ఎకరాల స్థలంలో 200 కోట్లతో ఒక్కొక్క ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ కట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ది దారుడికి 5 లక్షల రూపాయలతో కట్టించేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించారు. నిరుద్యోగులకు 55 వేల ఉద్యోగాలు ఇచ్చారు. ఆరోగ్య శ్రీ కింద 10 లక్షల రూపాయల పథకాన్ని విస్తరించారు. ప్రజా భవన్ పెట్టి ప్రజావాణి కింద ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విదంగా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఫోర్త్ సిటీ ఏర్పాటు చేశారు ఇవన్నీ ఏడాది కాలంలోచేసిన రేవంత్ రెడ్డి నే తెలంగాణ ప్రజలు రియల్ హీరో అంటున్నారు కానీ కెసిఆర్‌ను కాదు అని ఆయన స్వోత్కర్షలు చెప్పుకొన్నారు.

# తీన్మార్ మల్లన్న వల్ల కాంగ్రెస్‌ను బహిష్కరిస్తాం

## గాంధీభవన్ ముందు రెడ్డి జాగృతి నేతల నిరసన

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని మేం బహిష్కరిస్తామని రెడ్డి జాగృతి నేతలు హెచ్చరించారు. మంగళవారం తీన్మార్ మల్లను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీభవన్ వద్ద రెడ్డి జాగృతి సంఘాల నేతల ఆధ్వరనయంలో నిరసన చేపట్టారు. మల్లన్నపై పిసిసికి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే తీన్మార్ మల్లన్నపై కులగణనకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంతో పిసిసి సంజాయిషీ నోటిసులు జారీచేసింది. కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవడానికి కసరత్తు ప్రారంభించింది.

# కుంభమేళాలో మృతుల వివరాలను తెలియచేయాలి

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** కుంభమేళలో జరుగుతున్న వరస ఘటనలలో మృతి చెందిన వారి వివరాలను పారదర్శకంగా వెల్లడిం చాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహా కుంభమేళ ప్రచార జోరు భారీగా ఉన్నా సౌకర్యాలు మాత్రం శూన్యంగా ఉన్నాయని విమర్శించారు. ప్రయాగ్ రాజ్ లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది మరణించడం, ఢిల్లీ రైల్వేస్టేషన్లో 18 మంది మరణించడం, ఛత్తీస్ గడ్ కొంతమంది, హైదరాబాద్కు చెందిన పదిమంది రోడ్డు ప్రమాదంలో మరణించినట్టు అధికార లెక్కలు చెబుతున్నా, కోట్లాదిమంది పాల్గొనే ఈ కుంభమేళాలో మృతుల సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు మేధావులు అంచనా వేస్తున్నారని, ఆ లెక్కలను కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు కప్పిపుచ్చుతున్నట్లు కనబడుతున్నాయని ఆరోపించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని దీనికి ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ఆయన అన్నారు.

# ఆర్‌ఎంపి, పిఎంపిల సమస్యలు తీర్చనున్న సర్కారు

## ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు తెలంగాణ ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, మహేష్‌కుమార్‌గౌడ్‌లు హామీ ఇచ్చారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభ పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిధులుగా హాజరై వారు మాట్లాడుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీలు గ్రామాల్లో వైద్య వ్యవస్థకు పునాది వంటి వారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పేదల ప్రభుత్వం అని, అన్ని వర్గాలను సమానంగా చూసే కాంగ్రెస్ పాలనలో అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులతో పాటు విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, మేనిఫెస్టోలో పొందు పరిచిన ప్రతి అంశాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాలలో ఆర్‌ఎంపీ, పీఎంపీ వ్యవస్థ అవసరం ఎంతో ఉందని, అటువంటి ఆర్‌ఎంపీ, పీఎంపీలపై జరుగుతున్న దాడుల గురించి ముఖ్యమంత్రితో చర్చిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభ గురించి ఆరోగ్యశాఖామంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించటం జరిగిందని, ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యకు కొంచెం సమయం పట్టవచ్చు కానీ పరిష్కారం అవుతుందనే నమ్మకం ఉందని అన్నారు. తెలంగాణ అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శంకర్‌ముదిరాజ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు జీవో నెంబర్ 2009 ప్రకారం గుర్తింపు సర్టిఫికెట్స్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. శిక్షణ పొందిన 13వేల మంది కమ్యూనిటీ పారా మెడిక్స్‌కు వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వాలనివిజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో డాక్టర్ కే.జి. గోవిందరెడ్డి, జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, విజ్ఞాన దర్శిని నాయకులు రమేష్, తెలంగాణ పట్టణ, గ్రామీణ వైద్యుల ఐక్య వేదిక అధ్యక్షులు చొల్లేటి బాలబ్రహ్మాచారి, టీఆర్‌పీఎస్, ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్య సంఘాల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటరెడ్డి, ఆర్‌ఎంపీ, పిఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుండ్ల బాలరాజ్, వివిధ జిల్లాల నుండి వచ్చిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.



ఆత్మగౌరవ సభలో నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీలు కోదండరాం, మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు


ఫారం నెం.ఎన్‌సిఎల్‌టి 3 A
పిటిషన్ వివరణాత్మక ప్రకటన
(రూల్ 35 చూడండి)
కంపెనీ పిటిషన్ నెం.2 ఆఫ్ 2025
పిటిషన్ ప్రకటన

కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 61(1)(బి) కింద వాటా మూలధన ఏకీకరణ కోసం మెస్సర్స్ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పిటిషన్‌ను జనవరి 24, 2025న సమర్పించింది మరియు ఆ పిటిషన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ యొక్క హైదరాబాద్ (కోర్ట్-2) బెంచ్ సమక్షంలో 19.03.2025న విచారణకు నిర్ణయించారు. సదరు పిటిషన్‌కు మద్దతు ఇవ్వాలనుకునే లేదా వ్యతిరేకించాలనుకునే ఎవరైనా పిటిషనర్ అడ్వకేట్‌కు అతని పేరు మరియు చిరునామాతో సంతకంచేసిన తన ఉద్దేశ్య నోటీసును పంపాలి, తద్వారా పిటిషన్ విచారణకు నిర్ణయించిన తేదీకి రెండు రోజుల ముందు పిటిషనర్ అడ్వకేట్‌ని చేరుకోవచ్చు. అతను పిటిషన్‌ను వ్యతిరేకించాలనుకునే చోట, వ్యతిరేకతగల కారణాలు లేదా అతని అఫిడవిట్ కాపీని సదరు నోటీసుతో అందించాలి. పిటిషన్ /దరఖాస్తు /రిఫరెన్స్ కాపీని దిగువ సంతకందారుని అందుకు నిర్దేశించిన ఛార్జీలు చెల్లించిన తర్వాత దానిని కోరుతున్న ఏ వ్యక్తికైనా అందజేస్తారు.

తేదీ: 19.02.2025.

సం/-
జి. కళ్యాణ్ చక్రవర్తి
(పిటిషనర్ తరఫు న్యాయవాది)
ఫ్లాట్ నెం.301, 3వ అంతస్తు, లేక్ మెలోడీ అపార్ట్‌మెంట్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ
హైదరాబాద్, తెలంగాణ-500 082.

అజ్ఞానం అహంకారానికి దారితీస్తుంది. అహంకారం తీవ్ర అజ్ఞానానికి దారితీస్తుంది. అజ్ఞానంఎప్పుడూ మార్పుకు భయపడుతూ ఉంటుంది.

-వి.జాన్సన్

# సంక్షేమమా! సంక్షోభమా?

లక్ష్మీకటాక్షం లేకపోతే జీవనం సాగించడంఎంత దుర్భరంగా ఉంటుందో వేరే చెప్పాల్సిన పని లేదు. వ్యక్తికానీ, కుటుంబం కానీ,ప్రభుత్వంకానీ ఆదాయం లేకుండా నడవడం, నడపడం సాధ్యం కాదనేది జగమెరిగిన సత్యం. అందులోనూ ప్రజాసంక్షేమమే ధ్యేయమని చెప్పుకుంటూ నిరుపేద,బలహీన,బడుగువర్గాల అభివృద్ధికి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వివిధ పథకాలపై వెచ్చిస్తున్న ఈ రోజుల్లో నిధులు ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. అందుకోసం ప్రజల మీద భారం వేయకతప్పదు.అందులో మరో అభిప్రాయానికి తావులేదు. నిధుల సమీకరణకు అప్పులు, లేక పన్నులు తప్ప మరో మార్గం లేదనేది అందరికీ తెలిసిందే. అటు కేంద్రంలో కానీ, ఇటు రాష్ట్రంలో కానీ అధికారంలో ఎవరున్నా ఏదోఒక రూపంలో ప్రజల వద్ద నుండి డబ్బు వసూలు చేయాల్సిందే. అది సరిపోనప్పుడు అప్పుల బాట ఉండనే ఉన్నది. పన్నులు వేసేందుకు ఒక పద్ధతి ఉండాలి. ఒక విధానం ఉండాలి. ఎన్ని పన్నులువేసినా, మరే రూపంలో నిధులు సేకరించే ప్రయత్నం చేసినా ప్రజలకు అందువల్ల కష్టంఅంత ఉండకూడదు. అందుకే చెప్తారు పిల్లి తన పిల్లలను తీసుకువెళ్లి నట్లుగా ప్రజల పట్ల పాలకుల తీరు ఉండాలంటారు.కానీ ప్రస్తుత పరిస్థితులు అలా లేవు. ఇష్టానుసారంగా పన్నులు వేస్తున్నారు. పన్నులు వేసే కొద్దీ ధరలు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. జిఎస్టీ అన్నా మరే రూపంలో వస్తువులపై పన్నులు వేసినా చివరకు కావడి ఎన్ని వంకలు తిరిగినా ఇంటికి చేరాలన్నట్లు పన్నుల భారమంతా ప్రజలు మోయాల్సిందే. దేశంలో పన్నులు ఏ మేరకు వేశారో, ఫలితంగా ధరలు ఏ స్థాయికి పెరుగుతున్నాయో ప్రత్యేకంగా చర్చించాల్సిన పనిలేదు. అదుపు లేకుండా పెరిగిన ఈ ధరలతో ముఖ్యంగా నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. అపరిమితఆదాయం ఉన్న నల్లధనస్వాములకు ఏ వస్తువు ధర ఎంత పెరిగినా చీకూచింత లేకపోవచ్చుకానీ సామాన్యులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. మరొకపక్క ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకోకుండా ఇష్టానుసారంగా వ్యయం చేస్తుండడంతో అప్పులబాట పట్టడం తప్పడంలేదు. ఓట్లకోసం, అధికారం కోసం జనాకర్షణ పథకాలు కోకొల్లలుగా ప్రకటిస్తున్నారు. ప్రజలు కోరినవేకాదు అభ్యర్థించనివి కూడా ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారు. అవన్నీ పూర్తి చేయాలంటే ఎన్ని లక్షల కోట్లు అవసరం అవుతాయో ఆలోచించడం లేదు. గతవారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా ఉచితాలపై విచారణ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేసింది. అందురూ ఆలోచించాల్సిన సమయమిది. ఇక ఆదాయాన్ని పెంచుకునేందుకు అన్ని రకాల కసరత్తులు చేస్తున్నారు. నిత్యం ఆదాయం పెంచుకునే అన్వేషణ జరుగుతున్నది. యేడాదియేడాదికి మద్యం ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల వరకు పరిశీలించినా ఎక్సైజ్ ఆదాయం ఖజానాకు ప్రధాన ఆర్థిక వనరుగా మారిపోయింది. ఒక్కవిషయాన్ని విస్మరిస్తున్నారు. ప్రభుత్వం రూపొందించే మద్యం విధానాలు, అందువల్ల పెరుగుతున్న ఆదాయం అంతిమంగా సమాజంపై చూపుతున్న దుష్ప్రభావం పరిశీలిస్తే ఆందోళన కలుగుతుంది. మద్యంమత్తులో సొంత తల్లిని చంపేవారు కొందరు అయితే భార్యను హతమార్చేవారు ఇంకొందరు. రకరకాల నేరాలకు మద్యం కారణమవుతున్నది. తాగుడు మూలంగా రహదారి ప్రమాదాలు మహిళలపై అఘాయిత్యాలు, గృహహింస, లైంగిక వేధింపులు లాంటి నేరాలు అంతులేకుండా పెరిగిపోతున్నాయి. తెలుగురాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాలను తీసుకుంటే యేడాదికి దాదాపు ఇరవై వేల మందికిపైగా అసువులు బాస్తున్నారు. యాభై వేల మందికిపైగా క్షతగాత్రులవుతున్నారు. అందులో కొందరు శాశ్వత వికలాంగులు అవుతున్నారు.వారుకుటుంబానికి భారమై జీవచ్ఛవంలా కాలం గడుపుతున్నారు. చట్టాలు ఎన్ని తెచ్చినా మరెంత మందిని అధికారులను నియమించినా ఇది ఆగడంలేదు. ఇవేకాదు హత్యలు,కిడ్నాపులు లాంటివి జరుగుతున్నాయి. పట్టపగలు నడిరోడ్డులో హత్యలకు వెనుకాడడం లేదు. ఇటు ప్రమాదాల్లో కానీ అటు నేరాల్లో కానీ నిందితులైనవారిలో అధిక శాతం మద్యం మత్తులో ఉండి చేసినవారే ఉన్నారనేది అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. మరొకపక్క ఎన్నోలక్షల కుటుంబాలు మద్యానికి బానిసై రోగపీడితులై మంచానికే పరిమితమై కృంగికృశించి అసువులు బాస్తుంటే ఎన్నో లక్షల కుటుంబాలు చితికిపోతున్నాయి. ఇన్ని అనర్థాలకు మూలమైన మద్యాన్ని పాలకులు పెంచిపోషించడం, ఆదాయం కోసం ప్రజలతో తాగించడం, ప్రోత్సహించడం ఎంత వరకు సమంజసమో మనసుపెట్టి ఆలోచించాలి. మద్య నిషేధం ఎన్నికల నినాదంగా మిగిలిపోతున్నది. మద్యం ఆదాయం పైనే ఆశలు పెట్టుకుంటున్నారు. మరొకపక్క నాటుసారా కూడా తెలుగు రాష్ట్రాల్లో విజృంభిస్తున్నది. సారా పొయ్యిలు కుగ్రామాల్లోనే కాదు మండల కేంద్రాలకు కూడా విస్తరిస్తున్నాయి. మద్యానికి బానిసలై అనారోగ్యం పాలైన కుటుంబాలకు కుటుంబాలే రోడ్లమీద పడుతుండడంతో ఆనాడే ఆవేదన చెందిన మహాత్ముడు స్వతంత్ర భారతావని నుంచి మద్యం రక్కసిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఆయననే ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగు జాడల్లో నడుస్తున్నామని చెప్పుకుంటూ వర్ధంతులు, జయంతులు క్రమం తప్పకుండా నిర్వహించుకుంటున్న పాలక పెద్దలు ఆయన అభిష్టానికి వ్యతిరేకంగా మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. అంతేకాదు ఒకపక్క ప్రజాసంక్షేమం అంటూ అందుకోసం మరొకపక్క ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సంక్షోభంవైపు నెట్టడం ఏమాత్రం న్యాయం కాదు.

మానవ నాగరికతను చాలా వరకు ప్రభావితం చేసేది ఉత్తమ మహిళలే.



ఎమర్సన్

ఒక మనిషి అభివృద్ధికి, దిగజారడానికి స్వయంకృతమే కారణం అవుతుంది.



అబ్రహాంలింకన్

# ప్రజావాక్కు



### మహాకుంభమేళాలో మరిన్ని మృతులు

ఫిబ్రవరి 15 శనివారం ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో మహా కుంభ మేళాకుఏర్పాటుకు చేయబడిన ప్రత్యేకరైళ్ళలో వేలమంది భక్తులు పుణ్యస్నానాల కోసం పడిగాపులు పడుతూండగా ముందుగా నిర్ణయించిన ప్లాట్ ఫాం కాకుండా మరొక దానికి వస్తుందనే ప్రకటన వినగానే ఆతృత, కంగారు, భయంఒక్కసారిగా ఆవహించి ఓవర్ బ్రిడ్జ్ మీదకు రాగానే ఒక్కసారిగా తోపులాటకు గురిఅవగా అందులో చివరిసారి సమాచారం అందేసరికి 18 మంది చనిపోగా మరెంతో మందికి తీవ్రగాయాలయ్యాయని వార్తలొచ్చాయి. తొక్కిసలాటకు మరొక కారణం ఏంచెబుతున్నారంటే రెండు రైళ్ళ పేర్లు ఒకేలా అనిపించడంతో దీనిలో తామెక్కవలసిన రైలేదో తెలియరాలేదు.ఒకదాని పేరు ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ మరొక దాని పేరు ప్రయాగ్ రాజ్ స్పెషల్. మహా కుంభమేళాఏమోగాని తొక్కిసలాటలలో, రోడ్డు ప్రయాణాలలో చాలామంది మృతి చెందారు.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### వేతనాలు వెంటనే చెల్లించాలి

ఉపాధిహామీ కూలీలవేతనాలు చెల్లింపులో జాప్యం చోటు చేసుకుంటుంది. ఇది ఒకరకంగా కూలీలసంఖ్య తగ్గడానికి కారణం అవుతోంది. చట్టంప్రకారం పని చేసిన 15 రోజులలో వేతనాలు అందాలని నిర్దిష్టంగా పేర్కొన్న అందుకు తగిన అడుగులు పడ్డ దాఖలాలు లేవు. ప్రభుత్వం ఇప్పటికే ఆరు వారాల కూలీలు బాకీపడి ఉన్నది. కాబట్టి తొందరగా స్పందించి వేతనాలు విడుదలచేయాలి. వేతనాలు అందితేనే కూలీల సంఖ్య పెరిగి పని దినాలు పెరిగే అవకాశం ఉందని గమనించాలి.

- భారత అవినాష్, జనగామ

### మార్పులు జరగడం సహజం

పది సంవత్సరాలు అంతకుపై బడి అధికారంలో ఉన్న ప్రభుత్వాలపై సహజంగా ఏర్పడే వ్యతిరేకత ఈ సమయంలో ప్రభుత్వంలో ఉన్నవారు చేసే అవినీతి పనులు, తప్పులు, అపరిష్కృత సమస్యలు వంటివి ప్రతిపక్షాలు అధికారంలోకి రావడానికి కారణం అవుతాయి. ఇటీవల ఢిల్లీ,అంతకుముందు కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాలలో జరిగింది అదే. అయితేఇలా జరగడం కొత్తకాదు. ఎనిమిదో అద్భుతమూ కాదు.భవిష్యత్తులోనుఇలానే జరుగుతుంది.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### మంత్రుల విశ్వసనీయత ప్రశ్నార్థకం?

రాష్ట్ర ప్రభుత్వ పలుశాఖల్లో టెండర్లు, అనుమతులు, బిల్లుల చెల్లింపు, అధికారుల బదలీలు వంటివి మంత్రులకు తెలియకుండానే జరిగిపోతున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. ఆ పైన దిద్దుబాట్లు, రద్దులు, విచారణకు ఆదేశిస్తున్నారు. ముఖ్యమంత్రి మంత్రులను శాఖలపై పట్టుపెంచుకోమని ప్రతి సందర్భంలోనూ చెప్పటం మీడియా ద్వారా చూస్తున్నాం! తాజాగా మంత్రుల అనుచరులు నియోజకవర్గాల్లో దందాలు చేస్తున్న వార్తలు వస్తున్నాయి! ఇప్పటికే చాలామంది కూటమి ఎమ్మెల్యేలు అవినీతి కార్యకలాపాలతో కార్యకర్తలకు అందుబాటులో లేకుండాపోయారు.పరిస్థితి చక్కదిద్దకుంటే ముఖ్యమంత్రి ఎంత కష్టపడినా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### పరీక్షాపే చర్చ

నిరుపేద విద్యార్థులకి బలవర్ధక ఆహారం, ఆర్థిక సాయం, పుస్తకాలు, పెన్నులు,యూనిఫారం ఇలావారికి అవసరమైన వాటినన్నిటిని అందించటం ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించడం, క్రమశిక్షణ అలవర్చటం వంటి పనులని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకి విద్యాధికారులకి అప్పగించాలి. ఈ మధ్య కొందరు సినీప్రముఖులు, రాజకీయ నాయకులు మారుమూల గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారు. అలానే నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను ధనవంతులు కలెక్టర్లు, మంత్రులు దత్తత తీసుకొని వారికి విద్యాదానం చేయాలని ప్రభుత్వం సంకల్పించాలి. ఇవన్నీ చేస్తేనే విద్యారంగానికి విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### పెరుగుతున్న శబ్దకాలుష్యం

గ్రామాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. కరెంట్ కోతలు విధిస్తున్నారు.లోవోల్టేజి సమస్య. అపరిశుభ్రమైన మురికి కాలువలు. మైకులు, డిజెల ద్వారా శబ్ద కాలుష్యం అధికం. దోమల బెడద. రెసిడెన్షియల్ ఏరియాలో అక్రమంగా వెల్డింగ్ షాపులు, కారంమిల్లులు నిర్వహిస్తున్నారు.ఆటో, ట్రాక్టరు డ్రైవర్లు టేప్‌రికార్డర్‌లో అధిక శబ్దంతో పాటలు పెడుతున్నారు. పొద్దున్నే వీధి వ్యాపారస్తులు గట్టిగా కేకలు వేస్తూ నిద్రాభంగం కలిగిస్తున్నారు. శబ్దకాలుష్యాన్ని అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఇది ఒక్కరితో ముగిసిపోయేది కాదు.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి **ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్య, ఉద్యోగాల్లో అసమానతలు తొలగించలేరా?

**రాష్ట్ర పరిధిలోని చట్టాలకు లోబడి అన్ని రంగాల్లో సమన్యాయం చేసుకోవాలని, ప్రభుత్వ పాలనలో ప్రతినిధు లుగా జనాభా దామాషా ప్రకారం బీసీ ఎస్సీఎస్టీ నాయ కులు ఉన్నప్పుడే ఆయా కులాలకు సామాజిక రాజకీయ ఆర్థిక రంగాల్లో సామాన్యయం జరుగుతుందనే వాస్తవాన్ని నేటి బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు గ్రహించి ఇకనైనా పరి వర్తన చెంది సామాజిక పోరాటాలని రాజ్యాధికార పోరాటం దిశగామళ్లించి యుద్ధ ప్రాతిపదికన ఆధిపత్య కులాలకబంధ హస్తాల్లో బందీఅయిపోయిన రాజ్యాన్ని ఉలిక్కిపడేలా సామా జిక రాజకీయ పోరాటాలు చేయాల్సిన తక్షణ అవసరత ఉన్నదనే అంశాన్ని అణగారిన వర్గాల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మేధావులు విద్యావంతులైన నాయకులు, ప్రజలు గ్రహించాల్సిన సత్యం.**

భారతదేశ సామాజిక వ్యవస్థలో కులానికి ఉన్న ప్రాధాన్యత ఏంటో జగమెరిగిన సత్యం. నేడు ఆధునిక భారతంలో కూడా ప్రభుత్వ విధి విధానాలను ప్రభుత్వ పథకాలను అమలు చేయాలంటే ప్రతి అంశంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా కులం ప్రభావం ఉంటుంది. ఐతే కులంతో ఆనాటి నుండి నేటివరకు అత్యధికంగా లబ్ధి పొందుతున్నది 10శాతం ఉన్న అగ్రకులాలే. ఎందుకనగా స్వాతంత్రానంతరం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంలో మెజార్టీ నాయకులు అగ్రకులాల నాయకులే. ఐతే కులం మూలంగా అత్యధికంగా వెనుకబాటుకి గురవుతున్నది మాత్రం మెజారిటీగా ఉన్న అణగారిన వర్గాలేనని సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక అంశాలని క్షుణ్ణంగా పరిశీలిస్తే నిరూపణ అవుతుంది. అయితే అగ్రవర్ణాలమని చెప్పుకుంటూ స్వాతంత్రం ముందు స్వాతంత్రం తర్వాత కూడా భారతదేశ పాలన వ్యవస్థలో చక్రం తిప్పుతున్నది మాత్రం 10శాతం ఉన్న అగ్రవర్ణాలైతే 90శాతం పైగా ఉన్న బిసి, ఎస్సీఎస్టీలు ఆనాటి నుండి నేటి వరకు పాలితులుగానే ఉంటున్నారు అనేది చరిత్ర నిరూపిస్తున్నది. కులంలోని తారతమ్యాల కారణంగా ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగా అన్ని కులాలకి సమ పంపిణీ కావడం లేదని ఎస్సీకులాల్లో కూడా చైతన్యవంతులైన కొన్ని సమూహాలు మాత్రమే విద్య, ఉద్యోగ పరంగా లబ్ధిపొందడం, అదే ఎస్సీకులాల్లో అనేక చిన్న చిన్న కులాలు విద్యా, ఉద్యోగాల్లో అత్యంత వెనుకబాటుకు గురవడం అనేది ఒక విధంగా అసమానతలకి దారితీస్తున్నది. ఎస్సీ కులాల రిజర్వేషన్ ఫలాలు సమ పంపిణీ కావాలనే అంశంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మూడు దశాబ్దాలుగా అనేక మంది నాయకులు ఎస్సీ వర్గీకరణ కావాలని సామాజిక న్యాయం కోసం పోరాటాలు చేస్తున్నారు. ఇక ఆనాటి సామాజిక పోరాటాల మూలంగా సామాజికన్యాయం అమలుకై చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయడం జరిగింది. అప్పుడు ఎస్సీల్లో 59 కులాలు ఉన్నట్టుగా గుర్తించి నాలుగు భాగాలుగా విభజించి ఏ గ్రూపు కులాలకి 1శాతం, బి గ్రూప్ కులాలకి 7 శాతం, సి గ్రూప్ కులాలకి 6శాతం, డిగ్రూప్ కులాలకు 1 శాతం రిజర్వేషన్లు కేటాయించడం జరిగింది. అయితే కొద్ది కాలానికి ఆ వర్గీకరణ అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో సమ పంపిణీ కావడం లేదని సుప్రీంకోర్టు కొట్టి వేసింది. ఇక ఆనాటి నుండి నేటి వరకు కూడా ఎస్సీ వర్గీకరణకై అనేక సామాజిక పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి.అందులో భాగంగా గత సంవత్సరం ఆగస్టు1న సుప్రీంకోర్టు

పుల్లెంల గణేష్

ధర్మసనం ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచ్ కేంద్ర పార్లమెంట్ చట్టంతో సంబంధం లేకుండా ఆయా రాష్ట్రాలే వర్గీకరణ చేసుకోవచ్చని వెసులుబాటు ఇస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది. వర్గీకరణ అమలుకై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలో భాగంగా తాజాగా ఫిబ్రవరి 4న అసెంబ్లీ వేదికగా ఎస్సీ వర్గీకరణ అమలుకై చట్టబద్ధత చేస్తామని హామీ ఇస్తూ,రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ ఐన షామిమ్ అక్తర్ ఇచ్చిన రిపోర్టులోని క్రిమిలేయర్ అంశాన్ని మినహాయిస్తూ, మిగతా అంశాలు అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పడం జరిగింది. అయితే తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తామంటున్న ఎస్సీ వర్గీకరణలో భాగంగా 59 కులాలను గుర్తించి మూడు విభాగాలుగా విభజించారు. వాటిలో



గ్రూప్1 కేటగిరిలో సామాజికంగా ఆర్థికంగా విద్యాపరంగా అత్యంత వెనుకబడిన 15కులాలని చేర్చి 3.288శాతం జనాభాకి 1 శాతం రిజర్వేషన్ కేటాయిస్తామని, గ్రూప్.2 కేటగిరిలో మధ్యస్థంగా లబ్ధిపొందిన కులాలుగా 18 సమూహాలని ప్రధానంగా ఎస్సీఇతర ఉపకులాలని చేర్చి 62.48 శాతం జనాభాకి 9శాతం రిజర్వేషన్లని కేటాయిస్తామని, గ్రూప్3 కేటగిరీలో మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలుగా 26 సమూహాలని ప్రధానంగా ఇతర ఉపకులాలని చేర్చి33.963శాతం జనాభాకి 5శాతం రిజర్వేషన్లని 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్స్ కేటాయిస్తామని తీర్మానం చేయడం జరిగింది. భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాధికారం అనే మాస్టర్ 'కీ'తో సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని సందేశాన్ని ఇచ్చాడు. కాబట్టి ఇకనైనా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాల కాలంగా ఎస్సీ వర్గీకరణ అమలుకై ఎందరో నాయకులు పోరాటం చేసినప్పటికీ ఆ ఒక్క సమస్యని జీవితకాల సమస్య కాదు. కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కాబోతున్న తరుణంలో ఇక ఇన్నాళ్లుగా వర్గీకరణ కోసం పోరాడిన నాయకులందరూ కూడా రాజ్యాధికార పోరాటంపైదృష్టి పెట్టి తెలంగాణ రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు ఏకమై బహుజన రాజ్యాధికారాన్ని సాధించుకోవడమే ముందున్న అంతిమ లక్ష్యం అని భావించాలి. ఎందుకంటే అణగారిన వర్గాలకి తెలంగాణ రాష్ట్రంలో నేటి వరకు రాజ్యాధికారం లేకపోవడం మూలంగా రాజకీయ, సంపద, భూభాగ, వ్యాపారం ఇలా అనేకరంగాల్లో సమాన వాటా దక్కక తీవ్రంగా నష్టపోయినట్టుగా అనేక గణాంకాలు నిరూపిస్తున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అగ్ర కులాలు ఎస్సీ,ఎస్టీలపై చేసిన అనేక దాడుల సంఘటనల్లో ఒకరికొకరు అన్నదమ్ముల వలె కలిసి పోరాడి హక్కులకై, న్యాయం కోసం ఉద్యమించారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడమే జీవితకాల లక్ష్యంగా ఆయా నాయకులు భావించకుండా, ఒకనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బహుజన రాజ్యస్థాపనకై రాజకీయ రణరంగాన్ని సృష్టించిన దళిత, బహుజన నాయకులు నేడు అంతేస్థాయిలో బహుజన రాజ్యాధికార భూకంపనలు సృష్టించాల్సిన అత్యవసరత ఉన్నదనే సత్యాన్ని అణగారిన వర్గాల నాయకులు గ్రహించాలి. ఎస్సీ వర్గీకరణతో రాష్ట్రస్థాయిలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని విద్యా ఉద్యోగాల్లో అవకాశాన్ని దక్కించుకోగలం కానీ కేంద్ర స్థాయి ఉద్యోగాల్లో సమాన వాటాకి రాష్ట్రస్థాయి చట్టాలు సరిపోవు కాబట్టి అంతిమంగా పార్లమెంటులో జనాభా దామాషాప్రకారం ఆయా కులాల ప్రతినిధులు ఉంటేనే అన్ని సామాజిక వర్గాల వారికి అన్ని రంగాల్లో పంపిణీ జరుగుతుంది. కనీసం రాష్ట్ర పరిధిలోని చట్టాలకు లోబడి అన్ని రంగాల్లో సమన్యాయం చేసుకోవాలని, ప్రభుత్వ పాలనలో ప్రతినిధులుగా జనాభా దామాషా ప్రకారం బీసీ ఎస్సీఎస్టీ నాయకులు ఉన్నప్పుడే ఆయా కులాలకు సామాజిక రాజకీయ ఆర్థిక రంగాల్లో సామాన్యయం జరుగుతుందనే వాస్తవాన్ని నేటి బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు గ్రహించి ఇకనైనా పరివర్తన చెంది సామాజిక పోరాటాలని రాజ్యాధికార పోరాటం దిశగామళ్లించి యుద్ధ ప్రాతిపదికన ఆధిపత్య కులాలకబంధ హస్తాల్లో బందీఅయిపోయిన రాజ్యాన్ని ఉలిక్కిపడేలా సామాజిక రాజకీయ పోరాటాలు చేయాల్సిన తక్షణ అవసరత ఉన్నదనే అంశాన్ని అణగారిన వర్గాల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మేధావులు విద్యావంతులైన నాయకులు, ప్రజలు గ్రహించాల్సిన సత్యం. •

# ఉచిత పథకాలతో సామాన్యుడిపై భారం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మధ్య మాటల సందర్భంలో క్షీణించిన రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల్లో, తాము ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను తక్షణమే అమలు చేయటం కష్టమని వెల్లడించారు. మంచిదే, అయితే ఈ మహిళా ఉచిత బస్సు ప్రయాణం బదులు వైసీపీ ప్రభుత్వం పెంచిన చార్జీలని గత తెలుగుదేశ ప్రభుత్వ స్థాయికో, నష్టం వచ్చినా ప్రభుత్వమే భరిస్తూఇంకా సాధ్యమైన మేర తగ్గిస్తే ప్రయాణీకులందరికీ లాభమేగాక ప్రజారవాణా పెరిగి ట్రాఫిక్ఇక్కట్లు, వాహన ప్రమాద మరణాలు, జల,వాయు కాలుష్యాలు తగ్గి, పర్యావరణానికిమేలు చేస్తుంది. విదేశీ, చమురు దిగుమతుల భారమూతగ్గుతుంది. కనుక ఈ దిశగా ప్రభుత్వం పునరాలోచన చేయాలి. మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం అని పూరించిన కర్ణాటక ప్రభుత్వం కూడా పెరిగిన ఉచిత భారాన్ని చార్జీలను పెంచి ప్రజలపై మోపబోతుందనే వార్తలు వచ్చాయి. అసలు రాజకీయపార్టీలు ప్రకటించే జనాకర్షక పథకాల భారాన్నిమోసేది అధికార పార్టీలనేతలో, తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసే విపక్షపార్టీ నేతలోకాదు, తామేనని తెలుసు గనుక మెజార్టీ ప్రజలు తరచూ సుపరిపాలన వైపే మొగ్గుతుంటారు. సూపర్ సిక్స్‌విజన్ 2047వంటి పథకాల కంటే స్వచ్ఛమైన పరిపాలన కోసం మన రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీని గెలిపించారు. ఒకప్పుడు పశ్చిమ బెంగాల్‌లో జ్యోతి బసు, త్రిపురలో మాణిక్ సర్కార్, ఒరిస్సాలో నవీన్ పట్నాయక్ లాంటి వారు దక్షత, నిజాయితీ గల నేతలనే నమ్మికతో ప్రజలు 20సంవత్సరాలు పైగా ఏకధాటిగావారిని గెలిపించారు. రాష్ట్రంలో కూడా రౌడీయిజాన్ని, అవినీతిని నియంత్రించిన క్రమశిక్షణ గల నేతలుగా భావించి

తిరుమలశెట్టి సాంబశివరావు


యన్టీఆర్, చంద్రబాబును ఎన్నోసార్లు గెలిపించారు. అయితే విద్యుత్ చార్జీల పెంపు, బషీర్ బాగ్ కాల్పుల ఘటనతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలు ఏకమైన ఫలితంగా 2004 ఎన్నికల్లో కొద్ది తేడాతో టీడీపీ ప్రభుత్వం ఓడిపోయింది. ఇక ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామని గొప్పగాచెప్పుకున్నా, ప్రతిపక్షాల అనైక్యత, ముఖ్యంగా ప్రజారాజ్యం, టీఆర్ఎస్ భారీగా చీల్చటంతో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రెండోసారి అతికష్టమ్మీద గట్టెక్కింది. ఇక అనుచిత ఉచిత పథకాలకు సానుకూలంగా లేని బిజెపి కూడా గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో దేశభక్తి, పౌరులంతా ఒక్కటే,నిజాయితీ వంటి నినాదాలతోనే విజయం సాధించింది కదా. ఐనా నేటి మన నాయకులు ప్రజల ధనమే అనే ధీమాతో, మంచి అనిపించుకోవడానికి పోటీపడి ఎన్నికల వేళ హామీలు ఇస్తున్నారు. ఇకనైనా అప్పుల ఊబిలో వున్న రాష్ట్రప్రభుత్వం కూడా ఉచితాల మాయ నుండి బైటపడి తక్షణ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి. నేడు ప్రజలు చౌక రుణాల సౌకర్యం వంటి వాటితో భారీగా పెరిగిన వాహన వినియోగం, ట్రాఫిక్ వంటి సమస్యలతో అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర విభజన వేళ రెండు ప్రభుత్వాలు పోటీపడి పెంచిన జీతభత్యాల ఫలితంగా ఖజానాపై వ్యయం భారీగా పెరిగి లక్షలాది ఖాళీలను భర్తీ చేయకపోవటంతో తగినంత మంది సిబ్బందిలేరని అధికారులూ, ఉద్యోగులూ గతంలో వలే తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించకపోవటంతో పురపాలన గాడితప్పింది. కార్లు, కాన్వాయిల్లో తిరిగే ప్రజాప్రతినిధులకు ఈ సమస్యలపై సరైన అవగాహన లేకపోవచ్చు. కనుక ఇకనైనా వాటిపై తక్షణ చర్యలు చేపట్టాలి.మన ప్రతిపక్షాలు కూడా ప్రతి ప్రభుత్వనిర్ణయాన్ని రాద్ధాంతం చేసే అలవాటు మానుకోవాలి. పెన్షన్, రేషన్ కార్డులు వంటి వాటిలో అక్రమాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వం భావిస్తుంటే పేదలపై పిడుగు అంటూ కొందరు అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారు. అసలు ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకానికి రేషన్ కార్డు కావాలని డిమాండ్ చేస్తున్నందునే తెల్లరేషన్ కార్డులు తీసుకోటం, ఫలితంగా రేషన్ బియ్యం పక్కదారి పట్టటం చూస్తున్నాం. అయితే పాశ్చాత్య జల్సా సంస్కృతి పెరగటం, అధిక పన్నుల భారం మోస్తున్నాం గనుక కొంత వరకైనా గిట్టుబాటు చేయాలని మరి కొందరు సంపాదనా పరులు కూడా సంక్షేమ పథకాలు పొందుతున్నారు. మన వంతుగా సొంత లాభం కొంత మానుకుంటేనే సమాజం చైనా, జపాన్ వంటి దేశాలవలే త్వరితగతిన అభివృద్ధి చెందుతుంది. మన పిల్లల్ని కష్టపడి, కష్టపెట్టి చదివిస్తే అప్పుడు తెలుసుకోకపోయినా పెరిగి ప్రయోజకులై తమ పెద్దల గురించి గొప్పగా చెప్పుకుంటారు మరి అక్రమాలతో వందల కోట్లు సంతానానికి పంచినా వారి గురించి గొప్పగా చెప్పుకోరు, చెప్పుకోలేరు. అలాగే మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా తాము ఆదర్శంగా ఉంటూ ఉచిత పథకాల దుష్ఫలితాలను వివరిస్తే ప్రజలు తప్పక అర్థంచేసుకుంటారు. ఐతే అవసర మైన సంక్షేమ పథకాలనుమాత్రం నిజమైన పేదలకే వర్తింప జేస్తూ, ఇలా ఆదాచేసిన ప్రజా ధనంతో గతప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ బిల్లులు, బస్సుచార్జీల భారం తగ్గిస్తే ఎటువంటి రాయితీ పథకాలు ఆశించనీ, స్థిరమైన ఆదాయం లేని సామాన్య, అన్నివర్గాల ప్రజలు హర్షిస్తారు. •

# స్థానిక సమస్యల పరిష్కారమే పంచాయతీరాజ్ లక్ష్యం!

భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీ రాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలనకాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రంరాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్ నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగాత్మక ప్రాతిపదికగా, సమాజ వికాసాభివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, కుటీర పరిశ్రమలు అనే ఐదురంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్)గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీని 1956లో నియమించారు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈకమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి. బల్వంతరాయ్ మెహతా (1900 ఫిబ్రవరి 19, 1965 సెప్టెంబరు 19) స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్డోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయం పాలన కోసం ప్రజల

రామ కిష్టయ్య సంగన భట్ల

పోరాటం ఆయన జీవితాశయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా 'బల్వంతరాయ్ మెహతా కమిటీ' సిఫార్సులు దేశంలో అమలు పరచబడి,ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమంతో మెహతా గుర్తింపు పొందాడు.స్వాతంత్ర్యం తరువాత మెహతా భారత దేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యాడు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక ప్రాజెక్ట్స్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా



భారతదేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసించ బడ్డాడు.1952, అక్టోబరు 2న ప్రవేశపెట్టిన సమాజ అభివృద్ధి కారక్రమం ప్రాతిపదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్‌రాయ్ గోపాల్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశపెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీక్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3 అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేస్తూ, తన నివేదికను 1957, నవంబరు 24న జాతీ యాభివృద్ధి మండలికి సమర్పించింది. కమిటీ నివేదికను జాతీయాభివృద్ధి మండలి 1958, జనవరిలో ఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీ రాజ్ సంస్థ ఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచనంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానాన్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం"నేడు ప్రారంభమవుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి. మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూప్రారంభించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ ప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమబద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయిలో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరిపాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి.పంచాయతీలకు రాష్ట్రప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీసూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్యసాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్రరాష్ట్రప్రభుత్వాలు తనవంతు కృషిచేస్తూనే ఉన్నాయి. •

# ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా..

# అమెరికా-రష్యా తొలివిడత చర్చలు షురూ!

## సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని ప్యాలెస్‌లో సమావేశాలు



**రియాద్, ఫిబ్రవరి 18:** అమెరికా-రష్యా దేశాలు యేళ్లతర్వాత తొలిసారి ఉక్రెయిన్ యుద్ధ ముగింపుకోసం అధికారికంగా చర్చలు మొదలు పెట్టాయి. సౌదీ అరేబియా రాజధాని రియాద్ లోని దిర్హియా ప్యాలెస్ వీటికి వేదికైంది. అమెరికా-రష్యా విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, సెర్గీ లవ్రోవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుద్ధానికి ఎలా ముగింపు పలకాలన్న అంశం వీరి మధ్య ప్రధానంగా చర్చకు వచ్చింది. అమెరికా పశ్చిమాసియా దూత స్టీవ్ విట్‌కాఫ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. మరోపక్క రష్యా తరఫున క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉష్కోవ్ కూడా హాజరయ్యారు. సౌదీ అరేబియా మంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్, జాతీయ భద్రతా సలహాదారు ముసాద్ బిన్ మహమ్మద్ అల్ అబియన్ ఈ చర్చల్లో భాగం కావడం విశేషం. 2022 జెనీవాలో మీటింగ్ తర్వాత ఉభయ దేశాల దౌత్యవేత్తలు భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ సమావేశంపై అమెరికా స్పందిస్తూ.. ఇది చర్చల ప్రారంభం కాదని.. యుద్ధం ముగింపునకు రష్యా సిద్ధంగా ఉందో లేదో తెలుసుకోవడానికని పేర్కొన్నారు. ఇక మాస్కో ప్రతినిధి మాట్లాడుతూ తాము అమెరికాతో సంబంధాలను సాధారణంగా చేసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**అమెరికన్ జాతీయుడికి స్వేచ్ఛ..**

మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నాడనే ఆరోపణలపై ఈనెల 7న రష్యాలోని వ్నుకోవ్ విమానాశ్రయంలో అరెస్టయిన కలోబ్ బేయర్స్ అనే 28 యేళ్ల యువకుడినివదిలిపెట్టారు. ఈవిషయాన్ని రష్యా మీడియా సంస్థలు వెల్లడించాయి. కలోబ్ ఇస్తాంబుల్ నుంచి తన ప్రేయసితో ప్రయాణిస్తుండగా కస్టడీలోకితీసుకొన్నారు. అతడిపై నేరం రుజువైతే 10 యేళ్ల జైలు శిక్ష పడేది. మాస్కో-వాషింగ్టన్ల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే చర్యల్లో భాగంగా అతడిని విడుదలచేసినట్లు తెలుస్తోంది.

**జెలెన్‌స్కీతో చర్చలకు పుతిన్ ఓకే: క్రెమ్లిన్**

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపేందుకు పుతిన్ ఓకేచెప్పారు. అవసరం అనుకుంటే వీరి మధ్య చర్చలు ఉంటాయని క్రెమ్లిన్ వెల్లడించింది. అదే సమయంలో అధ్యక్షుడిగా జెలెన్‌స్కీ చట్టబద్ధతను ప్రశ్నించింది. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు మంగవారం సౌదీ అరేబియా వేదికగా కీలక సంప్రదింపులు మొదలైన సంగతి తెలిసిందే. అమెరికా, రష్యా ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో తాజా స్పందన వచ్చింది.

2022 నుంచి రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరుగుతోంది. తాను అధికారంలోకి వస్తే ఆ యుద్ధాన్ని ఆపేస్తానని పలుమార్లు చెప్పిన డొనాల్డ్ ట్రంప్.. అధికారాన్ని చేపట్టిన వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టారు. దానిలో భాగంగానే అమెరికా-రష్యాలు యేళ్ల తర్వాత తొలిసారి ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం అధికారికంగా చర్చలు మొదలుపెట్టాయి.



# మహాకుంభ్‌మేళాలో 55 కోట్లమంది పుణ్యస్నానం

**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 18:** ప్రయాగరాజ్‌లో భారీ ఎత్తున కొనసాగుతున్న కుంభమేళాకు ఊహించని రీతిలోభక్తులు వస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి 55 కోట్లమందికిపైగా భక్తులుత్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపి ప్రభుత్వం ఒకప్రకటన చేసింది. మానవ చరిత్రలో ఏమతపరమైన సాంస్కృతిక సామాజిక కార్యక్రమంలో ఇంత భారీగా జనం పాల్గొనలేదని వెల్లడించింది. దేశ విదేశాలనుంచి భారీగా సామాన్యులు ప్రముఖులు తరలివచ్చి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. గతనెల 13న ప్రారంభం అయిన ఈ ఆధ్యాత్మిక వేడుక ఈనెల 26వ తేదీవరకూ కొనసాగుతున్నది. భారత్‌లోని 110 కోట్లమంది సనాతనుల్లో సుమారు సగంమంది పవిత్ర గంగానదిలో స్నానం ఆచరించారని తెలిపింది. 26 నాటికి ఈ సంఖ్య 60 కోట్లు దాటుతుందని అంచనావేసింది. తొలుతకుంభమేళాకు 45కోట్లమందిమాత్రమే వస్తారనిఅంచనా వేస్తే ఊహించనిరీతిలోభక్తులు పోటెత్తారు. 14వ తేదీకే 50 కోట్లమార్కును అధిగమించి తాజాగా 55 కోట్లమార్కును చేరుకుంది. 29న మౌని అమావాస్యరోజే సుమారు 8కోట్లమంది ప్రయాగ్ రాజ్‌కు రాగా మకర సంక్రాంతి రోజున 3.5 కోట్లమంది జనవరి 30న రెండుకోట్లమందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపి సర్కారు తెలిపింది.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాడు కుటుంబ సమేతంగా కుంభమేళాలో పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్ కూడా కుటుంబసమేతంగా త్రివేణి సంగమంలో స్నానం చేసారు. మహాకుంభమేళా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మత ఆధ్యాత్మిక వేడుక అని వెంకయ్య పేర్కొన్నారు. సనాతన సంప్రదాయం వారసత్వానికి ఇదో గొప్ప ప్రతీకగా పేర్కొన్నారు. దేశం ఆరోగ్యంగా సౌభాగ్యంగా ఉండాలని గంగా మాతను ప్రార్థించానని వెంకయ్యానాయుడు తెలిపారు.



# గ్వాటెమాలాలో లోయలో పడిన బస్సు

## 51 మంది మృతి, పలువురికి తీవ్రగాయాలు

**గ్వాటెమాలా సిటీ, ఫిబ్రవరి 18:** లాటిన్ అమెరికా దేశం గ్వాటెమాలాలో రాజధాని నగరంలో జరిగిన బస్సుప్రమాదంలో 51 మంది చనిపోయారు. ఇటీవలికాలంలో గ్వాటెమాలా సిటీలో అత్యంత భారీ స్థాయిలోజరిగిన ప్రమాదంగా అధికారులు చెపుతున్నారు. బస్సు ఘాట్‌లోని రైయిలింగ్‌ను ఢీకొని అక్కడినుంచి అత్యంత లోతుగా ఉన్న లోయలో పడిపోయింది. 70 మందికిపైగా ప్రయాణిస్తున్న ఈబస్సులో కిందికి ఒక్కసారిగా పడిపోవడంతో 51 మంది చనిపోయారు. వలంటీర్ ఫైర్‌ఫైటర్స్ గ్రూప్‌నకు చెందిన విక్టర్ గోమెజ్‌మాట్లాడుతూ ఇప్పటి వరకూ శవాగారానికి 51 మృతదేహాలు తెచ్చినట్లుచెప్పారు. మరో పదిమంది తీవ్రంగా గాయపడిన వారిని బస్సునుంచి వెలికి తీస్తున్నట్లు తెలిపారు. గ్వాటెమాలా అధ్యక్షుడు బెర్నార్డో అరెవాలో ఈప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేసారు. బస్సు ఘాట్‌రోడ్డులో వెళుతుండగానే మెటల్ రెయిలింగ్‌ను ఢీకొని సుమారు 20 మీటర్ల లోతున్న లోయలోకి పడిపోయిందని మురుగునీరు కలుషిత నీటినదిలోపడిపోయిందని అగ్నిమాపకశాఖ అధికారి కార్లోస్ హెర్నాండెజ్ అన్నారు. బురదనీటినుంచి మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. స్థానిక మీడియా వివరాలప్రకారం బస్సు గ్వాటెమాలా నగరానికి వెళుతోంది. సాన్ ఆగస్టిన్ అకాసాగ్వాస్టాన్‌నుంచి బయలుదేరి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్వాటెమాలా నగరానికి వస్తున్నట్లు సమాచార మంత్రి మిగ్వేల్ ఎంజెల్ దియాజ్ అన్నారు. 30 ఏళ్ల సర్వీసు ఉన్న ఈ బస్సుకు లైసెన్స్ ఉందని అధికారులు తెలిపారు. దక్షిణ, మధ్య అమెరికా దేశాల్లో రోడ్డు ప్రమాదాలు ఇటీవలికాలంలో పెరిగిపోయాయి. 2018 జనవరిలో పెరూ దేశంలో రాజధాని లిమా వద్ద ఒక బస్సు పడిపోయిన ప్రమాదంలో 52 మంది చనిపోయారు.

# గుజరాత్‌లో పట్టునిరూపించుకున్న బిజెపి

## స్థానిక ఎన్నికల్లోను కాషాయం హవా



**అహ్మదాబాద్, ఫిబ్రవరి 18:** గుజరాత్ రాజకీయ ముఖచిత్రంపై భారతీయ జనతాపార్టీ తన పట్టు పెంచుకుంది. మొత్తం 66 మున్సిపాలిటీలు, మరో రెండు ఉప ఎన్నికల్లో తన సత్తాను చాటింది. బిజెపి మున్సిపాలిటీ ఎన్నికల్లో తన ఆధిపత్యం చాటింది. మొత్తం 1315 స్థానాల్లో బిజెపి గెలిస్తే కాంగ్రెస్ 252 స్థానాలు మాత్రమే దక్కించుకోగలిగింది. స్వతంత్ర అభ్యర్థులు 126 స్థానాల్లో గెలిస్తే ఆప్ అభ్యర్థులు, ఇతరులు 13స్థానాలు నాలుగు స్థానాల్లో గెలిచారు. తాలూకా పంచాయతీ పోల్స్‌లో కూడా బిజెపి ఆధిక్యం ప్రదర్శించింది. 55స్థానాలు గెలిస్తే కాంగ్రెస్ 17 సీట్లకే పరిమితం అయింది. స్వతంత్రులు మరో ఆరుస్థానాలు గెలిచారు. ఇదే తీరు జునాగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా కొనసాగింది. బిజెపి 44 స్థానాల్లోను, కాంగ్రెస్ 11 స్థానాల్లోను గెలిచింది. ఈనెల 16వ తేదీనుంచి ప్రారంభం అయిన ఈ ఎన్నికల్లో వోటర్లు 57శాతం పాల్గొన్నారు. చోర్వాద్ మున్సిపాలిటీలో 76శాతం రికార్డు అయింది. మొత్తం 1844 మున్సిపల్ స్థానాల్లో 167 పోటీలేకుండానే గెలిచాయి. 4374 మంది అభ్యర్థులు మిగిలిన 1677 స్థానాల్లో పోటీచేసారు.

పోటీలేని స్థానాల్లోకూడా బిజెపి డామినేట్ చేసింది. 162 సీట్లలో పోటీలేకుండా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ ఒకటి, ఇతర పార్టీలకు నాలుగు స్థానాలు వెళ్లాయి. బిజెపి వల్సాద్, పార్ది, ధరమ్‌పూర్ మున్సిపాలిటీలను గెలుచుకుంది. అయితే రెబెల్స్‌నుంచి ఎక్కువ చిక్కులు ఎదుర్కొంది. నలుగురు స్వతంత్రులు ధరమ్ పూర్‌లో గెలవడమే ఇందుకు కారణం. వల్సాద్‌లో బిజెపి 37 స్థానాల్లో 34 గెలిచింది. కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్కస్థానమే గెలిచింది. జునాగఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బిజెపి 60 స్థానాల్లో 40 గెలుచుకుంది. కాంగ్రెస్ 11 స్థానాలు, ఒకస్థానం స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. 2004నుంచి జునాగఢ్‌లో బిజెపి పట్టుతో ఉంది. 2009లో ఒక్కసారి మాత్రమే కాంగ్రెస్ గెలిచింది.

దేవ్‌గఢ్ బారియా నగర్ పాలికా ఎన్నికల్లో హింస ప్రజ్వరిల్లింది. కాపాడి ప్రాంతంలో హాహాకారాలే వినిపించాయి. గుర్తుతెలీని వ్యక్తులు రాళ్లురువ్వారు. రెండుగ్రూపుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం జరిగింది. అధికారులు ఎక్కడికక్కడ భారీ సంఖ్యలో సిబ్బందిని మొహరించడంతో ఎలాంటి ప్రాణహాని జరగలేదు.

# వికీపీడియా పేరు మార్చుకుంటే రూ. 8,600 కోట్లిస్తా!

## ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ విరాళం ఆఫర్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 18:** వికీపీడియా ఆన్‌లైన్ వేదికగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు విస్తృత సమాచారాన్ని ఉచితంగా అందిస్తోంది. అయితే ఈ ఎన్‌సైక్లోపీడియాను ఓపెన్ చేయగానే విరాళాలకు సంబంధించిన సందేశం దర్శనమిస్తుంది. దీనిపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఇప్పటికే పలుమార్లు వ్యంగ్యంగా కామెంట్లు చేశారు. తాను ఆ సంస్థకు బిలియన్ డాలర్లు ఇవ్వడానికి సిద్ధమేనని అన్నారు. కానీ దానికి ఓ షరతు పెట్టారు. తాజాగా మరోసారి మస్క్ ఆ ఆఫర్‌పై ప్రకటన చేశారు. సోషల్ మీడియా యాజమాన్యం దాని పేరును (రాయటానికి వీలులేని ఓ అసభ్యకర పేరుగా) మారిస్తే.. వారికి బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 8,600 కోట్లు) ఇస్తానని అన్నారు.

'వినియోగదారుల నుంచి నిధుల సేకరించాల్సిన అవసరం వికీమీడియా ఫౌండేషన్‌కు ఏముందని మీరు ఎప్పుడైనా ఆలోచించారా..? వికీ నిర్వహణకు అంత డబ్బు అవసరం లేదు. మరి దేనికోసం ఆ సొమ్ము అడుగుతున్నారు..?' అని మస్క్‌ప్రశ్నించారు. ప్రపంచ కుబేరుడు ఈ ఆఫర్ ప్రకటించిన విషయమై ఓ యూజర్ స్పందిస్తూ ఆ ఆఫర్ ఇంకా ఉనికిలో ఉందా? అని మస్క్‌ను ప్రశ్నించారు. దీనికి మస్క్ బదులిస్తూ 'అవును ఆ ఆఫర్ ఇంకా ఉంది. కావాలంటే ముందు పేరు మార్చాలి' అంటూ మస్క్ జవాబిచ్చారు.

# స్వేచ్ఛ ఉందని ఏదయినా మాట్లాడేస్తారా?

## యూట్యూబర్ రణ్‌వీర్‌పై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** వాక్ స్వాతంత్ర్యం ఉంది కదాని ఏదైనా మాట్లాడేస్తారా అని యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. సామాజిక కట్టుబాట్లను గాలికొదిలేసి నోటికొచ్చింది మాట్లాడతారా అని మండిపడింది. ఇండియాస్ గాట్ లాటెంట్ ఈవెంట్‌లో పాల్గొన్న ఒక వ్యక్తిని తల్లితండ్రుల గురించి శృంగారంపై ప్రశ్నించిన తరుపట్ల దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అల్హాబాదియాపై పలు రాష్ట్రాల్లోకేసులు నమోదయ్యాయి. బెదిరింపులు కూడా ఎదుర్కొంటున్నట్లు చెపుతూ ఆతడు సుప్రీంలో పిటిషన్ వేసాడు. దీనితో మంగళవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు అరెస్టునుంచి ఆతడికి రక్షణ కల్పిస్తూ పలు ప్రశ్నలు వేసింది.

యూట్యూబ్‌షోలో అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు ఆతడి మెదడులో పేరుకుపోయిన మలినాన్ని బయటపెట్టాయి. ఇవి ఆతడి వక్రబుద్ధిని సూచిస్తున్నాయి. మేం ఎందుకు రక్షించాలి. వాక్‌స్వాతంత్ర్యం పేరుతో సామాజిక నిబంధనలకు విరుద్ధంగా నోటికొచినచంది మాట్లాడటానికి ఎవరికీ అనుమతిలేదన్నారు. సామాజిక విలువలంటే ఏమిటో ఉన్న పరిమితులేంటో సమాజానికి ఉన్న విలువలు మీకేమైనా తెలుసా వాటిని గౌరవించడం నేర్చుకోండి అని మండిపడింది. మీరు వాడిన పదాలు ఎంతోమంది మహిళలు, బాలికలు, తల్లితండ్రులనే కాదు సమాజం సైతం సిగ్గుపడేలాచేస్తాయి. నువ్వు నీ అనుచరులు ఆ స్థాయి దుర్మార్గానికి దిగజారారు. ఇది అసభ్యత కాకపోతే మరేంటీ మీపై నమోదయిన ఎఫ్ఐఆర్‌లను మేం ఎందుకు కొట్టేయాలి ఎందుకు ఎఫ్ఐఆర్‌లను క్లబ్‌చేయాలి అని ప్రశ్నించారు.

పాపులారిటీకోసం ఇలాంటి పదాలు వాడి బెదిరింపులవరకూ తెచ్చుకున్నారు. రణ్‌వీర్‌పై ఎఫ్ఐఆర్ నమోదయినా ఆతడిని అరెస్టు చేయకూడదని అన్నారు. పిటిషనర్ తన పాస్‌పోర్టును ఠాణె పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలి. కోర్టు ఆమోదంలేకుండా ఆతడు దేశం విడిచి వెళ్లకూడదన్నారు. అల్హాబాదియా కానీ ఆతడి స్నేహితులు కానీ తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ ఏ ప్రదర్శన చేయకూడదన్నారు. ఎఫ్ఐఆర్‌లు నమోదయిన మహారాష్ట్ర, అస్సాం పోలీసులకు అల్హాబాదియా సహకరించాలని ఆదేశించింది.

# షిండే వర్గం ఎమ్మెల్యేల భద్రత కుదింపుపై రేగుతున్న అసమ్మతి

## మహాయుతిలో కమ్ముకుంటున్న నిరసన



**ముంబయి, ఫిబ్రవరి 18:** మహారాష్ట్రలో మహాయుతి రాజకీయాలు గందరగోళంగా మారాయి. సిఎం దేవేంద్ర ఫడ్నవిస్ నేతృత్వంలోని హోం శాఖ 20 మంది అధికార ఎమ్మెల్యేల వైకేటగిరీ భద్రతను కుదించేందుకు సిద్ధం కావడంతో షిండేవర్గం కారాలు మిరియాలు నూరుతోంది. డిప్యూటి సిఎం ఏక్‌నాథ్‌షిండేకు చెందిన శివసేన 20 మంది ఎమ్మెల్యేల వైకేటగిరీ సెక్యూరిటీని ఉపసంహరించింది. బిజెపి అజిత్‌పవార్ వర్గం ఎమ్మెల్యేలకు కూడా భద్రతను తగ్గించనున్నారు. అయితే శిండేవర్గంతోపోలిస్తే ఆసంఖ్య చాలా తక్కువ అని పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా ప్రభుత్వం ఈచర్య తీసుకుంటున్నట్లు సమాచారం. గతంలో మహావికాస్ అఘాడి కూటమినుంచి అధికారపార్టీలోచేరిన ఎమ్మెల్యేలకు ఈ వైకేటగిరీ భద్రతను కల్పించారు. తాజాగా ఈభద్రతను తొలగించేందుకు సిద్ధం అయ్యారని ఆరోపిస్తున్నారు. 3నెలల కిందటే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సిఎం అభ్యర్థి ఎంపికలో విభేదాలు నెలకొన్నప్పటికీ వాటన్నింటికీ చెక్ పెడుతూ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసారు. ఇటీవల ఇన్‌ఛార్జి మంత్రుల నియామకంలోనూ అధికార కూటమిలో విభేదాలు తలెత్తాయి. రాయ్‌గఢ్, నాసిక్‌లకు ఇన్‌ఛార్జిల నియామకంపై శిండేసేన అభ్యంతరం తెలపడంతో వాటికిబ్రేక్‌పడింది. ఈ పరిణామాలవేళ శిండే నేతృత్వంలోని ఎమ్మెల్యేలకు భద్రతను కుదించాలని నిర్ణయించడం ఇపుడు విమర్శలకు తావిస్తోంది.



# రన్‌వేపై తిరగబడిన విమానం

## 18 మందికి తీవ్ర గాయాలు, ముగ్గురు పరిస్థితి విషమం

**టొరంటో, ఫిబ్రవరి 18:** కెనడాలో అనూహ్యరీతిన చోటుచేసుకున్న విమాన ప్రమాదం ప్రయాణీకులను భయానికి గురిచేసింది. టొరంటో పియర్సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెను ప్రమాదం తప్పిందనే చెప్పాలి. విమానం ల్యాండ్ అయినతర్వాత రన్‌వేపై అదుపు తప్పి బోల్తాపడింది. దీనితో 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిపరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో విమానంలో 80 మంది ప్రయాణీకులున్నారు. వెంటనే అప్రమత్తం అయిన భద్రతా సిబ్బంది రక్షణ చర్యలుచేపట్టారు. క్షతగాత్రులను దగ్గరలోని దవాఖానకు తరలించారు. డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం అమెరికాలోని మిన్నెపోలీస్‌నుంచి టొరంటోకు వచ్చింది. పియర్సన్ ఎయిర్‌పోర్టులో రన్‌వేపై దిగిన విమానం అదుపు తప్పి బోల్తాపడిందని అధికారులు చెప్పారు.

# కార్యకర్తల మృతికి ప్రతీకారం తీర్చుకుంటా!

## బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్‌యూనస్ ఒఉగ్రవాది అంటూ ఆదేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఘాటు విమర్శలుచేసారు. అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఒక బహిరంగ కార్యక్రమంలో హసీనా జూమ్‌కాల్‌ద్వారా కనిపించారు. ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, తాను బంగ్లాకు తిరిగివస్తానని, పార్టీ కార్యకర్తల మరణాలకు ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞచేసారు. అవామి లీగ్ పార్టీ నాయకులు ఓపిగ్గా ఐక్యంగా ఉండాలి. నా దేశానికి తిరిగి వస్తా, పార్టీ కార్యకర్తల మృతికి ప్రతీకారం తీర్చుకుంటా. గతంలో మాదిరిగానే అందరికీ న్యాయంచేస్తా. జులై ఆగస్టుల్లో జరిగిన నిరసనల్లో మరణించినవారు పోలీసుల కాల్పులకారణంగా చనిపోలేదు. ఇపుడు పోస్టుమార్టం నిర్వహిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయి. విద్యార్థులు చేసిన ఆందోళనలకు అనేకమంది పోలీసులు అవామి లీగ్ కార్యకర్తలు, విద్యావంతులు, కళాకారులు హత్యకు గురయ్యారు. అయినా యూనస్ వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమెప్రశ్నించారు. దేశాన్ని నడపడంలో తనకు ఎలాంటి అనుభవం లేదని గతంలోనే ఆయన అంగీకరించారు. అన్ని విచారణ కమిటీలను రద్దుచేసి దేశాన్ని నాశనంచేస్తున్నారని ప్రభుత్వ కార్యాలయాలపై అధికారులపై దాడులుచేయడం యూనస్ అసమర్థతకు నిదర్శనమన్నారు. ప్రణాళికతోనే నాతండ్రి నివాసాన్ని నాశనం చేసారని, మధ్యంతర ప్రభుత్వం ఏర్పడి ఇన్ని నెలలు గడుస్తున్నా అల్లర్లు ఆగలేదని అన్నారు. దేశ ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో ఉంది. శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ప్రజల భద్రత ప్రమాదంలో ఉందని, ఈ ఉగ్రవాద ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఆమె అన్నారు.

ఈసందర్భంగా ఆందోళనల్లో మృతిచెందిన పలువురు పోలీసుల కుటుంబాలతో హసీనా మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గత ఏడాది ఆగస్టు 5న దేశం వీడిన షేక్ హసీనా భారత్‌లోఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హసీనాతో పాటు ఆమె మంత్రివర్గంలో ఉన్న నేతలు సలహాదారులు సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఇప్పటికే ఆమెకు అరెస్టువారంట్ జారీచేసింది. మరోవైపు యూనస్ సర్కారు ఆపరేషన్ డెవిల్‌హంట్‌ను ప్రారంభించింది. దేశాన్ని అస్థిరపరిచే కుట్రదారులను చట్ట ఉల్లంఘనలకు పాల్పడేవారే లక్ష్యంగా ఈ ఆపరేషన్‌చేస్తున్నట్లు బంగ్లాదేశ్ హోంమంత్రి తెలిపారు. హసీనా ప్రభుత్వంలో పనిచేసిన 41 మంది పోలీస్ అధికారులను ముందురోజే బంగ్లాప్రభుత్వం అరెస్టుచేసింది. విద్యార్థుల ఆందోళన సమయంలో వారిని అణిచివేశారంటూ 1059 మంది పోలీస్ అధికారులను సిబ్బందిని ఉద్యోగాలనుంచి తొలగించింది.

# కేన్సర్ చికిత్సకు ఐదారునెలల్లో టీకా

## కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్



**ఛత్రపతి శంభాజీనగర్, ఫిబ్రవరి 18:** మహిళల్ని తీవ్రంగా ప్రభావితంచేస్తున్న క్యాన్సర్లను ఎదుర్కొనేందుకు ఐదారునెలల్లో టీకా అందుబాటులోకి వస్తుందని కేంద్ర వైద్యఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్‌జాదవ్ వెల్లడించారు. ఈ టీకా వేసుకునేందుకు తొమ్మిదినుంచి 16 ఏళ్లలోపు వయసు ఉన్న బాలికలు మాత్రమే అర్హులని స్పష్టంచేసారు. ఈ టీకాపై పరిశోధనలు దాదాపు పూర్తికావచ్చాయని ట్రయల్స్ కొనసాగుతున్నాయన్నారు. మంగళవారం ఆయన ఛత్రపతి శంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడారు. దేశంలో కేన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది, ఈ సమస్య పరిష్కరించేందుకు కేంద్రం చర్యలుచేపట్టిందన్నారు. 30 ఏళ్లు పైబడిన మహిళలకు ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తారని, ఈవ్యాధిని ముందుగా గుర్తించేందుకు డేకేర్ కేన్సర్ కేంద్రాలు కూడా ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. ఈ టీకా రొమ్ము నోటి గర్భాశయ కేన్సర్లను నియంత్రిస్తుందని మంత్రి జాదవ్ తెలిపారు. ఆసుపత్రుల్లో ఆయుష్ విభాగాలున్నాయని ప్రజలు ఈసౌకర్యాలను పొందవచ్చున్నారు.

## కాంగ్రెస్ అధిష్ఠానానికి కాళేశ్వరం మహాకుంభాభిషేకం ప్రసాదం

### మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** కాళేశ్వర ముక్తీశ్వరస్వామి క్షేత్రంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో మూడు రోజులుపాటు జరిపిన మహా కుంభాభిషేకం ప్రసాదం, కాళేశ్వరుడి ప్రతిమ, త్రివేణి సంగమం (గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదులు) జలం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఎంపీ ప్రియాంక గాంధీలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పంపించారు. ప్రభుత్వం మూడురోజులపాటు ఘనంగా నిర్వహించిందని.. ఈ నెల 7న మాఘశుద్ధ దశమి నుంచి 9వ తేదీ మాఘ శుద్ధ ద్వాదశి వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయని.. 42 యేళ్ల తర్వాత నిర్వహించినట్టు ఎఐసిసికి రాసిన లేఖలో ఆమె పేర్కొన్నారు. కాళేశ్వరం దేవా లయంలో 1982లో మహా క్రుంభాభిషేకం జరిగిందని, అప్పటి నుంచి మళ్లీ ఇప్పటి వరకు ఈ వేడుకలు జరగ లేదని వివరించారు. ఈ మహా కుంభాభిషేకం కార్యక్రమంలో శృంగేరి జగద్గురువులు భారతతీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి, తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి పాల్గొనన్నారని.. దీని ద్వారా ఆ దేవాస్థాన సంప్రోక్షణ చేయడంతో పవిత్ర మరింత పెరుగుతుందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బిజెపి ఎంపి ఈటల రాజేందర్

## బిసి జనాభాను తగ్గించి చూపుతున్న ప్రభుత్వం

### బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు: బిజెపి ఎంపి ఈటల

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** బిసి కులగణన తప్పుల తడకగా రానుందని బిసి జనాభాను తగ్గించి చూపించారని ఇది కాంగ్రెస్ చేసిన కుట్రలో భాగమేనని మల్కాజ్‌గిరి ఎంపీ బిజెపి రాష్ట్ర నాయకులు ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. బిజెపి ఉపాధ్యాయుల ఖమ్మం నల్గొండ వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంలో మంగళవవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు బిసి కులగణన నిజాయితిగా చేయాలనే ఉద్దేశ్యం లేదని విమర్శించారు. 2011లో రాష్ట్ర జనాభా 3కోట్ల 60లక్షలు ఉండగా 2025కు కూడా అదే జనాభాను చూపించారని కోటి జనాభాను తగ్గించి చూపిస్తున్నారని నిజాయితిగా మీరు కులగణనను చేసి ఉంటే మళ్లీ రెండవ సారి ఎందుకు చేయిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. బిసి జనాభాను 46శాతం చూపిస్తూ కాంగ్రెస్ మోసం చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. బిసి కులగణనను ఆ పార్టీ స్వాగతిస్తుందని కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలు తమ పరిస్థితులను బట్టి కులగణనను చేసుకోవచ్చని తేల్చి చెప్పిందని తమిళనాడులో బిసి కులగణనను శాస్త్రీయ బద్ధంగా చేసి అమలు చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బిసిలను మోసం చేస్తూ డ్రామా కంపెనీల తయారైందని విమర్శించారు. 47 ఏళ్ల పాటు కాంగ్రెస్ పాలనలో బిసిలను సీఎంగా, ప్రధానమంత్రిగా చేయలేకపోయిందని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు కూడా ప్రజా వ్యతిరేకమైన పార్టీలని బీఆర్ఎస్ అమలు చేసిన విధానాలను కాంగ్రెస్ చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 12 నెలలు కావస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన 5డిఏలు ఇవ్వలేదని, పిఆర్‌సి అమలు చేయలేకపోయిందని చివరకు రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, పదవి విరమణ పొందిన ఉద్యోగులు దాచుకొన్న సొమ్మును కూడా ఇచ్చే స్థితిలో లేదని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక

### మైనింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక అందిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుకను అందించాలని తెలంగాణ మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటల పాటు, స్లాట్ బుకింగ్ సదుపాయం కల్పించాలని, ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయాలని కలెక్టర్లకు,అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిపారు. అతి త్వరలో తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుకను అందించనున్నారు. కాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే పనిలో పడింది.

## వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం

### మాల సంఘాల జెఎసి ఛైర్మన్ చెన్నయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ వల్ల మాలలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని, ఈ వర్గీకరణను మాలలు అంగీకరించరని మాల సంఘాల జెఎసి ప్రకటించింది. 2011 జనాభా లెక్కల ఉపకులాల వారీగా వర్గీకరణ జరగలేదని, తప్పుడు లెక్కలతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కమిటీ మాలలను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నదని జెఎసి ఆరోపించింది. ఈ మేరకు జెఎసి ఛైర్మన్ జి.చెన్నయ్య ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం మంగళవారం పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా జి.చెన్నయ్య మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత 2014 నుంచి 2024 వరకు ఎస్సీలలో విద్యా, ఉద్యోగాలు, ఎస్సీ కార్పోరేషన్ రుణాలు, ధలిత బంధు, భూమి, సబ్సీడీలు, రాజకీయ పదవుల్లో ఎవరు ఎక్కువగా పొందారో లెక్కలు తీస్తే ఎవరూ అభివృద్ధి చెందారో తెలుస్తు ందన్నారు. రాష్ట్రంలో మాలల కంటే మాదిగలే ఎక్కువగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందారని చెప్పారు. పిసిసి అధ్యక్షుడిని కలిసిన వారిలో జెఎసి కో-ఛైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, గోపాజు రమేష్, చెరకు రాంచందర్, బేర బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య, ఆరోగ్య శాఖకు అత్యంత ప్రాధాన్యత

### రాజీవ్ ఆరోగ్యశ్రీకి సమృద్ధిగా నిధులు కేటాయిస్తాం

### వైద్య, ఆరోగ్య శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి దామోదర రాజనర్సింహ



మంగళవారం సచివాలయంలో జరిగిన వైద్య, ఆరోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 18:** పేద, మధ్యతరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడే వైద్య, ఆరోగ్య శాఖకు నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన వైద్య, ఆరోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అధికా రులకు పలు సూచనలు చేశారు. గత దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎద్యు కేషన్ విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వంలో ఈ మూడు విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చి రాబోయే రోజుల్లో బలోపేతం చేస్తామని తెలిపారు. డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాలను ఆధునికీకరణ చేస్తాం అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకి రానున్న బడ్జెట్లో సమృద్ధిగా నిధులు కేటాయించి, పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం అన్నారు. రానున్న ఏడాది కాలంలో రాష్ట్రంలో వైద్య కళాశాల భవనాలు, ఆసుపత్రుల నిర్మాణం పనులు పూర్తవుతాయని మంత్రులు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పెద్ద సంఖ్యలో వినియోగించుకునేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రులు ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్లానిటోరియంలు నిర్మించే ఆలోచనలో ఉన్నట్టు మంత్రులు తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టియాన చొంగతా, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల కెసిఆర్ పాలన ఎలా గొప్పది?

### ఆంధ్రా కాంట్రాక్టర్లుకు దోచిపెట్టారు

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** కెసిఆర్ పదేళ్ళ అప్పుల పాలన గొప్పపాలన ఎలా అవుతుందని ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక పురవస్తు మంత్రి జూపల్లి కృష్ణారావు సందేహం వ్యక్తం చేశారు. మంగళవారం సిఎల్‌పిలో మాట్లాడుతూ మంత్రి జూపల్లి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్ర మాత్రమే ఉందా? వందల మంది ప్రాణాల త్యాగం లేదా? అని ప్రశ్నించారు. రాజకీయంగా దెబ్బతింటాం అని తెలిసి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారన్నారు. తెలంగాణ ఏర్పాటులో ఎవరి పాత్ర వాళ్లకు ఉందని అన్నారు. కేసీఆర్ మళ్ళీ రావాలని కొంద రు కోరుకుంటున్నారని, ఎందుకు అప్పులు చేయడానికా అని నిష్ఠూరాలు పలికారు. 10 యేళ్ల తర్వాత కూడా నిరుద్యోగ సమస్య ఎందుకు ఉందని దుయ్యబట్టారు. ధనిక రాష్ట్రం 8 లక్షల కోట్ల అప్పు ఎలా అయ్యిందని ఆయన ప్రశ్నించారు. నెలకు రూ.65000 కోట్లు ఈఎంఐలు కడుతున్నామని తెలిపారు. ఇదేనా గొప్ప పాలనా? కేసీఆర్ మళ్ళీ వస్తే రూ.20 వేల కోట్ల అప్పులు చేసి పెడతారని విమర్శించారు. కేసీఆర్ శాసన సభకి రావడం లేదు, కన్న తల్లి తండ్రులను చంపి, జడ్జి ముందు తల్లితండ్రులు లేని అనాధని అన్నట్టు కెటీఆర్ మాట్లాడు తున్నా డని మంత్రి జూపల్లి విమర్శించారు. కేటీఆర్‌కి సిగ్గుండాలి సర్పంచుల బిల్లులు ఇవ్వట్లేదు అని అనడానికి అని అన్నారు. సిగ్గులేకుండా కెటిఆర్ మాట్లాడుతు న్నాడని దుయ్యబట్టారు. బకాయి పెట్టింది ఎవరు? అని నిలదీశారు. మీరు చేసిన అప్పులు కట్టడానికి అప్పు తేవాల్సి వస్తుందని అన్నారు. ప్రజలు తెలివైన వాళ్ళు, అమాయకులు కాదని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కృష్ణా వాటర్ గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ కి లేదని మంత్రి ఆరోపించారు. 511 టీఎంసీ ఏ లెక్క ప్రకారం ఆంధ్రాకు ఇచ్చారు. ఆంధ్రాకు 511 టీఎంసీలు ఇచ్చి వాళ్లకు న్యాయబద్ధత కల్పించారని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే దానిపై పోరాటం చేస్తే కోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చిందని తెలిపారు. తెలంగాణలో ప్రభుత్వాన్ని ఆర్పుకోవడమే కాకుండా.. ఢిల్లీలో కూడా ఆర్పేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఆంధ్రావాళ్లు.. ఆంధ్రావాళ్లు అంటూనే కాంట్రాక్టలు వాళ్లకే ఇచ్చారని దుయ్యబట్టారు.

# కులగణన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

### బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరుగుతున్న బిసి కులగణనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ అన్నారు. మంగళవారం కాచిగూడలో మాజీ ఎంపి వి.హనుమంతరావుతో కలిసి కులగణనపై జరుగుతున్న సర్వేను పరిశీలించారు. అనంతరం బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను పూర్తి స్థాయి నిర్వహించి, క్షేత్ర స్థాయిలో వివరాలను పొందుపరచాలని అన్నారు. కుల గణన సర్వేకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, ఈ సర్వేలో పాల్గొని వారి కుటుంబ సభ్యుల పేర్లు రీసర్వేలో నమోదు చేసుకోవాలన్నారు.

పలు అంశాలపై ఎమ్యూనరెటర్లు, వార్డ్ అధికారులకు సర్వేకు సంబంధించిన దిశ నిర్దేశం చెయ్యాలని అధికారులకు సూచించారు. ఈ సర్వే ఈనెల 28 వరకు కొనసాగనుంది. మూడు విధాలుగా వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఎన్యూమరేటర్లను పిలిపించుకునే చాన్స్ ఇచ్చిందన్నారు.

04021111111 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు కాల్‌చేసి అడ్రస్ చెప్తే.. ఫోన్ చేసినోళ్ల ఇంటికి ఎన్యూమరేటర్లు వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు. అలాగే ఈసారి ఆన్ లైన్‌లో ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు ఇచ్చే ఆప్షన్‌కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సోనియా గాంధీ రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాలకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందే విధంగా కులగణన చేపడు తున్నారని పేర్కొ న్నారు.



కాచిగూడలో కులగణన సర్వేను పరిశీలించి మీడియాతో మాట్లాడుతున్న బిసి కమిషన్ ఛైర్మన్ నిరంజన్, చిత్రంలో మాజీ ఎంపి వి.హనుమంతరావు తదితరులు

ఇదే విధంగా మోడీ ప్రభుత్వం స్పందించి దేశవ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, పిసి సి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, సీనియర్ నేత పోలినేని రామ్మోహన్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# నన్ను అవమానించినందుకే హత్య చేశా

### తాతను చంపిన కేసులో ముగిసిన మనవడు కీర్తితేజ పోలీస్ కస్టడీ

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** నగరంలో సంచలనం రేకెత్తించిన వృద్ధుడు హత్య కేసులో ఆయన మనవడే ముద్దాయి అని పంజగుట్ట పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి నిందితుడిని కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని మరిన్ని విషయాలను రాబట్టి కస్టడీ ముగియడంతో మళ్లీ రిమాండ్‌కు తరలించారు. వివరాల ప్రకారం.. పంజగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల తాతను హత్య చేసిన మనవడు నిందితుడైన కీర్తితేజను పోలీసులు కస్టడీలోకి తీసుకుని మూడురోజులపాటు విచారించారు. మొదటిరోజు పోలీసుల ప్రశ్నలకు మౌనంగా ఉన్న కీర్తితేజ తర్వాత నోరు విప్పాడు. తనను అవమానించినందుకే తాతను చంపినట్లు పోలీసుల విచారణలో నిందితుడు కీర్తితేజ తెలిపాడు.

హత్యకు వాడిన బట్టలు, కత్తి తగల బెట్టేందుకు కీర్తి ప్రయత్నం దగ్గర నుంచి పూర్తి వివరాలను పోలీసులు సేకరించారు. కస్టడీలో కీర్తితేజ చెప్పిన విషయాలు ప్రకారం.. హత్యకు దారితీసిని పరిస్థితులను వివరించినట్లు సమా చారం. తనను యూ బెగ్గర్ అంటూ ప్రతిరోజూ తాత అవమానించేవాడు. ఏరోజూ నన్ను సొంత మనిషిగా చూడలేదు. కుటుంబసభ్యుడిగా కూడా చూడలేదు. అందరికంటే హీనంగా చూస్తూ దారుణంగా వ్యవహరించేవాడు. ప్రతీరోజూ నన్ను బెగ్గర్ అంటూ పిలిచేవాడు. ఆఫీసుకు వెళ్తే అక్కడ కూడా అవమానించేవాడు. తాత అలా తిట్టడం వల్ల ఆఫీస్ స్టాఫ్ కూడా చిన్నచూపు చూసే వారు. ఆస్తి పంపకాలు, పదవుల కేటాయింపుల్లోనూ తక్కువ చేశాడు. చివరకు డైరెక్టర్ పదవి కూడా రెండో కుమార్తె కొడుకుకు ఇచ్చాడు. అప్పటి నుంచి తనకు, తాతకు మధ్య గొడవలు పెరిగాయి. అందుకే తాతను చంపేయాలని నిర్ణయించుకున్నా.

ఇన్‌స్టామార్ట్ నుంచి కత్తి కొనుగోలు చేశా. హత్య జరిగిన రోజు నాకు, తాతకు మధ్య పెద్దఎత్తున గొడవ జరిగింది. ఆస్తిలో వాటా కావాలని అడిగితే ఇవ్వను అన్నాడు. కోపంతో కత్తితో కసితీరా పొడిచా. హత్య చేసిన తర్వాత బిఎస్‌మక్తా ఎల్లమ్మగూడ పక్కనే ఖాళీ స్థలంలో కత్తి, రక్తంతో ఉన్న నా బట్టలను తగులబెట్టాను అని వివరించినట్లు సమాచారం. మంటల్లో సగం కాలిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



ఆమనగల్లులో నిర్వహించిన రైతు నిరసన దీక్ష సభలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కెటిఆర్

# రైతులను మోసగిస్తున్న రేవంత్ సర్కారు

### బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను పూర్తిగా మోసం చేస్తున్నాడని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. యేడాదిన్నర కాలంలో రైతు ప్రయోజనాల కోసం ఎటువంటి కార్యక్రమాలు, పథకాలు ప్రవేశపెట్టలేదని, కేసీఆర్ అమలు చేసిన పథకాలను కూడా సక్రమంగా అమలు చేయలేపోతున్నారని ఆయన విమర్శించారు. ఆమనగల్లులో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రైతు నిరసన దీక్షలో మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సర్కారును దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి పాలన పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఏ ఒక్క వర్గ ప్రజలు కూడా సంతోషంగా ఉండటం లేదని విమర్శించారు. రైతులు, ఆటోరిక్షా కార్మికులు, విద్యార్థులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆవేదనకు లోనై బలిదానాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పెట్టుబడికి ఇవ్వవలసిన రైతుభరోసా డబ్బులు సకాలంలో సక్రమంగా అమలు చేయలేక పోతుండడం రేవత్‌రెడ్డి వైఫల్యానికి నిదర్శనమన్నారు. రైతుభరోసా డబ్బులు సక్రమంగా వేయకపోవడంతో రాష్ట్రంలో ప్రతిరైతుకు ఎకరానికి రూ. 17,500 రాష్ట్ర ప్రభుత్వం బాకీ పడిందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలతో వ్యవసాయరంగాన్ని స్వర్ణ యుగంగా మార్చి రైతును రాజుగా తీర్చిదిద్దారని కొనియాడారు. నాడు ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సహంతో ధాన్యం దిగుబడులలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ద్వితీయ స్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. కానీ నేడు రేవంత్‌రెడ్డి 90 శాతం పూర్తి అయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయడని విమర్శించారు. 14 నెలల కాలంలో 35సార్లు ఢిల్లీకి తిరిగిన రేవంత్‌రెడ్డి గల్లీని కూడా అభివృద్ధి చేయలేకపోయా రన్నారు. ఢిల్లీ ప్రయాణాలతో ప్రజాధనం దుర్వినియోగం తప్ప రేవంత్‌రెడ్డి సాధించిందేమి లేదని ఆరోపించారు. స్వప్రయోజనాల కోసమే రేవంత్‌రెడ్డి ఫోర్తుసిటీ తెరపైకి తీసుకువచ్చారని, సీఎం కుటుంబసభ్యులు రియల్‌ఎస్టేట్ దందాతో రైతుల నుండి భూములు లాక్కుంటున్నారన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, అన్నదాతలు, ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు రానున్న స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు తదితరులు ఉన్నారు.



మంగళవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికను అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, వేములవాడ దేవస్థానం అర్చకులు

## వేములవాడ మహాశివరాత్రి ఉత్సవాలకు రండి

### ముఖ్యమంత్రి రేవంత్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని సిఎం రేవంత్‌రెడ్డిని వేములవాడ దేవస్థానం అర్చకులు, అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు వారు మంగళవారం జూబ్లీహిల్స్‌లో నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆయనకు మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను అందచేశారు. సీఎంను కలిసిన వారిలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్, శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు, ఆలయ అధికారులు ఉన్నారు. తెలంగాణలోనే అతి పెద్ద పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజేరాజేశ్వరిస్వామి వారికి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు ఈ నెల 25 నుంచి 27 వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను అధికారులు చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతకు బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతకు బిజెపి బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ శాసనసభ పక్ష కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ కులం గురించి బరితెగించి మాట్లాడుతున్నారని విమర్శించారు. దమ్ము, ధైర్యం ఉంటే కేంద్ర మంత్రులు గా కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రానికి నిధులు తీసుకురావాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ని తిట్టడమే కేంద్ర మంత్రుల పనిగా మారిందని ఆవేదన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్నాడని మా ప్రభుత్వానికి రాజ్యాంగబద్ధంగా కావాల్సిన సీట్లు ఉన్నాయని కూలదని ధీమా వ్యక్తంచేశారు. ఐదేళ్ల పాటు ఇందిరమ్మ రాజ్యం ఉంటుందని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలవబోతున్నారని జోస్యంచెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ చరిత్రను వక్రీకరించేలా మాట్లాడుతున్నారని అన్నారు. ఫిరోజ్ జహంగీర్ ఘాండీ(గాంధీ) 1912 సెప్టెంబరు12 అప్పటి బాంబే ప్రెసిడెన్సీలో జొరాష్ట్రియన్ మతానికి (రతన్ టాటా కుటుంబం పాటించే మతం) చెందిన పార్సీ కుటుంబంలో జన్మించాడని తెలిపారు. తండ్రి 'ఫరీదుయన్ జహంగీర్ ఘాండీ' తల్లి 'రతిమయి కమిషరట్ ఘాండీ' జొరాష్ట్రియన్ మతస్తులు పూర్వపు పర్షియా (ఇరాన్) నుంచి భారత దేశానికి వలస వచ్చారు. భారతదేశంలో జైన, బౌద్ధ క్రైస్తవ పేర్లు హిందువుల పేర్లకు ఎలా దగ్గరగా ఉంటాయో అలాగే పార్సీ ల పేర్లు కూడా ముస్లిం పేర్లకు దగ్గరగా ఉంటాయని అన్నారు. ఫిరోజ్ జహంగీర్ ఘాండీ ని మహాత్మ గాంధీ దత్తత తీసుకోలేదు. భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ అనుచరుడిగా ఆయన మీద అభిమానంతో ఫిరోజ్ ఘండి ఫిరోజ్ గాంధీ అని పేరు మార్చుకున్నాడని చరిత్రను వివరించారు. 1942 మార్చి 26 ఫిరోజ్ గాంధీ ఇందిరా ప్రియదర్శిని ల వివాహం హిందూ సాంప్రదాయం ప్రకారం జరిగిందని గతం నెమరేసుకొన్నారు. అప్పటినుండి ఇందిరా గాంధీ బ్రాహ్మణుడైన నెహ్రూ వారసత్వాన్ని కొనసాగిస్తూ వస్తున్నారని ఆయన తెలిపారు.. వారి పేరు చివరన గాంధీని జోడించుకొని బ్రాహ్మణులు గానే ఉన్నారు. 1960 సెప్టెంబర్ 8 న ఫిరోజ్ గాంధీ గారి అంత్యక్రియలు పార్సీ సాంప్రదాయం ప్రకారం అలహాబాద్ లో జరిగాయని అన్నారు.

## పర్యాటక శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### మంత్రి జూపల్లికి సంఘం నాయకుల వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** పర్యాటక శాఖలో ఉద్యోగులు సమస్యలు పరిష్కరిచాలని తెలంగాణ పర్యాటక శాఖ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యో గుల సంఘం నాయకులు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు మంగళవారం ఉద్యోగులు సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జీతాల పెంపు తదితర సమస్యల గురించి మంత్రితో చర్చించామని, ఇందుకు ఆయన సానులకూంగా స్పందించినట్లు తెలిపారు. జీత భత్యాల పెంపునకు తన వంతు కృషి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.



## మెదడు, కాలేయం ట్యూమర్ శస్త్ర చికిత్సల ప్రత్యేక విభాగం ప్రారంభించిన బాలకృష్ణ

**హైదరాబాద్ (పంజగుట్ట), ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్స్ 25 యేళ్లు పూర్తిచేసుకొని రజతోత్సవాలు జరుపుకొంటున్న సమయంలో కేన్సర్ రోగులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వీలుగా అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొని రావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే 4వ జనరేషన్ డావిన్సి రొబోటిక్ శస్త్రచికిత్స వ్యవస్థతోపాటు పిల్లల కోసం కొత్తవార్డు, పీడియాట్రిక్ ఐసియును కూడా ఇటీవల ఏర్పాటు చేసింది. దీనికి కొనసా గింపుగా మంగళవారం మెదడు, కాలేయంలో ఏర్పడే ట్యూమర్లకు సంబంధించిన అత్యాధునిక శస్త్రచికిత్స పరికరం ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్‌ను అందు బాటులోకి తీసుకొచ్చింది. రూ. 90 లక్షల ఖరీదుతో కూడిన ఈ అత్యాధునిక వ్యవస్థను సంస్కృతి శిఖర్ ట్రస్టు వారు పూర్తిస్థాయిలో అందించిన ఆర్థిక సహా యంతో హాస్పిటల్ ఏర్పాటు చేసింది. ఈ అత్యాధునిక సర్జికల్ వ్యవస్థ అయిన ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్‌ను మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా సంస్కృతి శిఖర్ ట్రస్టు ప్రతినిధులైన తోరల్ దేశాయి, మేనేజింగ్ ట్రస్టీ - జిన్నీ, ఛైర్‌పర్సన్ - నిషా షా, కోశాధికారి సమక్షంలో ప్రారంభించారు. బాలకృష్ణ మాట్లాడుతూ స్థాపించిన నాటి నుండి రోగులకు అవసరమైన అత్యాధునిక వైద్యసదుపాయాలు అందిం చడంలో ముందంజలో ఉందని వివరిస్తూ ఎంతో సున్నిత భాగాలకు సంబం ధించిన గడ్డలను తొలగించడానికి ఎంతగానో ఉపయోగపడే ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్‌ను రోగుల కోసం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీని కారణంగా కాలేయం, మెదడుకు సంబంధించిన ట్యూమర్లను మరింత కచ్చితత్వంతో శస్త్ర చికిత్స ద్వారా తొలగించడానికి వీలువుతుందని చెప్పారు.



సైబర్ నేరాల నివారణపై షీల్డ్ 2025 సదస్సులో

## రోబోతో ముఖ్యమంత్రి రేవంత్ ముచ్చట్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** సైబర్ నేరాల నివారణకు సంబంధించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్ఐసిసిలో మంగళవారం ఏర్పాటు చేసిన షీల్డ్ 2025 సదస్సులో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఈ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా, డిజిపి జితేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు జరిగిన ప్రాంగణానికి కొద్దిదూరంలో ఏర్పాటు చేసిన రోబోతో సిఎం రేవంత్‌రెడ్డి ముచ్చటించారు. సిఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రి శ్రీధర్‌బాబుకు రోబో షేక్‌హాండ్ ఇవ్వడం, వారిని పలకరించడం అందరు ఆసక్తిగా గమనించారు. కాగా రోబో వివరాలను, పనితీరును అధికారులు సిఎం రేవంత్‌రెడ్డికి వివరించారు.

## కెసిఆర్ పుట్టినరోజు వేడుకలు చేస్తే హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేస్తారా?:కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 18:** 14 ఏండ్లు అహింసాయుత పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, అస్థిత్వాన్ని చాటిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పుట్టినరోజున విద్యార్థులకు మిఠాయిలు పంచితే తప్పా..? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కెసిఆర్ పుట్టిన రోజు వేడుకలు చేస్తే సరూర్ నగర్ పాఠశాల హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేస్తారా..? అని నిలదీశారు. ఆయన పుట్టిన రోజున హైదరాబాద్‌లో ఫ్లెక్సీలు కడితే చించేస్తారా..? అని మండిపడ్డారు. సిఎం రేవంత్‌రెడ్డికి ఐఎఎస్, ఐపిఎస్‌లు అంటే గౌరవం లేదు..సహచర మంత్రుల మీద నమ్మకం లేదని ఆరోపించారు. సిగ్గు సిగ్గు..అత్యున్నత పదవిలో ఉండి ఇంత అభద్రతా భావమా..? అని సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు పండ్లు, సీట్లు పంచారని స్కూల్ ప్రిన్సిపాల్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సరూర్‌నగర్ నందనవనం ఎంపీపీ స్కూల్‌లో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు పండ్లు, సీట్లు పంచారని ప్రిన్సిపాల్ రజితను రంగారెడ్డి డీఈవో సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## హైదరాబాద్‌లో గ్రేప్ ఫెస్టివల్

### నేటి నుండి సందర్శకులకు అనుమతి

### లాంఛనంగా ప్రారంభించిన ఉద్యాన యూనివర్సిటీ విసి రాజిరెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ద్రాక్ష పరిశోధన కేంద్ర క్షేత్రంలో గ్రేప్ ఫెస్టివల్ లాంఛనంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ ద్రాక్ష పండుగకు రేపటి నుంచి సందర్శకులను అనుమతించనున్నారు. అంతరించిపోతున్న ద్రాక్ష పంటకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు వినియోగదారులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఏటా తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం గ్రేప్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. ఈ ద్రాక్ష మేళాను మంగళవారం ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ విపణిలో ద్రాక్ష పండ్లకు విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో యూరప్, కెనడా, గల్ఫ్, రష్యా, నెదర్లాండ్స్ వంటి దేశాలకు ఎగుమతులు చేయడానికి అవకాశాలున్నాయన్నారు. ఈ కారణంగా రాష్ట్రంలో పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ప్యాకింగ్ హౌసులు, ప్రాసెసింగ్ యూనిట్లు, శీతల గిడ్డంగుల స్థాపన సహా ఇతర రూపాల్లో పెద్ద ఎత్తున రాయితీలు ఇవ్వాలని పలువురు రైతుల నుండి విజ్ఞప్తులు వస్తున్నాయని వివరించారు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఈ పంటకు తెలంగాణ పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందిందన్నారు. నగరీకరణ, స్థిరాస్థి వ్యాపారం, అభివృద్ధి నేపథ్యంలో హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ద్రాక్ష సాగు అంతరించిపోతున్న వేళ మళ్లీ ఆ పంటకు పూర్వవైభవం తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేక అధిక శాతం రైతులు ద్రాక్ష పంట సాగు వదిలేయడంతో సాగు విస్తీర్ణం క్రమంగా పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అందుకే ద్రాక్ష పంట సాగు పట్ల రైతుల్లో సంపూర్ణ అవగాహన కల్పించేందుకు గ్రేప్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



## శివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులు: మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 18:** మహా శివరాత్రి సందర్భంగా భక్తులు అధికంగా వెళ్ళే వేములవాడ, శ్రీశైలం, ఏడుపాయల, కీసర, పాలకుర్తి దేవాలయాలకు వెళ్ళే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఈ మేరకు అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు.గత సంవత్సరం కంటే భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అదనపు బస్సులు నడిపేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.బస్ స్టాండ్‌ల వద్ద అధిక రద్దీ ఉన్నప్పుడు ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## స్మార్ట్‌ప్లాన్ ప్రవేశపెట్టిన ఎల్ఐసి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** ఎల్ఐసి ఆఫ్ ఇండియా స్మార్ట్ ప్లాన్‌ను మంగళవారం ప్రారంభించింది.మంగళవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో దీన్ని ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎం నాగరాజు ప్రారంభించారు.ఈ పథకం వివరాలను ఎల్ఐసి సీఈవో, సీఎండి సిద్దార్థ వివరించారు.ఈ పథకం ద్వారా పెన్షన్ ప్లాన్,నాన్ లింక్డ్,గ్రూప్ సేవింగ్స్ తదితర ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు.ఈ పథంలో జాయిన్ కావాలనుకునేవారికి 18 సంవత్సరాలు ఉండాలని 65 నుంచి 100 వరకు ఇందుకు సంబంధించిన ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. పాలసీ నిబంధనల మేరకు ప్రస్తుత పాలసీ దారు మరణించినా దానికి సంబంధించిన ప్రయోజాలను నామినీకి చేరుతాయన్నారు. పాలసీ కోనుగోలు ధర రూ.1 లక్ష నుంచి పా్రరంభం అవుతుందని ఈ మొత్తాన్ని వార్షిక,అర్థ సంవత్సర, త్రైమాసిక, లేదా నెలవారీ కూడా చెల్లించుకోవచ్చని తెలిపారు. ఎంపిక చేసుకున్న ప్లాన్ ప్రకారమే చెల్లింపులు ఉంటాయన్నారు.

# ఉద్యాన పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్

### వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఉద్యాన పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కోతులు మరియు ఇతర అడవి జంతువుల వల్ల ఇబ్బంది ఉన్న అన్ని జిల్లాలలో ఉద్యాన పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేసే దిశగా ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఇందుకు గాను సోలార్ పెన్సింగ్ స్కీం అమలవుతున్న హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో పర్యటించి, సబ్సిడీ తదితర వాటికి సంబంధించి విధివిధానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీనివల్ల కూరగాయలు మరియు ఉద్యాన పంటల సాగు చేయడానికి రైతులు ముందుకు రావడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అలాగే హైదరాబాద్ నగరానికి 100 కిలోమీటర్ల పరిధిలోపు ఉన్న అన్ని ప్రాంతాలలో కూరగాయాల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటుచేసి, రైతులకు ప్రోత్సహకాలు కూడా అందించాల్సి ఉందని తెలిపారు. కూరగాయల సాగు కోసం అవసరం మేరకు యంత్ర పరికరాలు సబ్సిడిపై అందించి, సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. రాబోయే రెండు, మూడు సంవత్సరాలలో కూరగాయల పంటలను పెద్ద ఎత్తున ఉత్పత్తిచేసి, కూరగాయలను దిగుమతి చేసుకొనే స్థితి నుండి ఎగుమతి చేసే స్థితికి తీసుకురావాలని మంత్రిగారు తెలియజేశారు.

వచ్చే ఆర్థిక సంవత్సరం సంబంధించి కూడా ముందస్తుగా డ్రిప్ మరియు స్ప్రింక్లర్ల పంపిణీ కోసం ధరఖాస్తులను స్వీకరించి, గ్రౌండింగ్ మొదలు పెట్టాల్సిందిగా స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో సాగు చేస్తు లాభాలు పొందుతున్న మెకడమియా పంటను రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి గల వాతావరణ స్థితిగతులు, నేలలు, నర్సరీలు, మార్కెటింగ్ అవకాశాలను అధ్యయనం చేయాలని సూచించారు. మార్చి నెలాఖరు కల్లా ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, తక్కువ పురోగతి ఉన్న కంపెనీలకు నోటీసులు జారీ చేసి, ఏప జిల్లాలలో తక్కువ పురోగతి ఉందో వాటికి అనుమతులు రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయిల్ పామ్ సాగు కోసం రెండు లక్షల ఎకరాలను లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని ఆదేశించారు. ఆయిల్ ఫెడ్ సిబ్బందికి కూడా లక్ష్యాలు నిర్ధేశించి వాటిని చేరుకొనే విధంగా పనిచేసేటట్లు చూడాలని ఆదేశించారు. వచ్చే సంవత్సరం చివరికల్లా ఉమ్మడి జిల్లాలలో కనీసం ఒక పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగేలా చూడాలని, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కనీసం సంబంధింత జిల్లాలలో 6 వేల ఎకరాలకు పైన ప్లాంటేషన్ ఉండేట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్ ఫెడ్ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.



## తాగు నీటి కోసం రూ.16 వేల కోట్లివ్వండి

### కేంద్ర జలశక్తి సదస్సులో మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** తెలంగాణ తాగునీటి స్థిరీకరణ కోసం నిధులు మంజూరు చేయండికనీసం రూ.16 వేల కోట్ల నిధులివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.ఇంటింటికి సురక్షిత మంచినీటి సరఫరా కోసం వేల కోట్లు వెచ్చిస్తున్నామని,కేంద్రం తన భాధ్యతను నెరవేర్చాలని కోరారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆద్వర్యంలో రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్ లో రెండు రోజుల పాటు జరుగుతున్న అన్ని రాష్ట్రాల తాగు, సాగునీటి పారుదల శాఖ మంత్రుల రెండో సదస్సులో మంత్రి సీతక్క మంగళవారం నాడు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణ తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీతి ఆయోగ్ గతంలో సిఫార్సు చేసిన విధంగా కనీసం రూ.16 వేల కోట్లను మంజూరు చేయాలని కోరారు. ప్రతి ఏటా తాగు నీటి అవసరాల కోసం తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ. 5 వేల కోట్లను వెచ్చిస్తుందని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ నేషనల్ డ్రింకింగ్ వాటర్ మిషన్, నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రోగ్రాం వంటి కార్యక్రమాలు సురక్షితమైన మంచినీటిని అందించడానికి కృషి చేస్తాయన్నారు.ప్రతి వ్యక్తికి సురక్షిత మంచి నీరు అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రాంతంలో గ్రామీణ నీటి సరఫరా( ఆర్‌డబ్ల్యూఎస్) వ్యవస్థను వేల కోట్ల ఖర్చుతో అప్పటి ప్రభుత్వాలు బలోపేతం చేశాయని గుర్తు చేశారు. ఇందులో బాగంగా 1,59,312 చేతి పంపులను, 14,054 సింగిల్ విలేజ్ స్కీమ్‌లు, 149 మల్టీ విలేజ్ స్కీమ్‌లు, వేలాది పైప్డ్ వాటర్ సప్లై స్కీంలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, లక్షలాది నల్లా కనెక్షన్లతో ప్రజల తాగు నీటి అవసరాలు తీర్చాయన్నారు. భారీ వర్షాల కారణంగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు తీవ్రంగా దెబ్బతిన్నా...తాత్కాలిక ప్రాతిపదికన స్థానిక వనరుల నుండి తాగు నీటిని అందించడంలో తమ ప్రభుత్వం విజయం సాధించిన్నారు. మిషన్ భగీరథ ను సమర్ధవంతంగా అమలు చేసేందుకు ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెట్టినట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ఎటిఎం సైజులో కొత్త రేషన్‌కార్డులు!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 18:** రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులపై వేగం పెంచింది. అందులో భాగంగా కొత్త రేషన్ కార్డులు ఎలా ఉండాలి, డిజైన్లు, రేషన్ కార్డులపై ఫ్యామిలీ ఫొటోలు ఉండాలా? వద్దా అనే వాటిపై సిఎం రేవంత్ రెడ్డితో అధికారులు చర్చిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ కుటుంబసభ్యుల ఫొటోలు లేకపోయినా కుటుంబ సభ్యుల పేర్లు మొత్తం ఇందులో ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. కార్డు వెనుకవైపు అడ్రస్, రేషన్ షాపు నెంబర్, ఇతర వివరాలు కూడా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తమిళనాడు, కేరళ లాంటి తదితర రాష్ట్రాల్లో రేషన్ కార్డు తరహాలో ప్రభుత్వం ఇక్కడ రేషన్‌కార్డు తీసుకురాబోతున్నట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే పాత కార్డుల్లా కాకుండా స్మార్ట్ కార్డు రూపంలో ఏటిఎం కార్డు సైజులో అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టుగా తెలిసింది. ఈ మేరకు కార్డుల డిజైన్‌ను అధికారులు రెడీ చేస్తున్నారు. ఒకవైపు సిఎం ఫొటో, మరోవైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఫొటో, మధ్యలో ప్రభుత్వ లోగో ఉంటుందని అధికారికవర్గాల సమాచారం. ఇప్పటికే పలు రేషన్ కార్డు డిజైన్లను అధికారులు సిఎంకు చూపించారు. అయితే, ముందుగా లక్ష కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వీటి కోసం షార్ట్ టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజాపాలన, గ్రామసభలు, మీసేవ, కులగణనలో దరఖాస్తులు చేసుకున్న అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది.



బ్రిటన్ మాజీప్రధాని రిషిసునాక్ న్యూఢిల్లీలో సోమవారం ప్రధాని నరేంద్రమోడీని కలిసిన దృశ్యం. సునాక్ సతీమణి అక్షతామూర్తి, ఇద్దరు కుమార్తెలు, రాజ్యసభ ఎంపి సుధామూర్తి కూడా చిత్రంలో ఉన్నారు.

## కన్నుల పండుగగా చంద్రపట్నం

### ఘనంగా స్వామివారి కళ్యాణం

### మూడోరోజు పెద్దగట్టుకు పోటెత్తిన భక్తులు

**ప్రభాతవార్త, నడిగూడెం (సూర్యాపేట):** శ్రీలింగ మంతుల స్వామి జాతరకు మూడవ రోజైన మంగళవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి చంద్ర పట్నం కార్యక్రమంలో పాల్గొని కన్నుల విందుగా తిలకించారు. మరో రెండు రోజులు మాత్రమే జాతర జరిగే అవకాశం ఉండడంతో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. మంగళవారం స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా చంద్ర పట్నం కార్యక్రమం నిర్వహించారు. మెంత బోయిన వారు తీసుకువచ్చిన పూజా సామాగ్రి తెల్ల పిండి పచ్చ పిండి పసుపు కుంకుమలతో చంద్రపట్నం వేశారు. చెక్కపై పసుపు కుంకుమలు వేసి ఆకర్షణీయంగా అలంకరించారు. ఆ తర్వాత యాదవ వంశీయులు స్వామివారి కళ్యాణాన్ని ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో చంద్ర పట్నం స్వామివారి కళ్యాణం ముగిసింది. రాజులు పూజారులు బైకాన్లు కథలు చెప్పారు. పంచ వర్ణాలతో వేసిన చంద్ర పట్నంపై దక్షిణ దిక్కున లింగమంతుల స్వామి వారిని ఉత్తరం దిక్కున మాణిక్యమ్మ దేవిని కూర్చోబెట్టి కళ్యాణము నిర్వహించారు. యాదవ పూజారులు శ్రీ లింగమంతుల స్వామి కళ్యాణ కథను శ్రీకృష్ణుడు చరిత్రపై పాటలు పాడుతూ ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని



నిర్వహించగా భక్తులు కన్నుల విందుగా తిలకించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ పోలెబోయిన నరసయ్య యాదవ్ మాట్లాడుతూ చంద్రుడు ఆకాశంలో నిండుగా ప్రకాశించే పౌర్ణమి అంటే శ్రీ లింగమంతుల స్వామికి ఇష్టమైన రోజు కావడంతో ప్రతి పౌర్ణమికి భక్తులు ఇక్కడికి వచ్చి స్నానం చేసి తడి బట్టలతో దర్శనం చేసుకుని నిద్రిస్తే కోరిన కోరికలు తీరుస్తాడని భక్తుల నమ్మకం. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజు నుండి ఐదు రోజులపాటు జరిగే జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి కుల మతాలకతీతంగా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ అని నరసయ్య యాదవ్ అన్నారు. కోరిన కోరికలు తీర్చే లింగమంతుల స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. మూడు రోజులుగా లక్షలాది మంది దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేశాల మేరకు గుట్ట చుట్టూ పరిసర ప్రాంతాల్లో నిరంతరం పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. తాగునీటి వసతి చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యం నిమిత్తం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. జాతీయ రహదారి 65 పై వాహనాల మళ్లింపు కొనసాగుతుంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన సౌకర్యాలు కల్పించారు. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరైనా తప్పిపోయిన వెంటనే గుర్తించి వారికి అప్పగిస్తున్నారు. పోలీస్ యంత్రాంగం అధికార యంత్రాంగము అప్రమత్తతో ఉండి జాతరలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సీసీ కెమెరాలు పర్యవేక్షణలో పరిస్థితు లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఎస్పీ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లింగమంతుల స్వామి జాతరను సందర్శించారు. చంద్ర పట్నం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతర పెద్దగట్టు అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆమె అన్నారు. సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు జాతరను సందర్శించి స్వామివారి కల్యాణంలో పాల్గొని కన్నుల విందుగా తిలకించి భగవంతుడు కృపకు పాత్రులయ్యారు.

## తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ సలహా కమిటీ ఏర్పాటు

### డిప్యూటీ సిఎం భట్టి అధ్యక్షతన ప్రాథమిక సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 18:** తెలంగాణ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ (టిజిడిపిఎస్) సలహా కమిటీని ఏర్పాటు చేశారు. ఈనెల 14న సలహా కమిటీకి సంబంధించిన జీవో విడుదల అయింది. ఈ నేపథ్యంలో మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో కమిటీ సభ్యులతో ప్రాథమిక సమావేశం జరిగింది.రాష్ట్రంలో విపత్తు నివారణకు ప్రణాళికలు, వాతావరణ మార్పుల ప్రభావం విశ్లేషణ, రాష్ట్ర ఆర్థిక, సామాజిక రంగాల్లో అంతరాలు, అభివృద్ధి విశ్లేషణ, పైలెట్ ప్రాజెక్టులు, పరిశోధనలు నిర్వహించడం ఈ సలహా కమిటీ ప్రధాన ఉద్దేశం. ఈ కమిటీ విశ్లేషణలు రాష్ట్రంలో స్వల్ప కాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలకు మద్దతుగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తుంది. 1.డిప్యూటీ సీఎం ప్రణాళిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సలహా కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు.2. ప్రొఫెసర్ కంచ ఐలయ్య (సభ్యుడు) 3. ప్రొఫెసర్ శాంతా సిన్హా (సభ్యురాలు)4. ప్రొఫెసర్ హిమాంశు (సభ్యుడు) 5. డాక్టర్ సుఖదేవ్ తొరాట్ (సభ్యుడు) 6. నిఖిల్ దేవ్ (సభ్యుడు)7.ప్రవీణ్ చక్రవర్తి (సభ్యుడు) 8. ప్రొఫెసర్ భూక్య(సభ్యుడు) 9. ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి(సభ్యుడు) సమావేశంలో కమిటీ సభ్యులతో పాటు ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తనియా, తెలంగాణ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ సీఈవో షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## దుర్గం చెరువు పరిరక్షణకు చర్యలు

### పురపాలక శాఖ ఆదేశాలతో వివిధ శాఖల అధికారుల తనిఖీలు

### రహేజా మైండ్‌స్పేస్‌లో భవననిర్మాణ, గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్‌కు ఎస్‌టిపిలో శుద్ధిచేసిన నీరు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** దుర్గం చెరువు పరిరక్షణకు ప్రభుత్వం సిద్ధమైంది. చెరువులో మురుగు నీరు చేరి అది కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టనుంది. అందులో భాగంగానే పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ ఆదేశాల మేరకు చెరువు పరిసరాలను జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఈడి మయాంక్ మిట్టల్, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, లేక్స్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, ఇతర విభాగాల అధికారులు పరిశీలించారు. చెరువులో మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టడానికి జాయింట్ ఇన్ స్పెక్షన్ నిర్వహించారు. రహేజా మైండ్ స్పేస్ ప్రాంతాల్లో భవన నిర్మాణ, గార్డె నింగ్, ల్యాండ్ స్కేపింగ్ అవసరాల కోసం ఎస్‌టిపిలో శుద్ధి చేసిన నీటినే వాడుకోవాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డి ఆదేశించారు.

**తీసుకునే చర్యలివే..**

మాదాపూర్, సైలెంట్ వాలీ ప్రాంతాలు, క్యాచ్ మెంట్ ఏరియాలో ఉత్పన్నమవుతున్న మురుగునీటిని జలమండలి దుర్గం చెరువులో నిర్మించిన రెండు ఎస్‌టిపిల (5,7 ఎంఎల్‌డిలు) ద్వారా శుద్ధి చేస్తున్నారు. దుర్గం చెరువు భూగర్భ నీటి మట్టం పెరిగేందుకు, చెరువు హైడ్రాలజీ కాపాడేందుకు ఎస్‌టిపిల్లో శుద్ధి చేసిన నీటిని చెరువులోకి వదిలి పెడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి అధికంగా వచ్చే మురుగు నీరు చెరువులో కలవకుండా 1000 ఎంఎం డయా పైపులైన్ ను మాదాపూర్ పెట్రోల్ బంక్ నుంచి మాదాపూర్ ఐ అండ్ డి వరకు నిర్మించేందుకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి. టెండర్ ఖరారయ్యాక వచ్చే 3 నెలల్లో పైపులైన్ నిర్మాణ పనుల్ని పూర్తి చేయనున్నారు. దీని వల్ల లేక్ పార్కులో జరుగుతున్న సీవరేజ్ ఓవర్ ఫ్లో కూడా తగ్గనుంది. వర్షాకాలంలో వచ్చే వరద నీరు చెరువులో కలవకుండా వాటర్ డ్రెయిన్ సైతం నిర్మించనున్నారు. జిహెచ్ఎంసి ఈ నిర్మాణ పనుల్ని చేపట్టి, 3 నెలల్లో పూర్తి చేయనుంది. దుర్గం చెరువు చుట్టు పక్కల నివాసాల నుంచి వచ్చే సిల్ట్ డైవర్షన్ మెయిన్‌లో కలకుండా సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోవాలని వారికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు.

## వర్సిటీలకు రూ.5వేల కోట్లు కేటాయించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 18:** యూనివర్సిటీలకు రు.5వేల కోట్లు, ప్రత్యేకంగా ఉస్మానియా యూనివర్సిటీకి రు.1000కోట్లు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం లేఖ రాశారు.


ఫారం నెం.ఎన్‌సిఎల్‌టి 3 A
పిటిషన్ వివరణాత్మక ప్రకటన
(రూల్ 35 చూడండి)
కంపెనీ పిటిషన్ నెం.2 ఆఫ్ 2025
పిటిషన్ ప్రకటన

కంపెనీల చట్టం, 2013 లోని సెక్షన్ 61(1) (బి) కింద వాటా మూలధన ఏకీకరణ కోసం మెస్సర్స్ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పిటిషన్‌ను జనవరి 24, 2025న సమర్పించింది మరియు ఆ పిటిషన్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ యొక్క హైదరాబాద్ (కోర్ట్-2) బెంచ్ సమక్షంలో 19.03.2025న విచారణకు నిర్ణయించారు. సదరు పిటిషన్‌కు మద్దతు ఇవ్వాలనుకునే లేదా వ్యతిరేకించాలనుకునే ఎవరైనా పిటిషనర్ అడ్వకేట్‌కు అతని పేరు మరియు చిరునామాతో సంతకంచేసిన తన ఉద్దేశ్య నోటీసును పంపాలి, తద్వారా పిటిషన్ విచారణకు నిర్ణయించిన తేదీకి రెండు రోజుల ముందు పిటిషనర్ అడ్వకేట్‌ని చేరుకోవచ్చు. అతను పిటిషన్‌ను వ్యతిరేకించాలనుకునే చోట, వ్యతిరేకతగల కారణాలు లేదా అతని అఫిడవిట్ కాపీని సదరు నోటీసుతో అందించాలి. పిటిషన్ /దరఖాస్తు /రిఫరెన్స్ కాపీని దిగువ సంతకందారుని అందుకు నిర్దేశించిన ఛార్జీలు చెల్లించిన తర్వాత దానిని కోరుతున్న ఏ వ్యక్తికైనా అందజేస్తారు.

తేదీ: 19.02.2025.
సం/-
జి. కళ్యాణ్ చక్రవర్తి
(పిటిషనర్ తరపు న్యాయవాది)
ఫ్లాట్ నెం.301, 3వ అంతస్తు, లేక్ మెలోడీ అపార్ట్‌మెంట్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ
హైదరాబాద్, తెలంగాణ-500 082.


## సమతాకుంభ్‌లో ఆకర్షణగా నిలిచిన రథోత్సవం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త:** సమతాకుంభ్ 2025 బ్రహ్మోత్సవాల తొమ్మిదో రోజునై మంగళవారం ఉదయం రథోత్సవ ఘట్టం ఘనంగా నిర్వహించారు. యాగశాలలో వేదికపైన 18 దివ్యదేశ పెరుమాళ్లకు తిరుమంజన సేవ అనంతరం ఈ రథోత్సవం మొదలైంది. సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలోని రథానికి ప్రత్యేకత ఉంది. శ్రీరంగంలో ఉండే ప్రణవాకార విమానంలా.. ఈ రథానికి కూడా ప్రణవాకార విమాన గోపురం ఉండటం విశేషం! చుట్టూరా దేవతామూర్తులు, ఆళ్వార్లు, ఆచార్యులు, చతుర్ముఖ బ్రహ్మ, అనేక శిల్పకళా సౌందర్యానికి కాణాచిలా ఉండటం..ఈ రథం ప్రత్యేక! భగవంతుడు రథాన్ని వాహనంగా చేసుకుని వేంచేస్తాడు. రథంలో వేంచేసిన ఆ సాకేత రాముడ్ని దర్శిస్తే మనం పవిత్రుల మవుతామనీ.. కర్మబంధముల నుండి విముక్తులమవుతామని శాస్త్రాలు చెబుతున్నాయి. ముందుగా రథంలో శ్రీ సాకేత రామచంద్ర ప్రభువు వేంచేసారు. తర్వాత 108 దివ్యవేదశ శ్రీమూర్తులలో నుంచి మొదటి దివ్యదేశ పెరుమాళ్లయిన శ్రీరంగ నాథుడు, అంతిమ దివ్యదేశ పెరు మాళ్లయిన శ్రీ వైకుంఠనాథుడు వేం చేస్తారు. శ్రీ సుదర్శన భగవానుడు కూడా రథంలోకి వేం చేస్తారు. గరుడ భగవానుడు, బ్రహ్మతోపాటు విశ్వకర్మ ముందు ఉండటం విశేషం. భగవంతుడు రథంలోకి ప్రవేశించగానే దేవతలకు సాత్విక బలిహరణ జరిగింది. ఆ తర్వాత గోవింద నామాలతో సంకీర్తనలతో భాజా భజంత్రీలతో కోలాట నృత్యాలతో భక్తులు వెంటరాగా శ్రీస్వామివారు రథయాత్రను ప్రారంభించారు. అనంతరం సమతా ప్రాంగణం ప్రవేశవాటికకు పక్కనున్న ద్వారం గుండా..విరజా పుష్కరిణికి రథ యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా పెరు మాళ్లకు మంగళహారతులు, స్నానాలు చేయిం చారు. అనంతరం పెరుమాళ్లతో చిన్న జీయర్ స్వామి వారు కోనేరులోకి దిగి స్నానమా చరించారు. ఈ కార్యక్రమంలో అశేష భక్త జనంతోపాటు మైహోమ్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'హరి హర వీరమల్లు'లో ఆకట్టుకుంటున్న నిధి అగర్వాల్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న "హరి హర వీరమల్లు" చిత్రంతో హీరోయిన్‌గా నటిస్తోంది నిధి అగర్వాల్. ఆమె ఫస్ట్ టైమ్ పవర్ స్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకుంటోంది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ కొల్లగొట్టినాదిరో ఈ సాంగ్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో నిధి అగర్వాల్ బ్యూటిఫుల్ మేకోవర్ తో ఆకట్టుకుంటోంది. పాటలో లిరిక్స్ లాగే ఆడియెన్స్ మనసు కొల్లగొట్టేలా నిధి కనిపిస్తోంది. కొల్లగొట్టి నాదిరో పాట రిలీజ్ అనౌన్స్ మెంట్ పోస్టర్ స్టిల్...నిధి అగర్వాల్ హరి హర వీరమల్లుకు వర్క్ చేసిన ఫస్ట్‌డే షూటింగ్ నుంచి తీసినది కావడం విశేషం. పవర్ స్టార్ తో వర్క్ చేయడం తన కెరీర్‌లో మర్చిపోలేని ఎక్స్‌పీరియన్స్ అని, ఈ సినిమాతో తాను పాన్ ఇండియా స్థాయి లో ప్రేక్షకులకు మరింతగా చేరువవుతానని నమ్మకంతో ఉంది నిధి అగర్వాల్.



మార్చి 28న రిలీజ్ అనౌన్స్‌మెంట్ చేశారు. ఈ నెల 24న ఈ పాట రిలీజ్ చేయబోతున్నారు. హరి హర వీరమల్లు గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

# 'తకిట తధిమి తందాన' టీజర్ రిలీజ్

రెండు తెలుగు రాష్ట్రాలు, ఓవర్సీస్‌లో ఈ నెల 27న బ్రహ్మాండమైన విడుదల. తెలంగాణా రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ చేతుల మీదుగా "ఫస్ట్ లుక్ పోస్టర్" ఆవిష్కారం జరుపుకున్న వినూత్న యూత్ ఫుల్ ఎంటర్టైనర్ "తకిట తధిమి తందాన" చిత్రం తాజాగా భాజపా అగ్రనేత కేంద్రమంత్రి బండి



సంజయ్ చేతుల మీదుగా టీజర్ విడుదల జరుపుకుంది. యూత్‌తోపాటు, ఫ్యామిలీ ఆడియన్స్ ను అమితంగా ఆకట్టుకునేలా టీజర్ ఉందని ప్రశంసించిన బండి సంజయ్, "తకిట తధిమి తందాన" ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. "మర్డర్" ఫేమ్ ఘన ఆదిత్య కొత్తమ్మాయి ప్రియ జంటగా.. యువ ప్రతిభాశాలి రాజ్ లోహిత్ దర్శకత్వంలో ఎల్లో మ్యాంగో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చందన్ కుమార్ కొప్పుల నిర్మించిన "తకిట తదిమి తందాన" చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని, ఈనెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం సినెటే రియా మీడియా వర్క్స్ ఆధ్వర్యంలో విడుదల కానుంది. ఈ చిత్రానికి పి.ఆర్.ఓ: ధీరజ్‌అప్పాజీ, సంగీతం: నరేన్ రెడ్డి, ఎడిటర్: హరి శంకర్, సినిమాటోగ్రఫీ: పి.ఎన్.అంజన్, లిరిక్స్: శ్రేష్ట, కోరైటర్: దిలీప్ అరుకొండ.




# 'మజాకా' రావులమ్మ సాంగ్ లైవ్ షూటింగ్

పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ ల్యాండ్‌మార్క్ 30వ సినిమా 'మజాకా'కి ధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ఎంటర్టైనర్లో రీతు వర్మ హీరోయిన్. మన్మధుడు ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ హైలీ ఎంటర్ టైనింగ్ మూవీ శివరాత్రి కానుకగా ఫిబ్రవరి 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ క్రియేటివ్ ప్రమోషన్స్‌తో ఆడియన్స్‌ని అలరించారు. షూటింగ్‌ని లైవ్ ద్వారా ప్రేక్షకులకు చూపించారు. షూటింగ్‌ని లైవ్‌లో ఇవ్వడం ఇదే తొలిసారి. లైవ్ షూటింగ్ ద్వారా సినీ ప్రేక్షకులు సరికొత్త అనుభూతిని అందించారు మజాకా మేకర్స్.



ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఇంత దూరం వచ్చిన మీడియా మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు. మేము క్రియేటివ్ గా ప్రమోషన్స్ చేయాలని భావించాం. కానీ ఇంత ఎండలో చాలా దూరం ప్రయాణం చేసి ఇక్కడకి వచ్చి మాకు సపోర్ట్ చేసినందుకు చాలా థాంక్ యూ. ఇది ఫస్ట్ ఎవర్ లైవ్ షూట్ ప్రెస్ మీట్ అని చెబుతుంటే నాకు చాలా సర్‌ప్రైజ్‌గా అనిపించింది. చాలా కొత్త ఎక్స్ పీరియన్స్ ఇది. వన్ మంత్‌గా డే అండ్ నైట్ షూటింగ్ చేస్తున్నాం. ఫిబ్రవరి 26న పెద్ద హిట్ కొడుతున్నామనే నమ్మకం వుంది. మీ అందరి సపోర్ట్ కావాలిఖిఅన్నారు. హీరోయిన్ రీతువర్మ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఇంత దూరం ప్రయాణం చేసిన వచ్చిన మీడియాకి థాంక్ యూ. ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాం. మా డైరెక్టర్, ప్రొడ్యూసర్, రైటర్, టీం అంతా చాలా సపోర్ట్‌చేశారు. సందీప్ లక్కీ కో స్టార్. సాంగ్స్‌ని ఆడియన్స్ థియేటర్స్‌లో చాలా ఎంజాయ్ చేస్తారు. మజాకాని థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుతున్నాను. థాంక్ యూ అన్నారు. దర్శకుడు త్రినాధరావు నక్కిన మాట్లాడుతూ, మజాకాలో ఇది సెకండ్ మాస్ సాంగ్. మూడు రోజుల క్రితం భారీ సెట్‌లో ఓ సాంగ్ చిత్రీకరించాం. సందీప్ కిషన్, రీతూ వర్మ ఇరగదీశారు. దాదాపు డెబ్బైమంది డ్యాన్సర్స్‌తో భారీ సెట్స్‌లో శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో సాంగ్ అద్భుతంగా షూట్ చేశాం. ఇప్పుడు కంప్లీట్ అవుట్ డోర్‌లో చేస్తున్న రావులమ్మ ఇంకో మాస్ సాంగ్. ఫుల్ ఫోక్ సాంగ్. థియేటర్స్‌లో దద్దరిల్లిపోతుంది. ఈసారి మళ్ళీ సీట్లు లేస్తాయి. ఇది ఫిక్స్. సినిమా రీరికార్డింగ్ చూసేశాను. ఎక్స్‌లెంట్‌గా వుంది. సందీప్ కిషన్ ఫ్యాన్స్ రెడీ అయిపోండి. మామూలుగా వుండదు అన్నారు. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ, ఇది ఫస్ట్ టైం ఎవర్ లైవ్ షూట్. సినిమా కోసం అందరూ కష్టపడ్డారు. గత 25 రోజులుగా డే అండ్ నైట్ కష్టపడ్డారు. ఎంతో ఉత్సాహంతో మమ్మల్ని సపోర్ట్ చేయడానికి వచ్చిన మీడియాకి ధన్యవాదాలు. మా సినిమాకి మీ సపోర్ట్ చాలా అవసరం.

# 'సమంత' మ్యాజికల్ లుక్..

సినీ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సమంత రూత్ ప్రభు, తన అందం, అభినయం, స్టైల్‌తో ఎప్పటికప్పుడు ట్రెండింగ్‌లో నిలుస్తూనే ఉంటారు. సినిమాల్లో నటనలో తనదైన మార్క్ చూపించిన సమంత, ఫ్యాషన్ ప్రపంచంలో కూడా ఒక స్టైల్ ఐకాన్‌గా మారిపోయారు. ఇటీవల ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోషూట్ స్టిల్స్ మరోసారి అభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వైట్ అండ్ బ్లూ కలర్ డ్రెస్‌లో ఆమె స్టన్నింగ్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఫోటోల్లో సమంత ఒక వైట్ స్లీవ్‌లెస్ టాప్, బ్లూ షేడ్స్‌తో మిక్స్ అయిన ఫ్లోయింగ్ స్కర్ట్‌లో కనిపిస్తోంది. ఆమె స్టైల్‌ను మరింత హైలైట్ చేస్తూ ఉన్న ఈ డ్రెస్, సింప్లిసిటీకి, క్లాసీ లుక్‌కి ఒక మంచి ఉదాహరణ.



హై ఫ్యాషన్ అవుట్‌ఫిట్‌లో కూడా సమంత తన నేచురల్ బ్యూటీని కాపాడుకోవడం విశేషం. మెసీ హెయిర్, మృదువైన మేకప్, సాఫ్ట్ టోన్ లిప్ కలర్ ఆమె లుక్‌కు మరింత అందం తెచ్చాయి. ఈ ఫోటోషూట్‌లో సమంత ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్‌కు ప్రత్యేక ఆకర్షణ ఉంది. స్టిల్‌లో కనిపించే ఆమె నడక, గౌనులో ఉండే స్వభావిక మోషన్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. ఆమె క్యాప్షన్‌లో సెలీనా గోమెజ్ సాంగ్ లిరిక్స్‌ను జత చేయడం అభిమానుల్లో మరో ఆసక్తికరమైన చర్చకు దారి తీసింది. ఫ్యాన్స్ ఈ ఫోటోలను చూసి "క్లాసీ అండ్ ఎలిగెంట్" అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కొంతమంది ఆమె గ్లామర్ వేరే లెవల్‌కి వెళ్లిపోయిందని అంటుంటే, మరికొందరు సమంత ఎప్పుడూ ట్రెండ్స్‌ను ముందే ఫాలో అవుతుందని ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం సమంత తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే దిశగా ప్రయాణం కొనసాగిస్తూనే, కొన్ని ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్స్‌ను అంగీకరించినట్లు టాక్. మరోవైపు, ఓ వెబ్ సిరీస్‌తో బిజీగా ఉన్నారు. టాలీవుడ్‌లోనూ ఆమె తిరిగి సినిమాల్లో కనిపించే అవకాశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. కానీ ఎలాంటి సినిమా ఎనౌన్స్‌మెంట్స్ లేకున్నా, సమంత తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌తో మాత్రం ట్రెండింగ్‌లోనే కొనసాగుతోంది.

# సూట్‌లో అదిరిపోయిన 'రుహాని'

అందాల ముద్దుగుమ్మ రుహాని శర్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. మొదటి సినిమాతోనే మంచి హిట్ తన ఖాతాలో వేసుకున్న ఈ బ్యూటీ, తర్వాత పలు సినిమాలు చేస్తూ ఆడియన్స్‌ను ఆకట్టుకుంది. దీంతో ఈ ముద్దుగుమ్మకు టాలీవుడ్‌లో అమాంతం క్రేజ్ పెరిగిందని చెప్పవచ్చు. చిలసౌ సినిమాతో తెలుగు వెండి తెరకు పరిచయమైన బ్యూటీ రుహానీ. ఈ అమ్మడు అందానికి ఎవ్వరైనా సరే ఫిదా అవ్వాల్సిందే. ఒక్క సినిమాతో ఏ హీరోయిన్ సంపాదించుకోని క్రేజ్ ఈ ముద్దుగుమ్మ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు, అందానికి తెలుగు అభిమానులు ఫిదా అయిపోయారనే చెప్పాలి. చిలసౌ సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన బ్యూటీ రుహానీ. ఈ అమ్మడు అందానికి ఎవ్వరైనా సరే ఫిదా అవ్వాల్సిందే. ఒక్క సినిమాతో ఏ హీరోయిన్ సంపాదించుకోని క్రేజ్ ఈ ముద్దుగుమ్మ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు, అందానికి తెలుగు అభిమానులు ఫిదా అయిపోయారనే చెప్పాలి. ఈ సినిమా తర్వాత రుహానీ పలు సినిమాల్లో నటించినప్పటికీ అంత క్రేజ్ రాలేదు. దీని తర్వాత హిట్, సైంధవ్, ఆపరేషన్ వాలెంటైన్, శ్రీరంగ నీతులు వం టి పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ సినిమా తర్వాత రుహానీ పలు సినిమాల్లో నటించినప్పటికీ అంత క్రేజ్ రాలేదు. దీని తర్వాత హిట్, సైంధవ్, ఆపరేషన్ వాలెంటైన్, శ్రీరంగ నీతులు వంటి పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించింది. ఇక గతంతో పోలిస్తే ఈ అమ్మ డుకు ఇప్పుడు అంతగా అవకాశాలు ఏం రావడం లేదనే చెప్పాలి. దీంతో సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ అయిపోయింది ఈ ముద్దుగుమ్మ. ఎప్పటికప్పుడు వరస ఫొటో షూట్స్‌తో కుర్రకారు మనసు దోచుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ, సూట్‌లో యూత్‌ను ఆకట్టుకుంటుంది. హెయిర్ లీవ్ చేసి, విత్ అవుట్ ఇన్నర్‌లో సూట్ ధరించి తన అందంతో మాయచేసింది. ఇందులో ఈ రుహానీ అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. ఎప్పటికప్పుడు వరస ఫొటో షూట్స్‌తో కుర్రకారు మనసు దోచుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ, సూట్‌లో యూత్‌ను ఆకట్టుకుంటుంది. హెయిర్ లీవ్ చేసి, విత్ అవుట్ ఇన్నర్‌లో సూట్ ధరించి తన అందంతో మాయచేసింది. ఇందులో ఈ



రుహానీ అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. ఇక తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఈ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

# టాలీవుడ్‌లో ప్రీతి ముకుంద హవా..

ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలలో తన కెరీర్‌ను ప్రారంభించింది. ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తు ము2' యూట్యూబ్‌లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది. ఆ తర్వాత ఈ చిన్నదానికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. శ్రీవిష్ణు సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్‌గా మారింది. 'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. టాలీవుడ్‌ను కొత్త అందాలు పలకరిస్తున్నాయి. అలా టాలీవుడ్‌కు పరిచయమైన భామే ప్రీతి ముకుందన్. ఈ చిన్నది ఇటీవలే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలో నటిస్తుంది. ఇప్పుడు కన్నప్ప సినిమాతో మరోసారి ప్రేక్షకులను కవ్వించనుంది ప్రీతి ముకుంద మంచు విష్ణు హీరోగా నటిస్తున్న కన్నప్ప సినిమా పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొన్నామధ్య కన్నప్ప సినిమాలో నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటిస్తుందని అనౌన్స్ చేస్తూ ఓ అందమైన పోస్టర్ వదిలారు. ఇప్పుడు కన్నప్ప సినిమాతో మరోసారి ప్రేక్షకులను కవ్వించనుంది ప్రీతిముకుంద మంచు విష్ణు హీరోగా నటిస్తున్న కన్నప్ప సినిమా పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొన్నామధ్య కన్నప్ప సినిమాలో నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటిస్తుందని అనౌన్స్ చేస్తూ ఓ అందమైన పోస్టర్ వదిలారు. ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలలో తన కెరీర్ ను ప్రారంభించింది. ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తు ము2' యూట్యూబ్‌లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది. ఆతర్వాత ఈ చిన్నదానికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. శ్రీవిష్ణు



సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్‌గా మారింది. 'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ అందంతో పాటు అభినయంతోనూ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు కన్నప్ప సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. శ్రీవిష్ణు సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్‌గా మారింది. 'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ అందంతో పాటు అభినయంతోనూ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు కన్నప్ప సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈఅమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. సోషల్ మీడియాలో అందాల ఆరబోతతోకుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది ఈ చిన్నది.

# గజిని దర్శకుడి దశ తిరిగినట్టే

పదమూడు సంవత్సరాల క్రితం 2012లో వచ్చిన గజిని సూర్య కెరీర్‌ని గొప్ప మలుపు తిప్పడమే కాక దర్శకుడు ఏఆర్ మురుగదాస్ పేరు జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. అమీర్ ఖాన్ వెంటపడి మరీ ఆయనతోనే రీమేక్ చేసి వంద కోట్ల గ్రాసర్ సాధించాడంటే చిన్న విషయం కాదు. ఆ తర్వాత తుపాకీ, కత్తి మాత్రమే మురుగదాస్ స్థాయిలో కంటెంట్ ఉన్న సినిమాలు. సర్కార్ నుంచి పూర్తి ట్రాక్ తప్పేశారు. స్పైడర్ దారుణంగా నిరాశపరచగా దర్బార్ రజనీకాంత్ రేంజులో ఆడలేకపోయింది. అయినా సరే కండల వీరుడు సల్మాన్ ఖాన్ కథను నమ్మి సికందర్ ఛాన్స్ ఇచ్చాడు.



రంజాన్ విడుదల లక్ష్యంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇదింకా థియేటర్లకు రాకుండా మురుగదాస్ శివ కార్తికేయన్ కలయికలో రూపొందుతున్న మదరాసి టీజర్ వచ్చేసింది. విజువల్స్ చూస్తే తుపాకీ నాటి వింటేజ్ నెస్ కనిపిస్తోంది. యాక్షన్ బ్లాక్స్, టెర్రరిజం మాఫియా బ్యాక్ డ్రాప్ వగైరాలతో మరోసారి స్క్రీన్ ప్లే మేజిక్ చేసేలా కనిపిస్తున్నాడు. ఎప్పటిలాగే అనిరుధ్ రవిచందర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మాంచి ఎలివేషన్ ఇచ్చింది. నిజానికిది అమరన్ కన్నా ముందు కమిటైన సినిమా. మొదలుపెట్టాక సల్మాన్ నుంచి పిలుపు రావడంతో దాస్ అటువైపు వెళ్లారు. ఇప్పుడు మదరాసి మీద ఫోకస్ పెడుతున్నారు. చూస్తుంటే సీనియర్ దర్శకుడి మాములు స్పీడ్‌గా లేదు. ఇవి కనక హిట్ అయితే మురుగదాస్ పూర్తి ఫామ్‌లోకి వచ్చేసినట్టే. తిరిగి స్టార్ హీరోలతో కాంబోలు కుదురుతాయి. కొన్నేళ్లుగా టయర్ 1 స్టార్ హీరోలు ఈయన్ని దూరంగా ఉంచుతున్నారు. పుష్ప టైంలోనే అల్లు అర్జున్ కలయికలో ఒక భారీ చిత్రం తీయాలని జ్ఞానవేల్ రాజా అనుకు న్నారు కానీ సాధ్యపడలేదు. తర్వాత తమిళ తెలుగు హీరోలను మురుగదాస్ కలిసినా లాభం లేక పోయింది. ఇప్పుడు సరైన టైం వచ్చింది. సికందర్, మదరాసి కనక వర్కౌట్ అయితే డిమాండ్ అమాంతం పెరుగుతుంది. కథలకు లోటు లేకుండా బోలెడు సిద్ధం చేసి పెట్టుకున్న దాస్ ఈ రెండు సినిమాల మీద మీద బోలెడు నమ్మకంతో ఉన్నారు.

# ఎస్వీసీ 59వ చిత్రానికి ఆడిషన్స్ షురూ

స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో మరో క్రేజీ మూవీలో నటిస్తున్నారు. సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజా వారు రాణి గారు సినిమాతో ప్రతిభా వంతమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్వీసీ సంస్థలో వస్తున్న 59వ చిత్రమిది. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రూపొందనుంది. ఈ సినిమా నుంచి ఆడిషన్స్ అనౌన్స్ మెంట్ చేశారు. 2565 ఏళ్ల వయసున్న మేల్, 2560 ఏళ్ల వయసు గల ఫీమేల్ ఆర్టిస్టులు, నటనలో ఆసక్తి గల 514ఏళ్ల బాయ్స్, 512ఏళ్ల గర్ల్స్ ఈ ఆడిషన్స్‌లో పాల్గొనవచ్చు. కాకినాడ హోటల్ శ్రీవత్సలో ఈనెల 15, రాజమండ్రి హోటల్ సూర్యలో ఈనెల 17న, భీమవరం హోటల్ గ్రాండ్ లీల కృష్ణలో ఈనెల 19న ఈ ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. ఔత్సాహిక నటీనటులకు ఇదొకగొప్ప అవకాశంగా చెప్పవచ్చు.



# జ్ఞానం పెంచే బొమ్మల రూపకర్త..

**ఒకప్పుడు బొమ్మలంటే చెక్కవే తోపుడుబండి, గుర్రం, గిలక్కాయలంటూ ఎన్ని ఉండేవో! పిల్లలు ఆడినా, నోట్లో పెట్టుకున్నా భయమే ఉండేది కాదు. మరి ఇప్పుడో? అంతా ప్లాస్టిక్ మయం. పొరపాటున నోట్లో పెట్టుకుంటే ఏ రసాయనాలు శరీరంలోకి చేరతాయో తెలీదు. చిన్నారులను ఆ అపాయం నుంచి కాపాడించాలనుకున్నారు. కోకికమ్మారంగన్ దానికోసం ఆమె స్థాపించిన సంస్థ వెనక తను దాటిన సవాళ్లు ఎన్నో!**



ఒకవైపు భర్త చనిపోయారు. నెలంతా కష్టపడినా చేతికొచ్చేది రూ.రెండొందలే. దానికితోడు అప్పులు. మరోవైపు చదువుకుంటున్న పిల్లలు. అలాంటి పరిస్థితుల్లో వ్యాపారాలోచన చేశారు. కోకిల అదీ 50 ఏళ్ల వయసులో ఈమెది తమిళనాడులోని వాలాజీపేట అయిదుగురు తోబుట్టువుల్లో ఒకరు అయినా బ్యాచిలర్స్ పూర్తిచేసి టెలికాం ఆఫీసర్‌గా ప్రభుత్వోద్యోగం. సంపాదించారు. భర్తదేమో పెస్టిసైడ్ డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం, అపార్ట్‌మెంట్లకి పెస్ట్ కంట్రోల్ సేవలు అందించేవాడు. ముగ్గురబ్బాయిలు జీవితం సాఫీగానే సాగేది. ఇంతలో ఆమె భర్తకు ఊపిరితిత్తుల క్యాన్సర్ అని తేలింది. అప్పులు చేసి, ఏళ్లపాటు చికిత్స చేయించినా ఆయన దక్కలేదు. పైగా చేతిలో చిల్లిగవ్వ మిగల్లేదు. ఆఫీసు నుంచీ లోను తీసుకునేసరికి కోతలు పోనూ జీతం రూ.200 చేతికి వచ్చేది ఇల్లు గడవడమే కష్టమయ్యేది. దీంతో పిల్లల భవిష్యత్తు కోసం పరిచయం లేకపోయినా భర్త వ్యాపారాన్ని తిరిగి ప్రారంభించారు. నేర్చుకుంటూ ఆర్డర్లు. తెచ్చుకున్నారు. నెమ్మదిగా ఆర్థిక వెసులుబాటు దొరికింది. సమస్యల్లా. చెక్క పెట్టెల్లో పురుగుమందుల పంపిణీ, ఆపార్ట్ మెంట్లలో చీడపీడలను పోగొట్టే సమయంలో వాడే రసాయనాలు ఆరోగ్యంపై ప్రభావం చూపడం గమనించారామె తన భర్త క్యాన్సర్ ఇవే కారణమని తెలిశాక కేవలం



చెక్క పెట్టెల తయారీపైనే దృష్టి పెట్టారు. చెప్పునంత సులువేమీ కాలేదు. నా ప్రయాణం ఉదయం ఏడింటికి ఇంట్లోంచి వెలితే రాత్రి 10 దాటేది. ఉదయం వర్క్‌షాప్‌ని చూసుకుని అట్నుంచి ఉద్యోగానికి వెళ్లేదాన్ని వీలైతే లంచ్‌లోనూ. చూసొచ్చేదాన్ని. ఆఫీసు ముగిశాక మళ్లీ వ్యాపార పనులే పిల్లల చదువు పూర్తయ్యేంతవరకూ ఏళ్లపాటు నా దినచర్య ఇదే అంటారు కోకి. తరువత ఆమె రిటైరయ్యారు. పిల్లలూ పెళ్ళిళ్లు చేసుకుని స్థిరపడ్డారు. మనవలు మనవరాళ్లూ వచ్చారు ఒసారి వారికోసం బొమ్మలు కొవడానికి మార్కెట్‌కి వెళితే అన్నీ ప్లాస్టిక్ బొమ్మలే తక్కువ నాణ్యతగల ప్లాస్టిక్ చిన్నారుల్లో అనారోగ్యాలకు దారితీయగలదు. ఆ ఆలోచన కలిగాక ఆమె మనసు చెక్క బొమ్మలవైపు మళ్లింది. దీంతో 2020లో 'ఉడ్ బీ టాయ్స్' ప్రారుభించారు కేవలం ఆడుకునేలానే కాదు నేర్చుకునేలా బొమ్మలు తీసుకొచ్చారు. వీటికి సోషల్‌మీడియాలో త్వరగానే ప్రకారం లభించింది. దాంతో మూడేళ్లలో 110 రకాల బొమ్మలను అందుబాటులోకి తెచ్చాడు. వ్యాపారమూ రూ.3.5 లకు చేరుతుంది. నీళ్ల బొమ్మలు, దేశవ్యాప్తంగా కాదు, విదేశాలకి ఎగుమతి అవుతున్నాయి. ఇక విశ్రాంతి తీసుకోవచ్చుగా అంటారంతా. కానీ నా కొత్త ప్రయాణం మొదలైందిప్పుడే అని చెబుతా. మా బొమ్మలకు స్ఫూర్తి నా మనవళ్లూ మనవరాళ్లే. వాళ్ల అవసరాలనుబట్టి బొమ్మలు రూపొంది స్తున్నాం. రసాయనాలు వాడని మొక్కలనేబొమ్మల తయారీకి వాడుతున్నాం. రంగులూ అంతే. నెలకు దాదాపు 30వేల బొమ్మలు రూపొందిస్తాం.ఎన్నో పరీక్షల తరవాతే మార్కెట్‌లోకి పంపుతాం. మా కుటుంబంలో జరిగిన హాని ఎవరికీ జరగొద్దనే నా తాపత్రయం. అందుకే ఎంతో ప్రేమతో వీటిని తీర్చిదిద్దుతున్నా. ఇందుకు నా కుటుంబమంతా అండగా ఉంది. అంటోన్న 63 ఏళ్ల కోకిల ప్రయాణ స్ఫూర్తిదాయకమేగా మరి. ◻

# బ్రిటిష్ ప్రభుత్వ అవార్డు!

**ఆటిజంతో బాధపడుతోన్న పిల్లల్ని పెంచి పెద్ద చేయడం ఓ సవాలు! అలాంటి బిడ్డను కన్నతల్లిగా తాము ఎదుర్కొన్న ఇబ్బందులనూ, ఆ చిన్నారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఉపయోగపడే నైపుణ్యాలనూ తోటి అమ్మలతో పంచుకోవాలను కున్నారు. ఇందుకోసం తన వైద్యవృత్తిని సైతం వదిలిపెట్టి అవగాహనా కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు ఎన్ఆర్ఐ డాక్టర్ ఉప్పులూరి అనురాధ. ఈ సేవలకే 2025 గాను ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ సిటీజన్ అవార్డుని అందుకున్నారామె.**



అనురాధ స్వస్థలం నూజివీడు... యూకేలోని బర్మింగ్‌హామ్‌లో స్థిరపడ్డారు. వృత్తిరీత్యా దంతవైద్యు రాలు. బాబు పుట్టాడని సంతోషపడేలోగా తనకి ఆటిజం అని తెలిసి ఎంతో తల్లడిల్లిపోయారు. ఆ చిన్నారి భవిష్యత్తుని ఊహించుకుని కొన్నాళ్లు బెంగపడ్డారు. కానీ, దిగులుపడుతూ కూర్చోవడం పరిష్కారం కాదని అర్థమ య్యాక... ఏం చేయాలో వెతకడం మొదలు పెట్టారు. కొడుకు సంరక్షణ కోసం డెంటల్ డాక్టర్‌గా తన కెరియర్‌ని సైతం సులువుగా వదిలేసుకున్నారు. ఆ క్రమం లోనే ఆటిజం లక్షణాలు, ఆ చిన్నారులతో ఎదురయ్యే ఇబ్బందులు, వారికి వచ్చే అనారోగ్యాలు, తల్లిగా తాను ఇవ్వాల్సిన మందులు వంటివి



ఎన్నో విషయాలను అర్థం. చేసుకున్నారు. వీటిని తనలాంటి తల్లులకు చెప్పి వారి ఆందోళనల్ని తగ్గించాలనుకున్నారు. వారికి మానసిక తోడ్పాటుని అందించడం మొదలు పెట్టారు. దీనికోసం కృషి చేసే స్వచ్ఛంద సంస్థలకు అండగా నిలవాలనుకున్నారు. ఇందుకోసం నిధుల సేకరణ చేపట్టారు. ఇలా ఇప్పటివరకూ 30వేల పౌండ్లకు పైగా వచ్చిన మొత్తాన్ని స్థానికంగా ఉన్న ఉఫ్‌కల్మ్ స్పెషల్ నీడ్స్ స్కూల్, ఆటీజం వెస్ట్ మిడ్ల్యాండ్స్, నేషనల్ ఆటిస్టిక్ సొసైటీతోపాటు దేశవ్యాప్తంగా ప్రత్యేక అవసరాల పిల్లల కోసం పనిచేస్తున్న మరికొన్ని లాభాపేక్షలేని సంస్థలకు విరాళంగా ఇచ్చారు.అంతేకాదు, అదనపు అవసరాలు ఉన్న పిల్లలను పెంచడంలో ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొనే తల్లులందరితో కలిపి 'బ్రిడ్జింగ్ బ్రెయిన్స్' అనే సంస్థను స్థాపిం చింది. ప్రతి బిడ్డ భవిష్యత్తునీ అందంగా మలిచేందుకు అవసర మైన తోడ్పాటుని ఒకరికొకరు అందించుకోవాలనే లక్ష్యంతో దీన్ని చేస్తారు. దీనిద్వారా ఆటిజం పిల్లలూ ఇతరులతో ఇమడ గలిగేలా వారి మధ్య అంత రాలను తగ్గించేలా సాయ పడతారు. ఈ ఆసక్తులను గుర్తించి అందులో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. సంగీతం, నృత్యం, చేతివృత్తులు... వంటి నైపుణ్య ఆధారిత పనులను నేర్పించి వారి భవిష్యత్తుకు భద్రత కల్పిస్తున్నారు. అంతేకాదు. ఇలాంటి చిన్నారుల వల్ల ఆయా కుటుంబాలు పడే మానసిక వేదనను తగ్గించడానికి అవసరమైన వెల్నెస్ సెషన్లు ఉన్నాయి. ఈ సేవలకు గుర్తింపుగా యూకేలోని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నుంచి లైఫ్టోమ్ అచీవ్‌మెంట్ అవార్డుతోపాటు మరెన్నో ప్రముఖ సంస్థల గౌరవ పురస్కారాలు అందుకున్నారు. తాజాగా బ్రిటిష్ సిటిజన్ అవార్డుని అందుకున్నారు. ఏటా బ్రిటిష్ ప్రభుత్వం పీపుల్స్ అవార్డ్స్ భాగంగా దీన్ని అందిస్తోంది. ◻

# కౌమార 'దశ' సూత్రాలు

**కౌమరదశలోకి అడుగు పెట్టేటప్పుడు అమ్మాయిల్లోనే కాదు, అమ్మల్లోనూ ఆందోళన సందడి చేసింది. వాళ్లకి ఎంతవరకూ చెప్పాలి? ఏది చెప్పకూడదు? ఇలా ఎన్నో సందేహాలు ఆపోహాలు, పిల్లలకూ మంచి యవ్వనంలోకి అడుగు పెడుతున్న ఈ దశ ఎంతో కీలకం ఇప్పుడు ఏర్పరచుకునే అలవాట్లు, జీవనశైలి మాత్రమే వాళ్ల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది. అందుకు అమ్మలకు నిపుణులు చెప్పే సూత్రాలు ఇవే.**

**భావోద్వేగాలపరంగా...** భావోద్వేగాల పరిణతి వచ్చేది టీనేజ్‌లోనే. ప్రతిదీ నేర్చుకునేదీ ఇప్పుడే.



ఇలాంటప్పుడు విమర్శిస్తూ కఠినంగా వ్యవహరిస్తే కుటుంబంతోనూ, తోటి పిల్లలతోనూ వాళ్ల ఎమోషనల్‌గా దూరమవుతారు. దాంతో తమ సమస్యలను చెప్పడానికీ ముందుకురారు. కాబట్టి, తప్పు సరిచేసేముందు వాళ్ల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులుగా మనదే. ఈ సమయంలో కుటుంబం, టీచర్లు వాళ్లను మరింతగా అర్థంచేసుకోవాల్సి ఉంటుంది.

**అపోహలు తొలగిస్తేనే..** రుతుక్రమం.. శరీరకంగా, మానసికంగా అమ్మాయిల్లో చాలా మార్పులే తెస్తుంది. కాబట్టి, వాటి గురించి పీరియడ్స్ మొదలవ్వకముందే పాపకు అర్థమయ్యేలా లాజికల్‌గా, మనసు నొప్పించకుండా చెప్పాలి. అప్పుడే మనసులో ఉన్న భయాలూ, అపోహలూ తొలగిపోయి, తనలో వస్తోన్న మార్పులను అర్థం చేసుకుంటుంది.

**శుభ్రతా ముఖ్యమే...** ఇక పీరియడ్స్ మొదలయ్యాక మరో కొత్త సవాలు.. పరిశుభ్రత. ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే.. ప్రతి 4-6 గంటలకొకసారి ప్యాడ్ మార్చుకునేలా చూడాలి. మెన్‌స్ట్రువల్ కప్స్ వంటివి వాడుతుంటే వాటిని శుభ్రపరచడం, స్టెరిలైజ్ చేయడం వంటివి నేర్పించాలి. క్రమం తప్పకుండా స్నానం, దుస్తులు, లోదుస్తులు వంటివి మార్చుకోవడం అలవాటు చేయాలి.

**ఎదుగుదలకు తగినట్లుగా....** ఎదిగే వయసులో అమ్మాయిలకు పోషకాహారం తప్పనిసరి. ఎంత బిజీగా ఉన్నా సరే.. మంచి ఆహారం అందించడం మాత్రం మర్చిపోవద్దు. అధిక ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ లో ఫ్యాట్, లో కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం ఇవ్వాలి. దీని గురించి ఒక రోజు ముందుగానే ప్రణాళిక వేసుకుంటే వాటి తయారీ సులువవుతుంది.

**నీళ్లు తాగుతున్నారా? ...** ఆహారం ఒక్కటే కాదు, సరైన మోతాదులో నీళ్లు తీసుకోవడం కూడా ముఖ్యమే. చదువుల్లో పడి స్కూల్లో నీళ్లు తాగడం మర్చిపోతుంటారు. కాబట్టి, పాప రోజుకి కనీసం 12 గ్లాసుల నీళ్లు తాగేలా చూసుకోవాలి. చక్కెరలేని పండ్లరసాలూ మంచి ఎంపికే.కాఫీ, టీ,కార్పొరేడ్ డ్రింక్‌లు, కృత్రిమ తీపి కలిగిన పానీయాలకూ దూరంగా ఉంచాలి.

**హార్మోనుల్లో మార్పులు...** టీనేజ్ అమ్మాయిల్ని ఇబ్బంది పెట్టే మరో సమస్య మొటిమలు ఇవే వారిలో ఆత్మన్యూనతకు జరిపిస్తాయి. కాబట్టి, ఇందుకు కారణం హార్మోనుల్లో మార్పులే అని పిల్లలకు అర్థమయ్యేలా చెబుతూనే వాటి గురించి జాగ్రత్తలు చెప్పాలి. వాటిని గిల్లడం, వత్తడం లాంటివి చేయనీయకూడదు పీహెచ్ సమతుల్యత ఉన్న ఫేస్‌వాష్‌లను రోజుకి రెండుసార్లు వాడమనాలి. అయిల్ ఫేస్ క్రీములకు దూరంగా ఉంచాలి. అండర్ ఆర్మ్స్, ప్రైవేట్ బాగాల్లోని అవాంచిత రోమాలు చెమటకు, ఇన్ఫెక్షన్లకూ దారితీయొచ్చు కాబట్టి, షేవింగ్, వ్యాక్సింగ్ వంటి పద్ధతులను పిల్లలకు వివరించాలి బ్రెస్ట్ ఎదుగుదల, బ్రా వేసుకోవడం లాంటి విషయాలు వాళ్లకు పూర్తిగా కొత్త వాళ్లలో వచ్చే ఈ మార్పులన్నింటి గురించి సిగ్గుపడకుండా, సౌకర్యంగా మనతో మాట్లాడగలిగేలా చేసుకోవాలి.

**వ్యాయామంతో ....** సిగ్గు, బిడియం.. ఏదైతేనేం టీనేజ్ అమ్మాయిలను ఆటలకు దూరం చేస్తున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి.కాబట్టి, ఆ ఫీలింగ్స్‌ను పోగొట్టి వాళ్లు బయటకు వచ్చేలా ప్రోత్సహించాలి. స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, వాకింగ్, రన్నింగ్.. ఇలా ఏదో ఒకదాన్లో భాగమయ్యేలా చూడాలి. వ్యాయామం అలవాటు చేయడం వల్ల భవిష్యత్తులో పిల్లలకు జీవనశైలి వ్యాధులు రాకుండా ఉంటాయి.

**ప్రశాంతంగా...** ఓవైపు శరీరంలో మార్పులు, మరోవైపు చదువు.. ఇవన్నీ పిల్లల్లో ఒత్తిడి కలిగిస్తాయి. అందుకే, రోజుకి ఒక గంటైనా వాళ్లు ప్రశాంతంగా కూర్చొనేలా సమయమివ్వాలి. ఇది వాళ్ల గురించి వాళ్లు ఆలోచించుకునేందుకు సాయపడుతుంది. డ్రాయింగ్, పెయింటింగ్, కథల పుస్తకాలు, క్రియేటివ్ క్రాఫ్ట్‌వర్క్ వంటివి చేసేలానూ ప్రోత్సహించాలి. అప్పుడే మానసికంగా బ్యాలె న్స్‌డ్‌గాఉండగలుగుతారు.

**గాఢ నిద్ర ఉంటే...** రాత్రిపూట కనీసం 7 గంటలపాటు గాఢనిద్ర ఉండేలా చేసు కోవాలి. నిద్రించేట ప్పుడు తాజా, పరిశుభ్రమైన దుస్తులు వేసుకునేలా చూడాలి. పడుకునే ముందు కాఫీ, టీలు వంటివి ఇవ్వకూడదు. పరీక్షల సమయంలో రాత్రంతా మేలుకుని చదవకుండా ముందు నుంచే సన్నద్ధమయ్యేలా చూడాలి. ఇవన్నీ నిద్ర నాణ్యతను పెంచేవి.

**అదీ చెప్పాలి. ...** ఇవేకాదు, టీనేజ్ పిల్లలకు వారి పరిధిమేరకు సెక్స్ ఎడ్యుకేషన్ గురించి అవగాహన కల్పిం చడమే ముఖ్యమే. గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ లాంటి వాటి గురించీ తెలియజేయాలి. అప్పుడే వాళ్లుచైల్డ్ అబ్యూజింగ్ లాంటివి ఎదుర్కోకుండా ఉంటారు. ఇలాంటి విషయాల గురించి ధైర్యంగా మనతో మాట్లాడతారు. ◻

# మెనోపాజ్‌లో పొట్టా ?

**ఆఫీసులో గంటలకొద్దీ కూర్చునేవారిలో, పిల్లలు పుట్టాక పొట్ట కనిపించడం మామూలే మెనోపాజ్లోనూ ఇది వేధిస్తుంది. తగ్గించుకోవాలా... అయితే వీటిని ప్రయత్నించండి.**




హార్మోనుల్లో అసమతుల్యత, ఒత్తిడి, ఆందోళన, కొన్ని రకాల విటమిన్లు సరిగా అందకపోవడం ఇలా మెనోపాజ్ పొట్ట పెరగడానికి బోలెడు కారణాలు, ఈ సమయంలో సమతుల ఆహారానికి ప్రాదార్థ్యమివ్వాలి, పండ్లు, కూరగాయలు, ఒమెగా 3 ఫ్యాటీయాసిడ్లు, అవిసెలు, ఓట్స్ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. వీటిల్లోని ఫైబర్ మెటబాలిజాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే, ప్రాసెస్ట్ వుడ్, చక్కెరలు, శీతలపానీయాలకు దూరంగా ఉండాలి. తగినంత నీటిని తీసుకోవాలి. ఒంట్లో నీటిశాతం తగ్గినా కడుపు ఉబ్బినట్లుగా తయారవుతుందట. అందుకే దీనిపైనా దృష్టి పెట్టాలి. నిజానికి మెనోపాజ్ లక్షణాలు మొదలవుతున్న ప్పట్నుంచే ఆహారపరంగా ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు ఈ సమయంలో వ్యాయామానికి తప్పక ప్రాధాన్యమివ్వాలి. ప్లాంక్, గుంజీలు తీయడం, సూర్యనమస్కారాలు వంటివి సాయపడతాయి. అయితే నిపుణుల సాయం తీసుకోవడం మేలు. గైనకాలజిస్ట్ని కలిశారా? మెనోపాజ్లో చాలామందికి ఫైబ్రాయిడ్స్ ఏర్పడతాయి. ఇవి పొట్టలాగే కనిపిస్తాయట. అందుకే చెక్ చేయించుకోవడం మేలు. చివరగా ఒత్తిడిపైనా దృష్టి పెట్టాలి. ఇది తగ్గితే పొట్ట కూడా చాలావరకూ తగ్గుతుందని మెచ్యూరిటస్ జర్నల్లో ప్రచురితమైన అధ్యయనం చెబుతోంది. ఒత్తిడి పెరిగినప్పుడు కార్టిసాల్ అనే హార్మోను ఎక్కువగా విడుదలవుతుంది. ఇది పొట్ట దగ్గర కొవ్వు పేరుకునేలా చేస్తుంది. అంతేకాదు. ఇన్సులిన్ శోషించుకోవడంలో అడ్డుపడి బరువు పెరగడానికి దారితీస్తుంది. అందుకే దీన్ని పట్టించుకో వాలి. వీటిని గమనించుకుని... తగిన జాగ్రత్తలు తీసుకుంటే పొట్ట సమస్యగా మారదు. ప్రయత్నిస్తారా మరి ? ◻



# కుంభమేళాలో రియా!

కోట్లాది మంది భక్తులు తరలి వచ్చే మహా కుంభమేళాలో ప్రత్యేక ఆకర్షణగా ఆకర్షణగా నిలుసునతన్నాయి. అక్కడి స్వాగత ద్వారాలు. వీటి ఇంటీరియర్, ఎక్స్‌టీరియల్‌లను





రూపొందించడంలో పర్భణీకి చెందిన విద్యార్థిని రియా మిశ్రాది ప్రత్యేక పాత్ర. ఆమె స్థానిక సింహగఢ్ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విద్యార్థిని. అహ్మదాబాద్‌లోని స్టూడియో శరాన్ష్ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేస్తుండగా ఈ అవకాశం దక్కిందట. 30,360 చదరపుటడుగుల స్థలంలో అనుస్థాన కాంప్లెక్స్ 3,77,43 చదరపుటడుగుల్లో ఏర్పాటు చేసిన క్యాంపుల ముందు భాగం, ఎలివేషన్లను ఇస్తూ చేసిన డిజైన్‌లలో భాగమయ్యారు. రియాకు గుర్తింపు తెతచ్చిన ప్రాజెక్టుల్లో దత్త మయూర్ ద్వార్ ఒకటి. ఆమెకు చిన్నప్పటి నుంచే చిత్రకళ అంటే ఆసిక్తి. ప్రతిదీ ప్రత్యేకంగా కనిపించాలని కోరుకునేది. ఆమె తండ్రి వికాస్ మహారాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలో డిప్యూటీ మేనేజర్, తల్లి షర్మిలి ఇంగ్లిష్ టీచర్..కూతురిలోని ప్రతిభనుర గుర్తించి ప్రోత్సహించారు. పర్భణీ బాల విద్యామందిర్ హైస్కూల్లో చదివింది. ప్లస్‌టూ పూర్తిచేశాక.. సింహగఢ్ ఆర్కిటెక్చర్ కాలేజీలో చేరింది. ఆసక్తే.. అవకాశాల్నీ తెచ్చిపెడుతుందని సంతోషం వ్యక్తం చేస్తోన్న రియాకు ఆల్ ది బెస్ట్ . ◻

# బలిని శపించిన విష్ణువు

బలి చక్రవర్తి శిశువుగా ఉన్నప్పుడు ఆయనను ఊయలలో వేసే ఉత్సవానికి విష్ణుమూర్తికి ఆహ్వానం. అందలేదు. అందుకాయన కోపించి ఈ బాలుడు పెద్దయ్యాక తన వద్దకు యాచన కోసం వచ్చిన బ్రాహ్మణులను సంతృప్తి పరచకపోతే కీడు వాటిల్లుతుంది అని శపించాడు. తాను చక్రవర్తి అయ్యాక కూడా విష్ణు శాపాన్ని మర్చిపోలేదు బలి. ఒకరోజు పొట్టిగా ఉన్న బ్రాహ్మణుడు వచ్చి మీ రాజ్యంలో పశుపక్ష్యాదులకు ఆవాసముంది కానీ ఈ దీన బ్రాహ్మణుడు తలదాచు కోవడానికి గుడిసె కూడా లేదయ్యా., ఏ అరుగు మీదనైనా పడుకుందామంటే నీళ్ల జల్లి పొమ్మంటు న్నారు. మీ రాజ్యంలో ఆలయాలు కిటకిటలాడుతాయి. అక్కడా కుదరదు. కనుక మూడడుగుల నేల ఇస్తే.. స్థిరంగా ఉంటాను అన్నాడు. అందుకు బలి 'మూడడుగులేనా? నీకు ఎక్కడ, ఎంత స్థలం కావాలన్నా ఇస్తాను' అన్నాడు. మూడడుగులే చాలన్న బ్రాహ్మణుడి పాదం బ్రహ్మాండంగా ఎదిగి భూభాగ మంతా ఆక్రమించింది. మరో అడుగు ఆకాశాన్ని ఆక్రమించింది. వచ్చిందెవరో, జరుగుతున్నదేమిటో గ్రహించిన బలి 'మూడో అడుగు నా తల మీద పెట్టు స్వామీ' అన్నాడు. వామన రూపంలో ఉన్న విష్ణుమూర్తి హృదయం మెత్తబడి ఏదైనా వరం కోరుకోమన్నాడు. పాతాళలోకానికి వెళ్లబోతున్న బలిచక్రవర్తి ఈ రోజున దీపం పెట్టి దానం చేసేవారి ఇళ్లు లక్ష్మీ నిలయాలు అయ్యేటట్టు వరమివ్వు అన్నాడు. అలా దీపావళి పండుగ ఆరంభమైంది. ఆరోజు బలిచక్రవర్తిని తలచుకుంటూ దీపదానం చేయాలంటారు. ◻



ఆధ్యాత్మికం

# పెదాలకు ఏం కావాలి?

**స్కిన్‌కేర్ రొటీన్‌లో లిప్‌బామ్‌దీ ప్రధాన స్థానమే తగ్గట్టుగా మార్కెట్లో బోలెడు ప్రత్యామ్నాయాలు మరి మన పెదాలకు అనువైనదే వాడుతున్నానా? తెలుసుకుందాం.**



మిగతా చర్మంతో పోలిస్తే పెదాలు ఉంటాయి. అందుకే వాటికి మరింత తేమ కావాలి. లిప్‌బామ్ కొనేముందు తగినంత మాయి శ్చరైజర్ అందిస్తుంది అన్నది చూసుకోవాలి. షియా, కోకో బటర్, సెరమైడ్స్, హైలురోనిక్ యాసిడ్ వంటివి తేమను అందించడమే కాదు.. మాయిశ్చర్‌నీ లాక్ చేయగలవు. ఎండ నుంచి చర్మానికి ఎంత హానో తెలిసిం దేగా.. అందుకే లిప్‌బామ్‌లో ఎస్‌పీఎఫ్ ఉండటమూ తప్పనిసరే. నాన్‌కమడోజె నిక్‌వీ.. బావ్యాక్స్, కలబంద ఉన్నవీ తీసుకుంటే పగలడం, పొడిబారడం వంటివాటికి మంచి పరిష్కారం.

**ఇవి వద్దు..** పొడిబారినప్పుడో తెలిసో తెలియకో పెదాలను తడుపుతూ ఉంటాం. అంటే నోట్లోకి పోయే అవకాశాలే ఎక్కువ. అందుకే పారాజెన్స్, థలేట్స్ లేనివి ఎంచుకోవాలి. ఇవి హార్మోన్లపై ప్రభావం చూపడమే కాదు. దద్దుర్లకీ కారణమవుతాయి. ఫ్లేవర్లున్నవీ వద్దు. అలర్జీలకు కారణమవుతాయి. కర్పూరం, మెంథాల్, ఫెనాల్, ఆల్కహాల్ ఆధారిత బామ్‌లు దీర్ఘకాలంలో పెదాలు మరింత పొడిబారేలా చేస్తాయి. కాబట్టి, ఇవి లేకుండా చూసుకోండి. ముఖానికి మాయిశ్చరైజర్‌లాగే పెదాలకు లిప్‌బామ్ తప్పనిసరి. ఎండలో ఉంటే రెండుమూడు గంటలకోసారి ఎస్‌పిఎఫ్ ఉన్నవాటిని తరచూ రాయాలి. ◻

# గుజియా

**కావలసినవి :** కండెన్స్‌డ్ మిల్క్ - పావుకిలో మైదాపిండి, ఉప్మా రవ్వ-అర కప్పు చొప్పున, కొబ్బరి తురుము-కప్పు, నెయ్యి-2 చెంచాలు, జీడిపప్పు, బాదం పలుకులు, కిస్‌మిస్-అన్నీ కలిపి అరకప్పు, యాలకుల పొడి-పావు చెంచా,నూనె - వేయించేందుకు సరిపడా.

**తయారీ:** ముందుగా రవ్వను నేతిలో వేయించాలి. అది దొరగా వేగాక, కొబ్బరి తురుము, జీడిపప్పు కాదు, కసినిస్, యాటకుల పొడి వేసి కాస్త వేయించాలి. ఒక తర్వాత నిమిషంలో కండెడ్ వేసి కలియ తిప్పుతుండాలి. దగ్గరగా అయ్యాక దించాలి. ఒక పాత్రలో పుణపిండి, కాస్త నూనె, కొన్ని నీళ్లు కలిపి శుభ్రమైన వస్త్రం చుట్టి, ఓ పావుగంట



పక్కనుంచాలి. ఈ పిండిని చిన్న ఉండలుగా తీసుకుని చపాతీల్లా చేసుకోవాలి. వాటి మధ్యలో నిమ్మకాయంత కొబ్బరి మిశ్రమాన్ని ఉంచి, మధ్యలోకి మడవాలి. అంచులకు రెండు చుక్కల నీళ్ల తడి రాస్తే విడిపోకుండా తేలిగ్గా అతుక్కుంటాయి. చివర్లలో ఫోర్క్స్ కాగుతున్న నూనెలో వేయిస్తే సరిపోతుంది. తియ్యటి ఈ గుడియాలు శక్తినీ ఇస్తాయి. ◻



## రంజీ ట్రోఫీ: తొలి ఇన్నింగ్స్‌లో
# విదర్భ 383 రన్స్
### 365 రన్స్ వెనుకబడిన ముంబయి

**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీలో విదర్భతో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ముంబై 365 పరుగులు వెనుకబడి ఉంది. విదర్భ భారత స్టార్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే ఈ మ్యాచ్‌లో చెలరేగిపోయాడు. విదర్భతో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై తరపున దూబే 5వికెట్ల ప్రదర్శనతోమెరిశాడు. దూబే ధాటికి విదర్భ తొలిఇన్నింగ్స్‌లో 383 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 308/5 వద్ద రెండో రోజు ఆటను ప్రారంభించిన విదర్భ మరో 75పరుగులు మాత్రమే జోడించి మిగతా 5 వికెట్లు కోల్పోయింది. తొలిరోజు ఆటలో 2 వికెట్లు తీసిన దూబే రెండో రోజు చెలరేగిపోయి మరో 3 వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్లో దూబే పార్థ్ రేఖడే, కీలకమైన కరుణ్ నాయర్, హర్ష్ దూబే, భూటే, యశ్ ఠాకూర్ వికెట్లు తీశాడు. ముంబై బౌలర్లలో షమ్స్ ములానీ, రాయ్‌స్టన్ డయాస్ తలో 2, శార్దూల్ ఠాకూర్ 1 వికెట్ తీశారు. విదర్భ ఇన్నింగ్స్‌లో ధృవ్ షోరే (74), దినిశ్ మాలేవార్ (79), యశ్ రాథోడ్ (54) అర్ధ సెంచరీలతో రాణించగా, కరుణ్ నాయర్ (45), కెప్టెన్ అక్షయ్ వాద్కర్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అథర్వ తైడే4, పార్థ్ రేఖడే 23, హర్ష్ దూబే 18, భూటే 11, యశ్ ఠాకూర్ 3 పరుగులు చేసి ఔట్ కాగా, దర్శన్ నల్కండే 12 పరుగులతో అజేయంగా నిలిచాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై 18 పరుగుల వద్దే తొలి వికెట్ కోల్పోయింది. దర్శన్ నల్కండే బౌలింగ్‌లో దనిశ్ మలేవార్‌కు క్యాచ్ ఇచ్చి ఆయుశ్ మాత్రే (9) ఔటయ్యాడు. ప్రస్తుతం ఆకాశ్ ఆనంద్ (7), సిద్దేశ్ లాడ్ (0) క్రీజ్లో ఉన్నారు. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు ముంబై ఇంకా 365 పరుగులు వెనుకపడి ఉంది.

## ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా రాహుల్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ తమ జట్టుకు కొత్త సారథిని నియమించనుంది. తాజా సమాచారం ప్రకారం, భారత క్రికెట్ జట్టు వికెట్‌కీపర్, బ్యాట్స్‌మన్ అయిన కేఎల్ రాహుల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఎంచుకోనుంది. ఇప్పటి వరకు, రాహుల్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకునాయకత్వం వహించాడు. అయితే 2025 ఐపీఎల్ మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ రాహుల్‌ను రూ. 14 కోట్లకు కొనుగోలు చేసింది. రాహుల్‌కు ఐపీఎల్‌లో విశేష అనుభవం ఉంది. 2013లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతోతన ఐపీఎల్ ప్రయాణాన్ని ప్రారంభించిన రాహుల్, సన్‌రైజర్స్ హైదరాబాద్,కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ప్రస్తుతం పంజాబ్ కింగ్స్), లక్నో సూపర్ జెయింట్స్ వంటి జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2022 సీజన్‌లో లక్నో జట్టుకు కెప్టెన్‌గా నియమితులైన రాహుల్, 3సీజన్లపాటు ఆ జట్టుకు నాయకత్వం వహించాడు. 2025 సీజన్‌కు ముందు, లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రిషభ్ పంత్‌ను కెప్టెన్‌గా నియమించుకుంది, దీంతో రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరాడు. రాహుల్ మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌ను మెరుగుపరచే అవకాశం ఉంది. అతని స్థిరత, క్లాస్ బ్యాటింగ్ శైలి జట్టుకు చాలా బలాన్ని అందించగలదు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్: అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, ట్రిస్టన్ స్టబ్స్, అభిషేక్ పోరెల్, మిచెల్ స్టార్క్, రీలి రాహుల్, హ్యారీ బ్రూక్, జేక్ ఫ్రేజర్‌మెక్‌గుర్క్, గి. నటరాజన్, కరుణ్ నాయర్, సమీర్ రిజ్వి, అశుతోష్ శర్మ, మోహిత్ శర్మ, ఫాఫ్ డు ప్లెసిస్, ముఖేష్ కుమార్, దర్శన్ నల్కాండే, విప్రజ్ నిగమ్, దుష్మంత చమీర, డోనోవన్ ఫెర్రేరా, అజయ్ మండల్, మన్వంత్ కుమార్, త్రిపురాన విజయ్, మాధవ్ తివారీ.

## నేటి నుండి ఛాంపియన్స్
# ట్రోఫీ



### భారత్‌కు గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లే కీలకం
### పాకిస్థాన్, న్యూజిలాండ్‌తోనే అగ్ని పరీక్ష

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మకమైన ఛాంపియన్స్ ట్రోఫీకి సర్వం సిద్ధమైంది. ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన టీమ్‌ఇండియా ఈ నెల 19 నుంచి జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం సన్నద్ధమవుతోంది. ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో 8 జట్లు పోటీపడుతున్నాయి. ఈ సారి వన్డే ఫార్మాట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. టీమ్‌ఇండియా మ్యాచులన్నీ దుబాయ్ లోనే జరగనున్నాయి.

ఇక గ్రూపు దశ మ్యాచ్‌లే భారత్‌కు కీలకం కానుంది. ఈ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తున్న డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్థాన్, తాజాగా ముక్కోణపు సిరీస్‌ను సొంతం చేసుకున్న న్యూజిలాండ్, సంచలనాలు సృష్టించే బంగ్లాదేశ్‌తో గ్రూప్ దశలో భారత్ తలపడనుంది. ముఖ్యంగా పాకిస్థాన్, న్యూజిలాండ్ నుంచి టీమ్‌ఇండియాకు పెద్ద అగ్ని పరీక్షే. గ్రూప్ దశలో టాప్2లో నిలిచే జట్లే సెమీస్‌కు అర్హత సాధించనున్న నేపథ్యంలో ప్రతీ మ్యాచ్ కూడా భారత్ జట్టుకు కీలకంగా మారింది. గ్రూప్ ఎ లో భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ ఉన్నాయి. గ్రూప్ ఎ లో భారత్ మూడు మ్యాచ్‌లు ఆడనుంది. టాప్2 జట్లు సెమీస్‌కు చేరుకుంటాయి. గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ ఓడినా సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారతాయి. ఏ మాత్రం భారీ ఓటమి ఎదురైనా సరే ఇంటి ముఖం పట్టాల్సిందే. ఈసట్రోఫీలో సెమీస్‌కు చేదాలంటే భారత్ మూడు మ్యాచుల్లోనూ గెలవాలి. ఏమాత్రం ఒక్క ఓడినా ఇతర జట్లు ఆడే మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రూప్ స్టేజ్‌ను దాటడం కష్టమవుతుంది. కాగా గ్రూప్ ఎ లో భారత్ తొలి మ్యాచ్ 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత ఆడిన 12 వన్డేల్లో కేవలం 4 మ్యాచ్‌లనే బంగ్లాదేశ్ నెగ్గింది. 2007 వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాకు బంగ్లా షాకిచ్చింది. అయితే బంగ్లా క్రికెటర్లకు 50 ఓవర్ల క్రికెట్ ప్రాక్టీస్ కూడా లేదు. వీరంతా నేరుగా బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ నుంచి వచ్చారు.

కెప్టెన్ షాంటోతో పాటు, మహ్మదుల్లా, ముష్ఫికర్ రహీం, ముస్తాఫిజుర్‌పైనే బంగ్లా ఎక్కువగా ఆధారపడి ఉంది. దీంతో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో భారీ విజయం సాధించి సెమీస్ అవకాశాలు మెరుగుపర్చుకోవాలని భారత్ భావిస్తోంది. ఇక 23న దుబాయ్ వేదికగా దాయాదులు తలపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా పాకిస్థాన్ బరిలోకి దిగుతోంది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్‌పైనే పాక్ విజయం సాధించి టైటిల్‌ను నెగ్గింది. ఆ మ్యాచ్ ఓటమికి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవాలని భారత్ పట్టుదలతో ఉంది. కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, సల్మాన్ అఘా మంచి ఫామ్‌లో ఉండటం పాక్‌కు కలిసొచ్చే అంశం. స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ పరుగులు చేయడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఫామ్‌లో ఉన్న యువ సంచలనం సయిమ్ అయుబ్ గాయం కారణంగా వైదొలగడం పాక్‌కు నష్టమే. పాక్ పేస్ త్రయం షహీన్, రవూఫ్, నసీమ్ భారత్‌పై అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నారు. మరోపక్క భారత్‌కు న్యూజిలాండ్ నుంచి కఠిన సవాల్ తప్పదు. ఆ జట్టులోని ప్రధాన బ్యాటర్లు డేవన్ కాన్వే, టామ్ లేథమ్, కేన్ విలియమ్సన్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ మంచి ఫామ్‌లో ఉన్నారు. అయితే, ప్రధాన పేసర్లు టిమ్ సౌథీ, ట్రెంట్ బౌల్ట్, లాకీ ఫెర్గూసన్ లేకుండానే ఆడనున్న నేపథ్యంలో న్యూజిలాండ్ పేస్ విభాగం కాస్త బలహీనంగానే ఉంది. కివీస్ బౌలింగ్‌తో పోలిస్తే బ్యాటింగ్ బలంగా ఉంది.

## పింక్ లేడీస్ కప్ ఫుట్‌బాల్ టోర్నీకి..
# భారత్ జట్టు ఖరారు
### తెలంగాణ అమ్మాయికి చోటు

**న్యూఢిల్లీ:** నాలుగు దేశాలు పాల్గొనే పింక్ లేడీస్ కప్ అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్ కోసం భారత జట్టును ప్రటించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జాలో ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ఈ టోర్నీ జరుగుతుంది. 23 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణ అమ్మాయి, నిజామాబాద్ జిల్లాకు చెందిన గుగులోత్ సౌమ్య చోటు సంపాదించింది.



7 నుంచి అనంతపురంలో శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న భారత జట్టు మంగళవారం యూఏఈకి బయలుదేరివెళ్లింది. భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను ఈనెల 20న జోర్డాన్‌తోను, రెండో మ్యాచ్‌ను 23న రష్యాతో, మూడో మ్యాచ్ 26న దక్షిణకొరియా జట్టుతో ఆడుతుంది. ఈ ఏడాది మే-జూన్‌లో జరిగేఆసియా కప్-2027 క్వాలిఫయర్స్ టోర్నీకి సన్నాహాల్లో భాగంగా పింక్ లేడీస్ కప్‌లో భారత జట్టు బరిలోకి దిగుతోంది. పింక్ లేడీస్ కప్ టోర్నీ ద్వారా భారత క్రీడాకారిణులకు తమ సామర్థ్యమేంటో తెలుస్తుంది. కాగా రష్యాతో పోలిస్తే దక్షిణ కొరియా జట్టు పూర్తి భిన్నంగా ఉంటుంది. రష్యా శైలితో పోలిస్తే కొరియా ఆటలో చాలా వేగం ఉంటుంది. ఈ జట్ల బలా బలాలను పరిగణనలోకి తీసుకుని భారత జట్టు రెండు రకాలుగా వ్యూహాలు రచించి ఆడాల్సి ఉంటుంది. ఇక ఈ పింక్ లేడీస్ కప్‌లో తలపడే భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో ఎలాంగ్‌బమ్ పంథోయ్ చాను, పాయల్ బసుదె, శ్రేయా హుడా (గోల్కీపర్లు), అరుణ బాగ్, కిరన్ పిస్దా, మార్టినా థోక్‌చోమ్, నిర్మలా దేవి ఫాన్‌జుబమ్, పూర్ణిమ కుమారి, సంజు, సిల్కీ దేవి హెమమ్, స్వీటీ దేవి ఎన్‌గాంగ్బమ్ (డిఫెండర్లు), బబీనా దేవి లిషామ్, గ్రేస్ డాంగ్మె, మోసుమి ముర్ము, ప్రియదర్శిని సెల్లాదురై, ప్రియాంక దేవి నోరెమ్, రత్నబాల దేవి నోంగ్మైథెమ్ (మిడ్ ఫీల్డర్లు), కరిష్మా పురుషోత్తమ్, లిండా కోమ్ సెర్టో, మనీషా, రేణు, సంధ్య రంగనాథన్, సౌమ్య గుగులోత్ (ఫార్వర్డ్స్) ఉన్నారు.



## మహిళల ప్రీమియర్ లీగ్‌లో దూసుకుపోతున్న
# రాయల్ ఛాలెంజర్స్
### రాణించిన స్మృతి, రేణుక
#### 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలుపు

**ఢిల్లీ:** ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు దూసుకుపోతోంది. టోర్నీ తొలి పోరులో గుజరాత్ జెయింట్స్‌ను అలవోకగా ఓడించిన బెంగుళూరు టీమ్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. వడోదరలో ఏకపక్షంగా సాగిన పోరులో గత ఏడాది రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. ముందుగా పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన రాయల్ ఛాలెంజర్స్ ఆ తర్వాత స్మృతి వ్యాట్ దూకుడైన బ్యాటింగ్‌తో మరో 22 బంతులు మిగిలి ఉండగానే గెలుపు పూర్తి చేసుకుంది. దీంతో ఈ మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో ఢిల్లీపై గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 19.3 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (22 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్సు) టాప్ స్కోరర్‌గా నిలవగా, సారా బ్రైస్ (19 బంతుల్లో 23; 2 ఫోర్లు) కాస్త పోరాడింది. మిగతా బ్యాటర్లంతా విఫలం కావడంతో జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రేణుకా సింగ్ (3/23), జార్జియా వేర్‌హామ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా గార్త్, బిష్త్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం బెంగళూరు 16.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. స్మృతి మంధాన (47 బంతుల్లో 81; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), డానీ వ్యాట్ (33 బంతుల్లో 42; 7 ఫోర్లు) తొలి వికెట్‌కు 65 బంతుల్లోనే 107 పరుగులు జోడించి జట్టు విజయాన్ని సునాయాసం చేశారు. స్కోరు వివరాలు చూస్తే ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌లో లానింగ్ (సి) పెరి(బి) గార్త్ 17; షఫాలీ (సి) స్మృతి (బి) రేణుక 0; జెమీమా (స్టంప్డ్) రిచా (బి) వేర్హామ్ 34; నెదర్లాండ్ (సి) స్మృతి (బి) రేణుక 19; కాప్ (సి) వ్యాట్ (బి) బిష్త్ 12; జొనాసెన్ (సి) కనిక (బి) బిష్త్ 1; బ్రైస్ బ్రై (స్టంప్డ్) రిచా (బి) వేర్హామ్ 23; శిఖా (సి) బిష్త్ (బి) రేణుక 14; రాధ (సి అండ్ బి) వేర్హామ్ 0; అరుంధతి రెడ్డి (సి) పెరి (బి) గార్త్ 4; మిన్ను మణి (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (19.3 ఓవర్లలో ఆలౌట్) 141. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్‌లో స్మృతి (సి) అరుంధతి (బి) శిఖా 81; డానీ వ్యాట్ (సి) జెమీమా (బి) అరుంధతి 42; ఎలీస్ పెరి(నాటౌట్) 7; రిచా (నాటౌట్) 11; ఎక్స్ట్రాలు 5; మొత్తం (16.2 ఓవర్లలో 2 వికెట్లకు) 142 పరుగులుగా ఉంది.

# వాణిజ్యం

# బంగారం దిగుమతులు పైపైకి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** జనవరిలో దేశంలో బంగారం దిగుమతులు 40.79శాతం పెరిగి 2.68 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దేశీయ డిమాండ్ పెరగడం వల్ల బంగారం దిగుమతులు పెరిగాయి. ఈ సమాచారం వాణిజ్య మంత్రిత్వ శాఖ డేటా నుంచి అందింది. ఒక సంవత్సరం క్రితం జనవరి 2024లో బంగారం దిగుమతులు 1.9బిలియన్ డాలర్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జనవరి కాలంలో బంగారం దిగుమతులు 32శాతం పెరిగి 50 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 37.85 బిలియన్ డాలర్లుగా ఉంది. దిగుమతుల పెరుగుదల ఈ విలువైన లోహాన్ని సురక్షితమైన ఆస్తిగా పెట్టుబడిదారుల బలమైన విశ్వాసాన్ని కూడా సూచిస్తుంది. ప్రపంచ అనిశ్చితుల కారణంగా పెట్టుబడులను వైవిధ్య పరచడానికి బంగారంలో పెట్టుబడి పెట్టడం, బ్యాంకుల నుంచి డిమాండ్, కస్టమ్ డ్యూటీ తగ్గింపు ఇతర కారణాలు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ యేడాది ఇప్పటి వరకు బంగారం ధర 11శాతం పెరిగి 10గ్రాములకు రూ.88,200కి చేరుకుంది. 2023-24లో భారత దేశ బంగారం దిగుమతులు 30శాతం పెరిగి 45.54బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. బంగారం దిగుమతులు దేశ కరెంట్ లోటుపై ప్రభావం చూపుతాయి. బంగారం దిగుమతులలో స్విట్జర్లాండ్ అతిపెద్ద వనరుగా ఉంది. దీని వాటా దాదాపు 40శాతం. దీని తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (16శాతం కంటే ఎక్కువ), దక్షిణాఫ్రికా (సుమారు 10శాతం) ఉన్నాయి. దేశ మొత్తం దిగుమతుల్లో ఈ విలువైన లోహం వాటా ఐదు శాతం కంటే ఎక్కువ. బంగారం దిగుమతుల పెరుగుదల జనవరిలో దేశ వాణిజ్య లోటు (దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసం) 23 బిలియన్ డాలర్లకు చేరుకుంది. చైనా తర్వాత భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు దేశం. దిగుమతులు ప్రధానంగా ఆభరణాల పరిశ్రమ అవసరాల కోసమే. గత నెలలో రత్నాలు, ఆభరణాల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 15.95శాతం పెరిగి దాదాపు 3 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. జనవరిలో దేశంలో వెండి దిగుమతులు 82.84 శాతం పెరిగి 883.2 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.



## ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ ధ్వజం

**ముంబై, ఫిబ్రవరి 18:** ప్రముఖ ఐటిదిగ్గజ సంస్థలైన కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్‌ల మధ్య పోరు కొనసాగుతోంది. యుఎస్‌లో ఓ దావాపై ఈ ఇరు సంస్థలు గత కొంతకాలంగా పోరాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ పెద్ద ఎత్తున ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తమ హెల్త్ కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలని ఇన్ఫీ దొంగిలించిందని విమర్శించింది. ఈ విషయాన్ని ఉటంకిస్తూ కొన్ని కథనాలు వెలువడ్డాయి. నాన్ డిస్‌క్లోజర్ అండ్ యాక్సెస్ అగ్రిమెంట్ ద్వారా ట్రైజెట్టో వాణిజ్య రహస్యాలను దుర్వినియోగం చేస్తూ ఇన్ఫోసిస్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిందంటూ కాగ్నిజెంట్ ఆరోపించింది. అంతేకాదు, ఈ విషయంపై ఆడిట్ చేసేందుకు ఆ కంపెనీ నిరాకరించిందని కాగ్నిజెంట్ తెలిపింది. హెల్త్ కేర్ సాఫ్ట్‌వేర్ ట్రైజెట్టో నుంచి వాణిజ్య రహస్యాలను ఇన్ఫోసిస్ దొంగిలించిందని ఆరోపించిన కాగ్నిజెంట్ 2024 ఆగస్టులో అమెరికా కోర్టులో దావా వేసింది. ఈ ఆరోపణల్ని ఇన్ఫోసిస్ తిరస్కరించింది. కాగ్నిజెంట్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్ బహిరంగంగా ఉన్నాయని తెలిపింది. అంతేకాకుండా ప్రస్తుతం కాగ్నిజెంట్‌లో ఉన్న రవికుమార్, తమవద్ద పనిచేసిన సమయంలో హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ విడుదల చేయడాన్ని ఆలస్యం చేశారని




ఇన్ఫోసిస్ ప్రత్యారోపణలు చేసింది. కాగ్నిజెంట్‌లో ఉద్యోగం కోసం ఆయన చర్చలు జరిపారని పేర్కొంది. ఇన్ఫోసిస్ అధ్యక్షుడిగా వ్యవహరించిన రవికుమార్ 2022 అక్టోబర్‌లో ఆసంస్థను విడిచిపెట్టారు. ఆ మరుసటి యేడాది జనవరిలోనే కాగ్నిజెంట్‌లో సిఇఒగా చేరారు. ఈ రెండు ఐటి కంపెనీలు ఆరోగ్య సంరక్షణ సేవల రంగంలో పోటీపడుతున్నాయి. ఇన్ఫోసిస్ ఆదాయంలో దాదాపు 7.5శాతం లైఫ్ సైన్సెస్ విభాగం నుంచి పొందుతోంది.

## భారత్‌లో టెస్లా నియామకాలు షురూ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** టెక్ దిగ్గజం టెస్లా భారత్ మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు ఎంతో కాలంగా ప్రయత్నాలుచేస్తోంది. కానీ సుంకాలు, ఇతరత్రా కారణాలతో ఆ ప్రణాళికలు ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు అందుకు సంబంధించి కీలక ముందడుగు పడినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ కంపెనీ భారత్‌లో నియామకాల ప్రక్రియ చేపట్టి, ఎంట్రీపై సంకేతాలిచ్చింది. భారత ప్రధాని నరేంద్రమోడీతో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ భేటీ అయిన కొన్ని రోజులకే ఈ పరిణామాలు చోటు చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. కస్టమర్ రిలేటెడ్, బ్యాక్‌ఎండ్ జాబ్ సహా 13 ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులు కావాలంటూ టెస్లా సోమవారం తమ లింక్డిన్ పేజీలో ఓ ప్రకటన చేసింది. ఇందులో సర్వీస్ టెక్నీషియన్, అడ్వైజరీ సహా కనీసం ఐదు పొజిషన్లకు ఉద్యోగులను ముంబై, ఢిల్లీ రెండు చోట్లా నియమించుకోనున్నట్లు కంపెనీ తెలిపింది. ఇక కస్టమర్ ఎంగేజ్‌మెంట్ మేనేజర్, డెలివరీ ఆపరేషన్స్ స్పెషలిస్ట్ వంటి ఉద్యోగులను కేవలం ముంబై కేంద్రంగా తీసుకోనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు 2021 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం 'ఇవి'లపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించాలని మస్క్ కంపెనీ డిమాండ్ చేసింది. ఇందుకు కేంద్రప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. దేశీయంగా తయారీ ప్రారంభించడంతో పాటు ప్రాంతీయంగానే విడిభాగాలు కొనుగోలు చేయాలన్న కండీషన్ పెట్టింది. ఇందుకు మస్క్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీంతో టెస్లా ఎంట్రీ ఆలస్యమవుతూ వస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల 40వేల డాలర్ల కంటే ఎక్కువ ఖరీదైన హైఎండ్ కార్లపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 110 శాతం నుంచి 70శాతానికి తగ్గించింది. మరోవైపు గత వారం అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీతో మస్క్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సుంకాల అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. తాజా పరిణామాలతో త్వరలోనే దేశీయ రోడ్లపై టెస్లా కార్లు చక్కర్లు కొట్టే అవకాశాలున్నట్లు ఆటో రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. రోజంతా తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొన్న సూచీలు, చివరికి ఫ్లాట్‌గా ముగిసాయి. సెన్సెక్స్ 20 పాయింట్లు క్షీణించి 75,967 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 14 పాయింట్లు నష్టపోయి 22,945 పాయింట్ల వద్ద నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటిసి, టిసిఎస్, సన్‌ఫార్మా, ఏసియన్ పెయింట్స్, ఐసిఐసిఐ బ్యాంకు, టాటా మోటార్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. ఎన్‌టిపిసి, టెక్ మహీంద్రా, జొమాటో, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, కోటక్ మహీంద్రా బ్యాంకు, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్‌బ్యారెల్ ధర 75.84డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2,925.20 డాలర్ల వద్ద నిలిచింది. అదేవిధంగా డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.96 వద్ద స్థిరపడింది.



## రూ.81వేల కోట్లు బిగ్ ఇన్వెస్టర్ల సంపద హుష్‌కాకి!

**ముంబై, ఫిబ్రవరి 18:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గత కొన్ని నెలలుగా తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) విక్రయాలతో సూచీలు భారీగా పతనమయ్యాయి.దీంతో చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలు కరిగిపోయాయి. ముఖ్యంగా కొత్తగా మార్కెట్లోకి వచ్చినవారు ఈ నష్టాలు చూసి తలలు పట్టుకుంటున్నారు. సాధారణ ఇన్వెస్టర్లే కాదు, దేశంలోని పెద్ద పెద్ద ఇన్వెస్టర్లుగా పేరొందిన వారి పోర్ట్‌ఫోలియోలూ ఇందుకు మినహాయింపు కాదని తాజా డేటా చెబుతోంది. సెన్సెక్స్ గతేడాది గరిష్ఠంగా 85వేల మార్కు దాటింది. నిఫ్టీ కూడా 26వేలమార్కును అందుకుంది. ఆ తర్వాత మొదలైన అమ్మకాల ఒత్తిడితో రెండు బెంచ్‌మార్క్ సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 11శాతం కరెక్షన్‌కు లోనైంది. నిఫ్టీ ఏకంగా 15శాతం క్షీణించి 22,800 పాయింట్ల స్థాయి వద్ద కొనసాగింది. డీమార్ట్ పేరుతో రిటైల్ చైన్ నిర్వహిస్తున్న రాధాకృష్ణ దమానీ వ్యాపారవేత్తే కాదే, ప్రఖ్యాత ఇన్వెస్టర్ కూడా. ఆయన సంపద అక్టోబరు 1 నుంచి దాదాపు 28వేల మేర క్షీణించింది. అంటే దాదాపు రూ.64వేల కోట్లు కోల్పోయారు. ఆయన పోర్ట్‌ఫోలియో విలువ రూ.2.31 లక్షల కోట్ల నుంచి రూ.1.67 లక్షల కోట్లకు తగ్గింది. ఒక్క దమానీ మాత్రమే కాకుండా ప్రముఖ ఇన్వెస్టర్ల దివంగత రాకేష్ ఝున్‌ఝున్‌వాలా కుటుంబం కూడా 18శాతం విలువను కోల్పోయింది. ప్రస్తుతం ఆ కుటుంబం పోర్ట్‌ఫోలియో విలువ రూ.59,709 కోట్లుగా ఉంది. వీరితో పాటు హేమంత్ కొఠారి 28శాతం, ఆకాష్ బన్సాలీ 15శాతం చొప్పున వారి పోర్ట్‌ఫోలియోలు క్షీణించాయి. ముకుల్‌అగర్వాల్, ఆశిష్‌ధావన్, నిమేశ్ షా, యుసప్పాలీ కదేర్, ఆశిష్ కచోలియా, అనిల్‌కుమార్ గోయల్ వంటివారు ఈటాప్-10 జాబితాలోఉన్నారు.వీరితోపాటు విజయ్‌కేడియా, హితేష్ దోషి, విశ్వాస్ పటేల్, అనుజ్ సేథ్ వంటి పేరొందిన ఇన్వెస్టర్ల సంపదా ఆవిరైంది.



## జియో థింగ్స్‌తో ప్యూర్ 'ఇవి' టైఅప్

**ముంబై, ఫిబ్రవరి 18:** ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీదారు ప్యూర్ 'ఇవి' తన ఉత్పత్తుల్లో స్మార్ట్ డిజిటల్ క్లస్టర్లను ఏకీకృతం చేయడానికి జియో ప్లాట్‌ఫామ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జియో థింగ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం వల్ల అధునాతన ఐఒటి పరిష్కారాలు, అంతరాయం లేని కనెక్టివిటీ, పూర్తి డిజిటల్ ఇంటిగ్రేషన్‌ను అందించేందుకు తోడ్పడుతుందని కంపెనీ తెలిపింది. జియోథింగ్స్ ఇంటిగ్రేషన్ సాయంతో ద్విచక్రవాహనంలో ఎంటర్‌టైన్‌మెంట్, నావిగేషన్ సేవలు వంటి వాటిని వాయిస్ ద్వారా నియంత్రించవచ్చని సంస్థ తెలిపింది. వాహనదారులు వారి ప్రాధాన్యతలకు అనుగుణంగా వాహనంలోని టెక్నాలజీ ఇంటర్‌ఫేస్‌ను మార్చుకోవచ్చు. అందుకోసం వాయిస్ కమాండ్లను ఉపయోగించవచ్చు. దాంతో మెరుగైన రైడింగ్ అనుభూతిని పొందవచ్చని కంపెనీ స్పష్టం చేసింది. ప్యూర్ 'ఇవి' జియోథింగ్స్ స్మార్‌డిజిటల్ క్లస్టర్ల సాయంతో ఎండ్-టు-ఎండ్ ఐఒటి పరిష్కారాలు అందించేందుకు ప్రయత్నిస్తుంది. వాహనాల పనితీరును ట్రాక్ చేయడానికి 4జి కనెక్టివిటీ ఎనేబుల్ చేసిన టెలిమాటిక్స్ ద్వారా రియల్ టైమ్‌లో వాహనంకండిషన్‌ను పర్యవేక్షించవచ్చు. ఇందుకోసం జియోథింగ్స్ 4జి స్మార్ట్ డిజిటల్ క్లస్టర్ ఆండ్రాయిడ్ ఓపెన్ సోర్స్ ప్రాజెక్ట్ (ఎఒఎస్‌పి) 'అన్ని ఒఎస్'ను ఉప యోగిస్తుంది. ఇది రియల్ టైమ్ డేటా అనలిటిక్స్, టూ వీలర్ ఇంటర్‌ఫేస్ కస్టమైజేషన్, ఫుల్ హెచ్‌డి టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే కంపాటబిలిటీని అందిస్తుంది. జియోస్టోర్, మ్యూజిక్ స్ట్రీమింగ్, వెబ్‌బ్రౌజింగ్, హ్యాండ్స్ ఫ్రీవాయిస్ అసిస్టెన్స్, నావిగేషన్, గేమింగ్‌తో పాటు మరెన్నో సదుపాయాలను అందిస్తున్నారు. జియో థింగ్స్ ఐఒటి టెక్నాలజీసాయంతో ప్యూర్ 'ఇవి' ఉత్పత్తులను పరిశ్రమ అత్యున్నత ప్రమాణాలకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు, ఎండి డాక్టర్ నిశాంత్ డోంగారి అన్నారు. వాహనాల సామర్థ్యం, ఎలక్ట్రిక్ మొబిలిటీని పెంచాలనిలక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సంస్థ వినియోగదారులకు సాంకేతికతసాయంతో మెరుగైన కనెక్టివిటీ,ఫంక్షనాలిటీని అందించనున్నట్లు చెప్పారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.